అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 18-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 138 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



నేత కాదు..నీతి ముఖ్యం..

బీజేపీ బలం పడిపోతోంది ఇండియా బ్లాక్‌కు ఆదరణ పెరుగుతోంది

- కాషాయ పార్టీ మత సమీకరణకు ప్రయత్నిస్తోంది
- రాజ్యాంగం, లౌకిక విలువలకు విఘాతం కలుగుతోంది
- రాజ్యాంగ నియమాలను నీరుకారుస్తున్నారు
- బీజేపీ సవాలును ఎదుర్కొనే సత్తా ప్రాంతీయ పార్టీలకు ఉంది

న్యూఢిల్లీ : ఇండియా బ్లాక్‌లో నరేంద్ర మోడీకి ప్రత్యామ్నాయ నేత ఎవరన్నది ముఖ్యం కాదని, అనుసరించే ప్రత్యామ్నాయ విధానాలే (నీతి) ముఖ్యమని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకూ జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో బీజేపీ బలపడలేదని, ప్రజలు ఇండియా కూటమికే చేరువ అవుతున్నారని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరిగే అవకాశమే లేదని, వాస్తవానికి అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీ బలం తగ్గిపోయిందని చెప్పారు. ప్రధాని మోడీ, ఇతర బీజేపీ నేతలు తమ ఎన్నికల ప్రచారంలో ప్రజా సమస్యలను ఏ మాత్రం ప్రస్తావించడం లేదని విమర్శించారు. మతపరమైన సమీకరణ కోసం బీజేపీ ఎత్తుగడలు పన్నుతోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల సమరంలో నాలుగు దశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో 'ది హిందూ' పత్రికకు ఏచూరి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రజలు మాకు చేరువ అవుతున్నారు

నాలుగు దశల పోలింగ్ తర్వాత ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని ప్రతిపక్షాలు అభిప్రాయపడుతున్న మాట నిజమే. దీనికి ఓ ప్రాతిపదిక ఉంది. ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి బీజేపీకి అనుకూలంగా ఓటు వేయలేదు. గత రెండు ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ అనుకూలంగా జరిగింది. ఇప్పుడది లేదు. ఇది మొదటి సూచిక. ఇక రెండోది... ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పక్కనపెట్టి నరేంద్ర మోడీ, ఇతర బీజేపీ నేతలు లేవనెత్తిన అంశాలేవీ వాస్తవానికి ప్రజలను ఆకర్షించలేదు. ఉదాహరణకు మీ ఆస్తులు గుంజుకొని ముస్లింలకు ధారాదత్తం చేస్తారని, మీ రిజర్వేషన్లు ...3లో

'ది హిందూ' ఇంటర్వ్యూలో సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

నేడు రాష్ట్ర క్యాబినెట్

విభజన సమస్యలు, రైతు రుణమాఫీపై చర్చ

- ఆదాయం పెంపు, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి
- కీలక నిర్ణయాలు తీసుకోనున్న మంత్రి వర్గం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గం శనివారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరగనున్న క్యాబినెట్ సమావేశం కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వచ్చే నెల రెండో తేదీతో తెలంగాణ ఏర్పాటై పదేండ్లు పూర్తవుతుంది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు సైతం ముగియనుంది. వివిధ కార్పొరేషన్లు, సంస్థల విభజన వ్యవహారం ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో విభజన అంశాలు కీలకం కానున్నాయి. దీంతో పాటు రైతు రుణమాఫీపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై తగు నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్ర ...6లో

ముందు నుయ్యి..వెనుక గొయ్యి

వర్షాకాలం రానే వచ్చింది


- మేడిగడ్డ మరమ్మతులు సాధ్యమేనా?
- నిధుల ఖర్చుపై చేతులెత్తేసిన ఎల్అండ్‌టీ !!
- నేడు క్యాబినెట్‌లో చర్చ

వివరాలు 6లో

రాజ్యాంగ విధ్వంసం

పదేండ్ల పాలనలో మోడీ తీరు

పార్లమెంటులో ప్రతిపక్షాలకు దక్కని గౌరవం



- నియమ, నిబంధనలకు పాతర
- గత ఐదేండ్లుగా లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ లేరు
- పదేండ్లలో ప్రధాని నుంచి ఒక్క పత్రికా సమావేశమూ లేదు
- ఈ తీరు దేశానికి, రాజ్యాంగానికి మంచిది కాదు

మేధావులు, నిపుణులు, విశ్లేషకుల ఆందోళన

రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న దనీ, మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వస్తే ఇదే జరుగుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు తరచూ ఇవే ఆరోపణలు చేస్తున్నాయి. అయితే, మోడీ గత పదేండ్ల పాలనను చూస్తే ప్రతిపక్షాల ఆరోపణలు నిజమేనన్న భావన కలుగుతున్నదని మేధావులు, విశ్లేషకులు, ప్రముఖ జర్నలిస్టులు అంటున్నారు.

న్యూఢిల్లీ : రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు మోడీ తెస్తున్న ముప్పు స్పష్టమైనదేననీ, ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తన దశాబ్ద పాలనలో మోడీ తానే రాజ్యాంగం అన్న విధంగా వ్యవహరించారనీ, నిబంధనలకు పాతరేసి పాలన కొనసాగించారని రాజకీయ విమర్శకులు అంటున్నారు.

"ఏ ప్రధానమంత్రీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయరు. కానీ, మోడీ తన చర్యలు, అతని మద్దతుదారుల చర్యల ద్వారా రాజ్యాంగానికి ముప్పును కలిగించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రధాని చాలా కీలకం. అయితే, ఈ పదేండ్ల కాలంలో లోక్‌సభలో, ఆ తర్వాత ఉభయ సభల్లో బీజేపీ తన మెజారిటీని చూసుకొని ప్రజాస్వామ్యాన్ని కాలరాసింది. ప్రతిపక్షాలను చిన్నచూపు చూసింది" అని వారు అంటున్నారు.నియమ, నిబంధనలను తుంగలో తొక్కటమేగాక.. ప్రతిపక్షాలను చిన్న చూపు చూస్తూ రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టిన సందర్భాలు మోడీ పాలనలో అనేకం చోటు చేసుకున్నాయి. ప్రధానిగా మోడీ ప్రజలచే ఎన్నుకోబడిన నాయకుడు కాబట్టి ఆయనపై విమర్శలు, దాడులు చేయకూడదనే బీజేపీ శ్రేణులు రూపొందించిన సిద్ధాంతం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమే. గత పదేండ్లలో లోక్‌సభ, రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మోడీ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవటం గమనార్హం. అయితే, రాజ్యాంగం విషయంలో ప్రధాని ఎంత తక్కువ శ్రద్ధ చూపుతున్నారో ఇది స్పష్టం చేస్తున్నదని అంటున్నారు. ప్రశ్నోత్తరాల సమయం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఆత్మగా పరిగణించబడుతుంది. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఏ ప్రశ్ననైనా లేవనెత్తవచ్చు. కానీ మోడీ పాలనా కాలంలో ప్రశ్నోత్తరాలు ప్రశ్నార్థకంగా మారాయి. ఇక, మే 2014 నుంచి మోడీ ఒక్క విలేకరుల సమావేశంలో కూడా ప్రసంగించకపోవడం గమనార్హం. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో గత ఐదేండ్లుగా డిప్యూటీ స్పీకర్ లేకపోవటం 17వ లోక్‌సభకే చెల్లింది. అయితే, ఇదంతా మోడీ ప్రణాళికేనని విశ్లేషకులు ...13లో

ఏచూరి, దేవరాజన్ ప్రసంగాలు సెన్సార్

దూరదర్శన్, ఆకాశవాణి 'అధికార నియంతృత్వం'

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ ప్రసంగాల్లోని కొన్ని పదాలను దూరదర్శన్, ఆకాశవాణిలు తొలగించాయి. 'మత నియంతృత్వ ప్రభుత్వం, క్రూరమైన చట్టాలు, ముస్లింలు' వంటి పదాలను వారి ప్రసంగాల నుంచి తీసివేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ...6లో

అలా చేసి ఉంటే.. నన్ను ఉరి తీయాలి



- ప్రతిపక్షాల ఆరోపణలపై ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : కొంతమంది సంపన్నులకు మద్దతిస్తున్నానంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ప్రధాని మోడీ బదులిచ్చారు. తానేదైనా నిజాయితీ లేని పని చేసి ఉంటే తనను ఉరి తీయాలన్నారు. ఒక జాతీయ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా దేశంలో సంపద ...13లో

నా బిడ్డను మీకు అప్పగిస్తున్నా

రాయ్‌బరేలీ ర్యాలీలో సోనియా గాంధీ భావోద్వేగ ప్రకటన



రాయబరేలీ: రాయబరేలీ ప్రజల ప్రేమ కారణంగా తాను ఒంటరిగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలగలేదని సోనియాగాంధీ అన్నారు. 'ఈరోజు నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా. అతన్ని ఆదరించండి. నన్ను ఎలా ఆదరించారో అలా నా బిడ్డని కూడా గుండెల్లో పెట్టుకోండి. రాహుల్ మీ ఆశలను వమ్ము చేయడు' అంటూ సోనియా భావోద్వేగానికి గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ తన కుటుంబం లాంటిదని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి సోనియాగాంధీ రాయబరేలీలో శుక్రవారం నాడు ప్రసంగించారు. సోనియాగాంధీతో పాటు ఆయన కుమారుడు, రాయబరేలీ కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకగాంధీ ...6లో

మోడీ పర్యటనకు ముందు అదుపులోకి ఉల్లి రైతులు

ఉల్లి ఎగుమతి ధరల విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం



- నిరసనలకు సిద్ధమవుతున్న తరుణంలో నిర్బంధం
- తమ కోసం ఎవరూ మాట్లాడలేదని అన్నదాతల ఆందోళన

వివరాలు 6లో

సన్న వడ్లకేనా..?

రూ.500 బోనస్ ఆ వడ్లకేనంటూ సీఎం ప్రకటన





- రైతుల్లో ఆందోళన
- సాగుపై సందిగ్ధం
- వరి సాగులో 90 శాతం దొడ్డు రకమే
- యాసంగిలో సన్నరకం కష్టం
- ఖరీఫ్‌లో సాగు చేసినా అధిక తెగుళ్ల బెడద, సరిపడా దిగుబడి రాదు
- అన్ని రకాల వడ్లకూ బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'సన్న రకాల ధాన్యం పండించిన రైతులకే రూ.500 బోనస్ ఇస్తాం. దొడ్డు రకం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేస్తుంది. హాస్టళ్లు, రేషన్‌కార్డులపై సన్న బియ్యం పంపిణీ కోసం సన్నొడ్లను పండించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి మనుసులోని మాటను వ్యక్తం చేశారు.

సీఎం వ్యాఖ్యలను బట్టి పరిశీలిస్తే.. కేవలం సన్న రకాల ధాన్యం పండించిన రైతులకు మాత్రమే బోనస్ ఇచ్చి దొడ్డు రకం వడ్లు పండించే రైతులకు ఇవ్వరనేది స్పష్టమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో మాత్రం రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక కేవలం సన్న వడ్లకే ఇస్తామనడంతో రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో ఏ రకం వడ్లను సాగు ...13లో

ధాన్యం సేకరణ త్వరగా పూర్తిచేయండి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ధాన్యం కొనుగోళ్లు, సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సాధ్యమైనంత ...13లో

సర్కారు డైలమా..?

స్థానిక సమరంపై తర్జనభర్జన

- కీలకం కానున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు
- అనుకూలంగా రాకుంటే..ప్రత్యేక అధికారుల పాలన పొడిగింపు?
- దీనిపై క్యాబినెట్‌లోనూ చర్చించే అవకాశం
- అలర్ట్‌గా ఉండాలంటూ శ్రేణులకు టీపీసీసీ ఆదేశం


తెరపైకి బీసీ కుల గణన అంశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకెళ్లాలా? వెనకడుగు వేయాలా? అనే దానిపై రాష్ట్ర సర్కారు డైలమాలో పడింది. లోక్‌సభ ఫలితాల అనంతరం రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయం తీసుకుకోవచ్చేనే చర్చ నడుస్తున్నది. లోక్‌సభ ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తే వెంటనే స్థానిక సమరానికి వెళ్లే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ క్రాస్ ...13లో

సుందరయ్య వర్ధంతి సందర్భంగా పుస్తకాలపై 40 శాతం తగ్గింపు



- నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ పుస్తక ప్రియులకు భారీ ఆఫర్‌ను ప్రకటించింది. తన పరిధిలోని అన్ని బ్రాంచీల్లో పుస్తకాలపై శని, ఆదివారాల్లో 40 శాతం తగ్గింపు ఇస్తున్నట్టు పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కె.ఆనందాచారి, జనరల్ మేనేజర్ ఆర్.వాసు తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పుస్తక ప్రియులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు సూచించారు.

కనీస వేతనం రూ.69,150 నిర్ణయించాలి

- పీఆర్సీ చైర్మెన్‌కు టీఎస్టీయూ ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు కనీస వేతనం రూ.69,150 నిర్ణయించాలని టీఎస్టీయూ కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి శుక్రవారం కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. 35 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన స్థిరీకరణ చేయాలనీ, గతేడాది జులై ఒకటి నుంచి ప్రకటించాలని కోరారు. ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీ తదితర పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ల వేతనంతో పోలిస్తే అంతరం పెరిగిందనీ, దాన్ని తగ్గించాలని తెలిపారు. అప్రయత్న పదోన్నతి పథకాన్ని 4/8/12/16/20/24గా నిర్ణయించాలని పేర్కొన్నారు. హెచ్ఆర్ఏ గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం, మున్సిపాల్టీల్లో 17 శాతం, కార్పొరేషన్, జిల్లా కేంద్రాల్లో 20 శాతం, హెచ్ఎండీఏ పరిధిలో 25 శాతం ప్రతిపాదించాలని సూచించారు. గ్రాట్యూటీ రూ.25 లక్షలకు పెంచాలని తెలిపారు.

భారీవర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి వెంకట్‌రెడ్డి ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వర్షాలను దృష్టిలోపెట్టుకుని సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష చేశారు. దీనికి ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయి, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ రజాక్, ఆర్అండ్ బీ ఈఎన్సీ గణపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల మూలంగా అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ రహదారిపై 17 బ్లాక్‌స్పాట్లను గుర్తించినందున, వాటిని సరిచేయాలని సూచించారు. దీనిమూలంగా పదులసంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇక్కడ ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వివరించారు. అలాగే ఇతర జాతీయ రహదారుల పరిస్థితిపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇదిలావుండగా రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం 2021లో మంజూరు చేసినా, ఇప్పటికీ నిర్మాణం మొదలు కాకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. యుటిలిటీ చార్జీలు చెల్లించలేమని గత ప్రభుత్వం, కేంద్రానికి లేఖ రాసిన కారణంగా ప్రాజెక్టు ఆగిపోయే ప్రమాదమేర్పడిందన్నారు. ఆర్ఆర్ఆర్‌ను ఉత్తర భాగాన 161 కిలోమీటర్లు, దక్షిణ భాగానికి 190 కిలోమీటర్లు మొత్తం 351 కిలోమీటర్లు నిర్మించనున్నట్టు చెప్పారు. భూసేకరణ ప్రక్రియ 70 శాతం పూర్తయిందనీ, ఇంకా 30 శాతం మిగిలిందని వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

42 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- సచివాలయ సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర సచివాలయ సంఘం కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జె దేవేందర్ శుక్రవారం కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. సచివాలయ ఉద్యోగులకు పేస్కేల్ పెంచాలని కోరారు. ఉద్యోగుల పనిదినాలను వారానికి ఆరు రోజుల నుంచి ఐదు రోజులకు తగ్గించాలని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉద్యోగులకు 30 శాతం హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలను అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సంఘం కోశాధికారి డి వంశీధర్‌రెడ్డి, నాయకులు స్వామి, సైదులు, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, కిషోర్, తులసీదాస్, కైలాష్, అలీ, పావని తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఎమ్‌సీసీ అమల్లో ఉంటే చర్యలు ఎలా తీసుకుంటారు?: ఏపీపీటీడీ కమిషనర్‌కు టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ సుందరయ్యపై యాజమాన్యం విధించిన సస్పెన్షన్‌ను తక్షణం ఎత్తివేయాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ రాష్ట్రంలో అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఏపీఎస్ఆర్టీసీ అధికారులు అత్యుత్సాహంతో ఈ చర్యలకు పాల్పడ్డారని అభిప్రాయపడింది. టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కేంద్రం ఆఫీసు బేరర్స్ సమావేశం గురువారం రాత్రి ఆన్‌లైన్‌లో అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఒక పత్రికలో వచ్చిన వార్తను ఆధారం చేసుకొని ఏపీఎస్ ఆర్టీసి అధికారులు ఏలూరులో సుందరయ్యను ఎలా సస్పెండు చేస్తారని సమావేశం ప్రశ్నించింది. ఎలక్షన్ కమీషన్‌కు అభ్యంతరం లేకపోయినా, ఆర్టీసీ అధికారులు అత్యుత్సాహంతో వ్యవహరించి, ప్రభుభక్తిని చాటుకున్నారని అభిప్రాయపడింది. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు రాష్ట్ర కమిటీ పేర్కొంది. సుందరయ్య ఉద్యోగులు నిర్వహించుకున్న సమావేశంలో మాట్లాడారే తప్ప, ఎన్నికల మీటింగుల్లో పాల్గొన లేదనీ, ఏ పక్షానికి అనుకూలంగా ఎలాంటి ప్రచారం చేయలేదని వివరించారు. కేవలం ఓ పత్రికలో వచ్చిన వార్తను చూసి చర్యలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దీనికి కారకులైన అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాసామని టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు.



నిరుద్యోగ తాండవం

- మార్చి త్రైమాసికంలో 6.7 శాతానికి చేరిక
- యువతలో ఏకంగా 17 శాతం
- పీఎల్ఎఫ్ఎస్ డేటా వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగం తాండవం చేస్తోంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) గణంకాల ప్రకారం.. ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో దేశంలో నిరుద్యోగ రేటు 6.7 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం డిసెంబర్ ముగింపు నాటికి ఇది 6.5 శాతంగా నమోదయ్యింది. మోడీ సర్కార్ హయంలో ఉపాధి కల్పన తగ్గిందనడానికి ఈ ప్రభుత్వ గణంకాలే నిదర్శనం. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని.. త్వరలోనే జపాన్, జర్మనీని దాటి మూడో స్థానంలోకి చేరుకోనుందని మోడీ అనుచర వర్గం చేస్తోన్న ప్రకటనలకు ఉద్యోగాల కల్పనకు పొంతన లేకుండా ఉంది. సాధారణంగా ఆర్థిక వ్యవస్థ పెరిగినప్పుడూ.. ఉద్యోగాల సృష్టి జరగాలి. కానీ ఎన్ఎస్ఓ గణంకాలు ఆందోళన కలిగించేలా నిరుద్యోగం ఉంది.

ప్రభుత్వంలోని కీలక శాఖ ఎన్ఎస్ఓ మే 17న విడుదల చేసిన గణంకాల ప్రకారం.. గడిచిన జనవరి - మార్చి త్రైమాసికంలో కరెంట్ వీక్లీ స్టేటస్ (సీడబ్ల్యూఎస్) ప్రకారం.. 15 ఏండ్లు పైబడిన వారిలో నిరుద్యోగం 6.8 శాతంగా చోటు చేసుకుంది. ఇదే త్రైమాసికంలో మహిళల్లో నిరుద్యోగం రేటు స్వల్పంగా 8.5 శాతానికి తగ్గింది. పురుషులలో నిరుద్యోగిత రేటు గడిచిన త్రైమాసికంలో 5.8 శాతం నుండి 6.1 శాతానికి పెరిగిందని పీఎల్ఎఫ్ఎస్ డేటా వెల్లడించింది. 15-29 ఏండ్ల యువత నిరుద్యోగిత రేటు 17 శాతానికి చేరింది. డిసెంబర్ త్రైమాసికంలో ఇది 16.5 శాతంగా ఉంది.

2024 మార్చి త్రైమాసికంలో పట్టణ జనాభాలో పని చేసే లేదా ఉపాధిని కోరుకునే వ్యక్తుల వాటా 50.2 శాతానికి చేరింది. ఇంతక్రితం ఇది 49.9 శాతంగా ఉంది. కాగా.. పట్టణ జనాభాలో స్వయం ఉపాధి కూడా 40.6 శాతానికి తగ్గింది. అంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఇది 40.5 శాతంగా ఉంది. పీఎల్ఎఫ్ఎస్ ప్రకారం.. 2024 జనవరి - మార్చి కాలంలో పట్టణ ప్రాంతాల్లో 15 ఏండ్లు పైబడిన వారిలో నిరుద్యోగం స్వల్పంగా 6.8 శాతానికి తగ్గింది. 2023 మార్చి-జనవరిలో ఇది 6.7 శాతంగా ఉంది.

దేశంలో ముఖ్యంగా యువతలో నిరుద్యోగం అమాంతం పెరుగుతోందని ముంబయి కేంద్రంగా పని చేస్తోన్న సెంటర్ ఫర్ మానిటరీంగ్ ఇండియన్ ఎకనామీ (సీఎంఐఈ) ఈ ఏడాది జనవరిలో ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 20-24 ఏండ్ల మధ్య యువతలో నిరుద్యోగం 44.49 శాతానికి ఎగిసినట్టు వెల్లడించింది. ఇదే సమయంలో 25-29 ఏండ్ల యువతలో 13.35 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. 2024 డిసెంబర్ త్రైమాసికంలో 14.33 శాతానికి ఎగిసి.. మూడున్నరేండ్ల గరిష్ట స్థాయికి.. అంటే కోవిడ్ నాటి స్థాయికి ఎగిసినట్టు విశ్లేషించింది. 30-34 మధ్య యువతలో నిరుద్యోగం 2.06 శాతం నుంచి 2.49 శాతానికి పెరిగి.. రెండున్నరేండ్ల గరిష్ఠ స్థాయికి ఎగిసింది.

నేత కాదు.. నీతి ముఖ్యం..

(మొదటి పేజీ తరువాయి)

లాక్కొని ముస్లింలకు ఇస్తారని, హిందూ మహిళల మంగళసూత్రాలు తీసుకొని ముస్లింలకు అప్పగిస్తారని... చేసిన ప్రచారం ప్రజలకు పట్టలేదు. ధరల పెరుగుదల, జీవనోపాధి, రోజువారీ సమస్యలను గురించే వారు మాట్లాడుతున్నారు. 90 శాతం మంది ప్రజలు తమ మనుగడ కోసం అప్పులు చేస్తున్నారని మీరు ఊహించగలరా? కుటుంబ పొదుపు బాగా పడిపోయింది. అదే సమయంలో కుటుంబ అప్పు గరిష్ట స్థాయికి చేరింది. ఇవి మనుగడకు సంబంధించిన నిజమైన సమస్యలు. అయితే వీటిని ప్రధాని ప్రస్తావించ లేదు. ప్రజా సమస్యలను ప్రధాని పట్టించుకోకపోవడం ప్రతిపక్షాలకు ఉపయోగపడుతోంది. ప్రచారంలో మేము ప్రస్తావిస్తున్న అంశాలతో ప్రజలు ఇండియా కూటమికి బాగా చేరువవుతున్నారు.

బీజేపీ బలం తగ్గుతోంది

అనేక రాష్ట్రాల్లో బీజేపీ బలం పడిపోతోంది. దక్షిణ భారతదేశంతో మొదలు పెడదాం. 2019 ఎన్నికల్లో కర్నాటకలోని 28 స్థానాల్లో బీజేపీ 25 గెలుచుకుంది. అంటే తన బలాన్ని పూర్తి స్థాయిలో కనబరిచింది. ఇప్పుడది తగ్గుతుంది. మహారాష్ట్రలో ఆ పార్టీ కొన్ని సీట్లు నష్టపోతుంది. గుజరాత్‌లో సైతం అదే పరిస్థితి. రాజస్థాన్‌లో కచ్చితంగా ఎదురు దెబ్బలు తగులుతాయి. హర్యానాలో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తుండడంతో ప్రతిపక్షాలు లాభపడతాయి. ఉత్తరప్రదేశ్‌లో సైతం బీజేపీ కొంత నష్టపోతుంది. బీహార్‌లో 2019లో గెలుచుకున్న స్థానాలను (40 లోక్‌సభ స్థానాల్లో ఎన్డీఏ 39 సీట్లు గెలుచుకుంది) తిరిగి దక్కించుకునే అవకాశాలు లేవు. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా కమలదళం బలం తగ్గిపోతుంది. బెంగాల్‌లో గత ఎన్నికల్లో గరిష్ట స్థాయిలో సీట్లు వచ్చాయి. ఇప్పుడు అంతకుమించి వచ్చే పరిస్థితి లేదు.

వారివన్నీ ప్రగల్భాలే

2004లో వామపక్ష పార్టీలు 61 స్థానాలు గెలుచుకొని కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు కొందరు 2004, 2024 మధ్య పోలిక తెస్తున్నారు. కానీ అలా ఉండదు. అయితే రెండు ఎన్నికల మధ్య ఓ సామీప్యత ఉంది. అప్పుడు షైనింగ్ ఇండియా, ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్, ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి మీలో ప్రత్యామ్నాయం ఎవరు వంటి అంశాల పైన ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు వారు అడుగుతున్న ప్రశ్న ఏమిటంటే మోడీకి ప్రత్యామ్నాయం ఎవరు అని. మేము విశ్వగురువులం అయ్యాము, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాము అని వారు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ ప్రగల్భాలే. వారి వాదనలేమిటి, వాస్తవ ఫలితమేమిటి అనేదే ప్రజలు చూస్తారు. 2004లో అయినా, 2024లో అయినా అదే ముఖ్యమైన విషయం.



ఆ సవాలును ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటాయి

బీజేపీతో నేరుగా పోటీ పడిన సందర్భాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు నిరుత్సాహకరంగా ఉన్నాయని కొందరు అంటున్నారు. అయితే ఈ సవాలును ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటాయి. బీహార్‌నే తీసుకోండి. అక్కడి ప్రాంతీయ పార్టీ ఆ పని చేస్తోంది. మహారాష్ట్రలో కూడా అక్కడి పార్టీలు బీజేపీతో తలపడుతున్నాయి. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల విషయానికి వస్తే కాంగ్రెస్‌ను కర్నాటక కాంగ్రెస్ లేదా తెలంగాణ కాంగ్రెస్‌గా చూడవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఏ పాత్ర అయితే పోషిస్తున్నాయో అక్కడ కాంగ్రెస్ ఆ తరహా పాత్ర పోషిస్తోంది. అనేక ప్రాంతాల్లో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్, వామపక్షాల కలయిక మంచి ఫలితాన్ని ఇచ్చింది.

ప్రత్యామ్నాయ విధానాలే ముఖ్యం

మోడీని ఎదుర్కొనే వారు ప్రతిపక్షంలో ఎవరు ఉన్నారని కొందరు ప్రశ్నించవచ్చు. భారత రాజకీయాల్లో ఇలాంటివి సహజమే. 2004లో కూడా ఇదే సమస్య ఎదురైంది. కానీ మీకు డాక్టర్ మన్మోహన్ సింగ్ రూపంలో ఒక ప్రధాని లభించారు. ఆయన ఓ దశాబ్దం పాటు దేశాన్ని నడిపారు. మేము ఏమంటున్నామంటే మీరు ముందుగా మీ ఎంపీని ఎన్నుకోండి. మెజారిటీ ఎంపీలు నాయకుడిని ఎంచుకుంటారు. మోడీకి ప్రత్యామ్నాయం ఎవరు అనేది ముఖ్యమని నేను అనుకోవడం లేదు. నేను తరచూ హిందీలో ఒక మాట చెబుతుంటాను. దేశానికి నేత (నాయకుడు) కాదు. నీతి (విధానాలు) అవసరం.

మత సమీకరణ పనిచేసినా...

ప్రజల రోజువారీ జీవన పరిస్థితులు, వారి ఇబ్బందులే ఈ ఎన్నికల్లో ప్రధాన అంశాలని నేను భావిస్తాను. అయితే వీటిని బీజేపీ పక్కదారి పట్టించింది. హిందూత్వ ఓటును సంఘటితం చేయడం ద్వారా బలాన్ని పెంచుకోవచ్చునన్న ఆశతో మతపరమైన సమీకరణకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. సమీకరణ పనిచేస్తుంది. కానీ దాని ప్రభావం జీవనోపాధి సమస్యను పూర్తిగా తొలగించలేదు.

లౌకిక విలువలను హరిస్తున్నారు

మనది లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ అని మన రాజ్యాంగం చెబుతోంది. అది దాని స్వభావం. కానీ లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో ప్రధానమంత్రి, ప్రధాని కార్యాలయం, భారత ప్రభుత్వం ఒక మందిర నిర్మాణంలో పూర్తిగా మమేకమైపోవడం మీరు ఎప్పుడైనా చూశారా? తమకు ఇష్టమైన విశ్వాసాలను అనుసరించేందుకు ప్రజలకు రాజ్యాంగం ప్రాథమిక హక్కు కల్పించింది. ప్రభుత్వం ఒక మతాన్ని గురించి ప్రచారం చేయకూడదు. లేదా ఇతరులపై దానిని రుద్దకూడదు. కానీ మన దేశంలో జరుగుతున్నది అదే. లౌకిక విలువలు పూర్తిగా అణచివేతకు గురవుతున్నాయి. లవ్ జిహాద్, గో సంరక్షణ, ఉమ్మడి పౌరస్మృతిపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు పూర్తిగా లౌకికవాద పునాదులపై దాడికి ఉద్దేశించినవి. ప్రజాస్వామ్యాన్నే తీసుకోండి. చార్జిషీటు దాఖలు చేయకుండా జైళ్లలో ఎన్ని సంవత్సరాలు మగ్గిపోవడం లేదు? అసమ్మతినే జాతి వ్యతిరేకతగా పరిగణిస్తే మీ పౌర స్వేచ్ఛలు, ప్రజాస్వామిక హక్కులు ఏమవుతాయి?

రాజ్యాంగాన్ని నీరుకారుస్తున్నారు

రిజర్వేషన్లను నేరుగా మార్చకపోవచ్చు. కానీ ప్రభుత్వ రంగ సంస్థలను, విద్యను ప్రయివేటీకరించడం ద్వారా రిజర్వేషన్ల ప్రభావం లేకుండా చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష నేతలను జైలుకు పంపే ధోరణి పెరిగిపోతోంది. ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వకుండా ప్రత్యర్థులకు ఆదాయపన్ను నోటీసులు ఇస్తున్నారు. ఇదంతా రాజ్యాంగాన్ని నీరుకార్చడమే తప్ప మరొకటి కాదు.

రాహుల్ వ్యాఖ్యలు దురదృష్టకరం

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎన్నడూ లక్ష్యంగా చేసుకోలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం దురదృష్టకరం. ఆ రాష్ట్రంలో మాకు ప్రత్యర్థిగా ఉన్న యూడీఎఫ్ మా ముఖ్యమంత్రిపై వ్యక్తిగత దాడులు చేస్తోంది. ప్రజా సమస్యలు, విధానాలపై పోటీ పడితే అర్థం చేసుకోవచ్చు. మాకు ఎంతటి రాజకీయ ప్రత్యర్థులైనప్పటికీ వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని అడగము.

బెంగాల్ వివాదం రాజకీయపరమైనది

బెంగాల్‌లో వామపక్షాలు-కాంగ్రెస్ కూటమికి, తృణమూల్ కాంగ్రెస్‌కు మధ్య నెలకొన్న వివాదం రాజకీయాలకు సంబంధించింది. బెంగాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తీరును చూశాము. ప్రజాస్వామ్యం ఖూనీ అయిన తీరును గమనించాం. ఆ ఎన్నికల్లో పెద్ద ఎత్తున హింస, అవినీతి జరిగాయి. దానికి వ్యతిరేకంగా వామపక్షాలు పోరాడాయి. తృణమూల్‌తో కలిసి పోటీ చేయడం ప్రత్యామ్నాయం కాదు. వామపక్షాలు, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ కలిసిన మరుక్షణమే బీజేపీ బలపడుతుంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత మొత్తం ఆ పార్టీకి లాభిస్తుంది. కాబట్టి బెంగాల్‌లో ఇండియా కూటమి పక్షాలు కలిస్తే లాభపడేది బీజేపీయే.



బర్రక్‌పుర్‌లో ఏచూరి ప్రచారం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు. బర్రక్‌పుర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి దేవదత్ ఘోష్‌కు మద్దతుగా శుక్రవారం జరిగిన బహిరంగసభలో ఏచూరి ప్రసంగించారు. మతోన్మాద బీజేపీని, నిరంకుశ తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి వామపక్ష, ప్రగతిశీల అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో దేవదత్ ఘోష్‌తో పాటు పశ్చిమ బెంగాల్ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు గార్గి ఛటర్జీ, సోమనాథ్ భట్టాచార్య తదితరులు ప్రసంగించారు.

ఇండియా ఫోరానికి ఓటేసి బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో సీపీఐ(ఎం) పిలుపు



దేశంలోని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర లక్షణాన్ని కాపాడేందుకు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలకు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ పటేల్ చౌక్ ప్రాంతంలో బీజేపీని ఓడించేందుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ సీపీఐ(ఎం) ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారంలో పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ఇండియా ఫోరం అభ్యర్థులకు ఓటు వేసి బీజేపీని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తూ చేస్తున్న ప్రచారానికి ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. అయితే ఢిల్లీ పోలీసులు ఏదో ఒక తప్పుడు సాకుతో ప్రచారాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసుల ఒత్తిడికి తలొగ్గకుండా సీపీఐ(ఎం) నేతలు, కార్యకర్తలు ప్రచారం కొనసాగించారు. ప్రచారంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు రాజేంద్ర శర్మ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కఠిన పరీక్షే

- ఐదో విడతలో యూపీలో 14 స్థానాలకు పోలింగ్
- గతంలో దాదాపు క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ
- ఈసారి గట్టి పోటీ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో అధికారాన్ని ఉత్తరప్రదేశ్ నిర్ణయిస్తుంది. 2014, 2019 ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఎక్కువ సీట్లను సొంతం చేసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకుగానూ 2014 ఎన్నికల్లో 71 స్థానాలను, 2019లో 62 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. అంటే 2014 కంటే 2019లో 9 స్థానాలు తగ్గాయి. అయితే ఈసారి బీజేపీ, ఇండియా ఫోరం నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీ.. బీజేపీకి మెజారిటీ స్థానాల్లో బలమైన పోటీ ఇస్తున్నది. దీంతో ఈ దశ కమలం పార్టీకి కఠినంగా మారింది.

మరోవైపు, కాంగ్రెస్ కంచుకోటలైన అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 20న యూపీలో 14 స్థానాలకు జరుగనున్న ఐదో దశ ఎన్నికలు కీలకంగా మారాయి. ఈ 14 స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 13 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ సహా ఐదుగురు కేంద్రమంత్రులు ఈ దశలో బరిలో ఉన్నారు.



రాహుల్ గాంధీ అమేథీ నుంచి తప్పుకొని రాయ్‌బరేలీ నుంచి బరిలో నిలిచారు. అమేథీలో కాంగ్రెస్ తరపున కెఎల్ శర్మ, బీజేపీ తరపున స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీపై బీజేపీ అభ్యర్థిగా దినేశ్ ప్రతాప్ సింగ్ పోటీ చేస్తున్నారు.

ఐదో దశలో ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో లక్నో నుంచి రాజ్‌నాథ్ సింగ్ మూడోసారి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్పీ అభ్యర్థిగా రవిదాస్ మెహరోత్రా బరిలో ఉన్నారు. మోహన్‌లాల్‌గంజ్ నుంచి మరో కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్ పోటీ చేస్తుండగా ఆయనకు ఎస్పీ అభ్యర్థిగా ఆర్కే చౌదరి గట్టి పోటీ ఇస్తున్నారు. జలౌన్ స్థానం నుంచి కేంద్రమంత్రి భానుప్రతాప్ సింగ్ వర్మ ఆరోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఫతేహ్‌పూర్ నుంచి మరో కేంద్ర మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి పోటీ చేస్తుండగా ఆమెకు ఎస్పీ కీలక నేత నరేశ్ ఉత్తమ్ పటేల్ బలమైన ప్రత్యర్థిగా బరిలో నిలిచారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ కైసర్‌గంజ్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనపై ఎస్పీ అభ్యర్థిగా భగత్‌రామ్ మిశ్రా పోటీ చేస్తున్నారు. కౌశంబి నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ వినోద్ సోంకర్‌పై 25 ఏండ్ల యువకుడు పుష్పేంద్ర సరోజ్ పోటీ చేస్తున్నారు. ఇవే కాక ఝాన్సీ, హమిర్‌పూర్, బాండ, బారాబంకి, ఫైజాబాద్, గోండా స్థానాలకు ఐదో దశలో పోలింగ్ జరగనుంది.

అన్నింటికీ మతం మరకే



యూపీలో మెజారిటీ స్థానాలే లక్ష్యంగా బరితెగింపు

- ముస్లింలకు వ్యతిరేకంగా హిందూ ఓట్ల సమీకరణకు ఎత్తుగడ
- రాముడినీ రాజకీయాల్లోకి లాగుతున్న కమలదళం

న్యూఢిల్లీ : 'అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల, కుక్కపిల్ల...కాదేదీ కవితకనర్హం' అన్నారు మహాకవి శ్రీశ్రీ. ఇప్పుడు బీజేపీ నాయకులు దానిని కొంచెం మార్చి పేరు ఏదైనా మతం రంగు పులమడానికి అడ్డేముందంటూ వితండవాదం చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు 'మతం' రంగు పులుముకుంటున్నాయి. ఆహారం, బట్టలు, పేర్లు, రిజర్వేషన్లు, జనాభా, చరిత్ర, భౌగోళిక రాజకీయాలు, ప్రార్థనా స్థలాలు, నినాదాలు, ఓటింగ్...పేరు ఏదైతేనేం? వాటన్నింటికీ బీజేపీ మతం రంగు అంటిస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో కూడా బీజేపీ ఇదే వ్యూహాన్ని అనుసరించింది. అయితే అప్పుడు అభివృద్ధి, లబ్దిదారులు, జాతీయ భద్రత పేరుతో మతతత్వాన్ని ముందుకు తీసుకొచ్చింది. మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆశిస్తున్న నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో మరో అడుగు ముందుకేసి విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు.



దేశంలో నివసిస్తున్న ముస్లిం మైనారిటీలపై విషం చిమ్ముతున్నారు. ప్రతిపక్షాలపై ఆరోపణలు సంధిస్తూ ప్రత్యక్షంగా దాడికి దిగుతున్నారు. హిందూ ఓటర్లలో భయాందోళనలు, అభద్రతాభావాన్ని కలిగించి వారి ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీ నాయకులు చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రతిపక్షాలపై హిందూ వ్యతిరేక పార్టీలుగా ముద్ర వేశారు. వారి దృష్టంతా 80 లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్ పైనే. ఎందుకంటే యూపీలో సీట్లు తగ్గితే ఆ ప్రభావం జాతీయ రాజకీయాలపై పడుతుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థానాలు బీజేపీకి తగ్గిపోతాయి.

మత రాజకీయాల వ్యాప్తి

యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఇచ్చిన నినాదాలు చూస్తుంటే కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలో కాషాయ పార్టీ తన మతతత్వ రాజకీయాలను ఎంత విస్తృతపరిచిందో అర్థమవుతుంది. ముస్లింలతో పాటు సమాజ్‌వాదీ పార్టీకి విధేయులైన యాదవులు (ఓబీసీలు), బీఎస్పీ పక్షాన ఉండే దళితులకు వ్యతిరేకంగా హిందువులను ఏకం చేయడమే ఈ నినాదాల లక్ష్యం. రాష్ట్ర జనాభాలో వీరందరూ 40 శాతంగా ఉన్నారు. '100 మందిలో 60 మంది మా వారు. మిగిలిన 40 మంది విడిపోయారు. ఆ 40 శాతం మందిలో కూడా మాకు ఓటేసే వారు ఉన్నారు' అని మౌర్య 2022లో వ్యాఖ్యానించారు. హిందూత్వ వాదం, సంక్షేమ పథకాలు, స్థానిక ప్రాతినిధ్యం ద్వారా యాదవులు, దళితుల్లో ఓ వర్గాన్ని చీల్చి బీజేపీ ఓటుబ్యాంకును పెంచుకోవడమే ఆ వ్యాఖ్య ఉద్దేశం. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ఆయన మరో కొత్త పల్లవి అందుకున్నారు. '100 మందిలో 80 మంది మా వారే. మిగిలిన 20 శాతంలో కూడా మాకు వాటా ఉంది' అని చెప్పుకొచ్చారు. దీనర్థం ఏమంటే రాష్ట్రంలోని 80 శాతం హిందువులందరూ బీజేపీ వైపే ఉన్నారని, మిగిలిన 20 శాతం ముస్లింలు ఇండియా కూటమి, బీఎస్పీ మధ్య చీలిపోయారని చెప్పడమే. ముస్లింలను ఒంటరి చేయడమే దీని వెనుక ఉన్న ఎత్తుగడ. ఇక అమ్రోహా స్థానం నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కున్వర్ దనీష్ అలీని ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యను కూడా ఈ కోణం నుండే చూడాల్సి ఉంటుంది. 'భారత్ మాతా కీ జై' అనడానికి ఇష్టపడని వ్యక్తిని పార్లమెంటులోకి ఎలా అనుమతించగలమని మోడీ ప్రశ్నించారు.

> గత రెండు ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి సైతం ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా రంగంలోకి దింపలేదు. ఆ రాష్ట్ర ఓటర్లలో ముస్లింలు ఐదో వంతు ఉన్నప్పటికీ వారికి ప్రాతినిధ్యం కల్పించలేదు. పార్టీ తరఫున పోటీ చేసేందుకు ముస్లింలకు టిక్కెట్లు ఇవ్వలేదు.

ఎన్నికల అస్త్రంగా రామమందిరం

ప్రతిపక్షాలపై దాడి చేసి, హిందూ ఓట్లను రాబట్టుకునేందుకు అయోధ్యలో రామమందిరాన్ని బీజేపీ ఉపయోగించుకుంటోంది. రామ మందిర నిర్మాణం తన ఘనతే అంటూ ప్రచారం చేస్తోంది. 'రామ మందిరాన్ని నిర్మించిన వారినే మేము తిరిగి అధికారంలోకి తీసుకొస్తాం' అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన ఎన్నికల ప్రచారసభల్లో చెప్పారు. బాల రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి సమాజ్‌వాదీ, కాంగ్రెస్ నాయకులు హాజరు కాకపోవడాన్ని బీజేపీ తప్పుపడుతోంది. రామ భక్తులకు, రామ ద్రోహులకు మధ్య జరుగుతున్న పోరుగా లోక్‌సభ ఎన్నికల సమరాన్ని యోగి అభివర్ణించారు. రామ భక్తులు మాత్రమే దేశాన్ని పాలిస్తారని కూడా సెలవిచ్చారు. యూపీఏ పాలనలో రామసేతు వివాదం సమయంలో కాంగ్రెస్ పార్టీ రాముడి అస్తిత్వాన్నే నిరాకరించిందని బీజేపీ ఇప్పుడు గుర్తు చేస్తోంది. రాముడి అస్తిత్వాన్ని ప్రశ్నించడమంటే మన అస్తిత్వాన్ని ప్రశ్నించడమేనని యోగి వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు వక్రభాష్యం

బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు పెట్టుకునే టోపీల రంగులను కూడా కాషాయ పార్టీ వదలడం లేదు. సమాజ్‌వాదీ నేతలు, కార్యకర్తలు ధరించే టోపీలు ముస్లింల టోపీలను పోలి ఉండడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ప్రతి పౌరుడి మాదిరిగానే మైనారిటీలకు కూడా తమ వస్త్రధారణ, ఆహారం, భాష, వ్యక్తిగత చట్టాల విషయంలో స్వేచ్ఛ ఉంటుందని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పింది. దీనికి బీజేపీ వక్రభాష్యం చెబుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆవులను వధించేందుకు, గొడ్డు మాంసం తినేందుకు ముస్లింలను అనుమతిస్తుందని ఆరోపించింది. ముస్లింలు అధిక సంతానానికి జన్మనిస్తారంటూ ప్రధాని నరేంద్ర మోడీ రాజస్థాన్‌లో చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అంతేకాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులు గుంజుకొని ముస్లింలకు ధారాదత్తం చేస్తుందంటూ తప్పుడు ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే రామమందిరాన్ని ఆస్పత్రిగా మారుస్తుందా? కాశీ విశ్వనాథ కారిడార్‌పై బుల్‌డోజర్ నడుపుతుందా అని వారణాసిలో మోడీ ప్రశ్నించారు. అయోధ్యలో కాకుండా రామమందిరాన్ని కాందహార్‌లోనో, కాబూల్‌లోనో, లాహోర్‌లోనో, కరాచీలోనో నిర్మిస్తారా అని కూడా నిలదీశారు. మోడీ, అమిత్ షా మొదలుకొని పలువురు బీజేపీ నాయకులు పాకిస్తాన్, కాశ్మీర్, కులం, రిజర్వేషన్లు, ఉగ్రవాదం, ఓట్ జిహాద్, శాంతిభద్రతలు, పండుగలు, షరియా వంటి పలు అంశాలను తమ ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తావిస్తూ వాటికి సైతం మతం రంగు పులుముతున్నారు

వీటినీ వదలడం లేదు

1990లో ములాయం సింగ్ యాదవ్ పాలనలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను ప్రస్తావించడం కూడా బీజేపీ నాయకులు మరచిపోవడం లేదు. ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటుబ్యాంకుగా ఉన్నారన్న విషయాన్ని వారు పదే పదే గుర్తు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు హిందువుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి ముస్లింలను సంతృప్తి పరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని కూడా వారు నిందిస్తున్నారు. సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలను యోగి ఆదిత్యనాథ్ మొఘల్ చక్రవర్తి అక్బర్, ఔరంగజేబుతో పోల్చారు. మహారాణా ప్రతాప్ విగ్రహంపై కాలు పెట్టిన వారి సంగతిని ఎన్నికల తర్వాత తేలుస్తానని ఆయన హెచ్చరించారు. ఇండియా కూటమి విజయం సాధిస్తే అఖిలేశ్ యాదవ్, రాహుల్ గాంధీ రామ మందిరానికి బాబ్రీ తాళం వేస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు.

సంపాదకీయం

ఊరట..



'క్షణ క్షణం మారుతున్న లోకాన్ని / సరిగా అర్థం చేసుకున్న వాళ్లంతా/ పేద ప్రజల పక్షం వహించడమే/ పెద్ద అపరాధమై పోయింది' అని బాధపడ్డాడు మహాకవి. నేడు న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థ విషయంలో అదే జరిగింది. దానినే తాజాగా సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'ఉపా' కేసు బనాయించి సరైన ఆధారాలు చూపడంలో విఫలమాయ్యారంటూ పోలీసులకు న్యాయస్థానం తలంటు పోసింది. అరెస్టు చెల్లదని స్పష్టమైన తీర్పునిచ్చింది. మార్చిలో ప్రొఫెసర్ సాయిబాబాకు బెయిల్ ఇచ్చినప్పుడు, నిన్న ప్రబీర్‌కు బెయిల్ ఇచ్చే సందర్భంలోనూ సర్వోన్నత న్యాయస్థానం రిమాండ్ కాపీని అందించకుండా వారి హక్కులను హరించడానికి మీరెవరంటూ పోలీసులకు గట్టిగా అక్షింతలు వేసింది. ఏడు నెలల నిర్బంధం తరువాత సుప్రీంకోర్టు చొరవతో ప్రబీర్ పుర్కాయస్థ బుధవారం విడుదల కావడం హర్షించదగ్గ పరిణామం.

> మనకు మన రాజ్యాంగం హామీ ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు అసమ్మతి హక్కు. ఒక వ్యక్తి చట్టాన్ని ఉల్లంఘించనంతవరకూ, కలహాలను రేకెత్తించనంతవరకూ, తన భిన్నమైన, తాను నమ్ముతున్న అభిప్రాయాన్ని ప్రచారం చేయడానికీ దానికి మద్దతు కూడగట్టడానికీ అతనికి హక్కు ఉంది. కానీ ఆచరణలో ఈ హక్కు దిక్కులేనిదైన వాస్తవాన్ని మనం చూస్తున్నాం. నేడు దేశంలో ప్రజాప్రతినిధులకే దిక్కులేకుంటే ఇక సాధారణ పౌరులకు ఎక్కడుంటుంది? అందుకే ఈ హక్కు కోసం కొన్ని దేహాలు నెత్తుటి మడుగుల్లో తేలియాడుతున్నాయి... మరికొన్ని ప్రాణాలు చెరసాలల్లో మగ్గుతున్నాయి.

అరెస్టుకు కారణాలేమిటో పోలీసులు రాతపూర్వకంగా నిందితులకు తెలపాల్సిందేనని గతంలో పంకజ్ బన్సాల్ కేసులో గీసిన గీతలు ఈ కేసుకూ వర్తిస్తాయని న్యాయస్థానం స్పష్టంచేసింది. సహజ న్యాయసూత్రాల ఉల్లంఘనపైనా ద్విసభ్య ధర్మాసనం నిప్పులు చెరిగింది. ఈ తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు కాగా, ప్రజాస్వామ్య వాదులకు గొప్ప ఊరట. మనీ లాండరింగ్ కేసులో నిందితులను ఏకపక్షంగా, ఎడాపెడా అరెస్టు చేయకుండా ఈడీపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. ఈడీ అధికారాలకు కళ్లెం వేస్తూ, అరెస్టుకు న్యాయస్థానం అనుమతి తప్పనిసరి అని గురువారం స్పష్టం చేసింది.

ఢిల్లీలో సిఎఎ వ్యతిరేక ఆందోళన వార్తలను, రైతుల ఉద్యమం విశేషాలను 'న్యూస్‌క్లిక్' నిరంతరంగా ప్రచురించింది. అధికార శ్రేణులకు మింగుడుపడని మరెన్నో అంశాల్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారపార్టీ ప్రబీర్‌పై కక్ష కట్టింది. ఢిల్లీ ప్రత్యేక పోలీసు విభాగాన్ని గతేడాది అక్టోబర్ 3న సోదాలకు పంపింది. చైనా ప్రభుత్వం డబ్బుతో ఈ ఉద్యమాలకు దోహదం చేస్తున్నారని 'న్యూయార్క్ టైమ్స్'లో అదే ఏడాది ఆగస్టులో ప్రచురించబడ్డ తలాతోకా లేని కల్పిత కథనాన్ని ఊతంగా చేసుకొని, కుట్ర కథనాన్ని అల్లింది. ఇలా చెప్పుకుంటూ పోతే జర్నలిస్టులపై డజన్ల కొద్దీ కేసులను ఉదహరించ వచ్చు. ప్రజాపక్షం వహించే జర్నలిజాన్ని నియంత్రించ డానికే ప్రభుత్వాలు ఈ చట్టాలను ఉపయోగిస్తున్నాయని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఈ నేపథ్యంలో పత్రికా స్వేచ్ఛ కోసం, నిజమైన జర్నలిజం కోసం పాత్రికేయ సమాజం మాత్రమే కాదు, పౌరసమాజమూ సమాయత్తం కావాలి. అలా చేయడంలో మనం విఫలమైతే, ప్రజాస్వామ్య సౌధమైన నాలుగోస్తంభం కూలిపోతుంది. సత్యాన్ని పలికితే అబద్ధానికి కంటగింపు కలుగుతుందని చెప్పడానికి ఇదో తాజా ఉదాహరణ.

2014 నుంచి ఏడేళ్లలో 10,552 మందిపై 'ఉపా' కేసులు నమోదైతే, నేరాభియోగాలు రుజువైంది కేవలం 253 మందిపైనేనంటే- కర్కశ చట్టం ఎంత దారుణంగా దుర్వినియోగమవుతోందో వేరే దృష్టాంతాలు అక్కరలేదు. అసలు అభియోగాలే లేకుండా ఎందరో జైళ్లలో మగ్గుతున్నారు. బ్రిటిష్ పాలకులు డిఫెన్స్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్ చట్టం-1915 తేస్తే.. నాటి ఎమర్జెన్సీలో నాసాలు, మీసాలు వచ్చాయి. నేటి మోడీ ప్రజాస్వామ్యంలో 'ఉపా'లు విజృంభిస్తున్నాయి. మలయాళ వార్తాఛానల్ 'మీడియా వన్' కేసులోనూ తగిన ఆధారాలు లేకుండా జాతీయ భద్రత ముసుగులో ప్రజాహక్కుల్ని ఎవరూ కాలరాయలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రాథమిక హక్కులే వట్టిపోతే నియంతృత్వానికి కోరలు మొలుస్తాయి. అందుకు అవకాశం కల్పిస్తున్న 'ఉపా'ను వదిలించుకోవడం ప్రజాస్వామ్య మనుగడకే తక్షణావసరం.

ప్రజాస్వామ్య సూత్రాలనూ, పార్లమెంటరీ నియమాలనూ తుంగలో తొక్కి తెచ్చిన వ్యవసాయ చట్టాలు, లేబర్ కోడ్‌ల వెనుక దాగిన వాస్తవాలను వెలుగులోకి తెచ్చినందుకే 'న్యూస్‌క్లిక్'పై ఈ నిర్బంధం. లేదంటే, ఇటు ప్రజలనూ, అటు పార్లమెంటునూ విశ్వాసంలోకి తీసుకోకుండా ఏకపక్షంగా దోపిడీదారుల కొమ్ముగాస్తున్న ఈ ప్రభుత్వ తీరు దేనికి సంకేతం..? మనకు మన రాజ్యాంగం హామీ ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు అసమ్మతి హక్కు. ఒక వ్యక్తి చట్టాన్ని ఉల్లంఘించనంతవరకూ, కలహాలను రేకెత్తించనంతవరకూ, తన భిన్నమైన, తాను నమ్ముతున్న అభిప్రాయాన్ని ప్రచారం చేయడానికీ, దానికి మద్దతు కూడగట్టడానికీ అతనికి హక్కు ఉంది. కానీ ఆచరణలో ఈ హక్కు దిక్కులేనిదైన వాస్తవాన్ని మనం చూస్తున్నాం. నేడు దేశంలో ప్రజాప్రతినిధులకే దిక్కులేకుంటే ఇక సాధారణ పౌరులకు ఎక్కడుంటుంది? అందుకే ఈ హక్కు కోసం కొన్ని దేహాలు నెత్తుటి మడుగుల్లో తేలియాడుతున్నాయి... మరికొన్ని ప్రాణాలు చెరసాలల్లో మగ్గుతున్నాయి... మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి..? దేశం అప్రమత్తం కావడానికి ఇంతకుమించిన హెచ్చరికలేం కావాలి?

కల్తీమందులు.. ఎన్నికల బాండ్లు..!

అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం, ఇందులో ఏ ఒకటిగాని, లేదా అన్ని కానీ... ఫార్మా రంగంలో కల్తీ మందుల ఉత్పత్తి, అవకతవకలకు కారణమై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఏ అగచాట్లు పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ మిన్నకుంటున్నాయి. మే9, 2021 కోవిడ్ రెండో అల తీవ్రంగా ఉన్న రోజుల్లో డా.జితేంద్రపాల్‌కి ఝాన్సీలో ఓఘటన, మరో ఆస్పత్రిలో ఘటనలో యాంటీ వైరల్ ఇంజక్షన్ రెండెసివిర్ ఇచ్చిన తరువాత కోవిడ్ పేషెంట్ల పరిస్థితి విషమిస్తోందనీ, తీవ్రమైన చలిజ్వరంతోపాటు రక్తంలోని ఆక్సిజన్ లెవల్స్ పడిపోతున్నాయని అర్థమైంది. దీనికి కారణం రెండెసివిర్ ఇంజక్షన్ బ్యాచ్ నెంబర్ V100167 కారణం. ఈ ఇంజక్షన్‌ను గుజరాత్‌లోని జైడస్ క్యాడిల్లా కంపెనీ తయారు చేసింది. రెండెసివిర్ యాంటీ వైరస్ మందు.

డా.పాల్ అతని ఇతర సహచరులు అనుమానించింది ఏమిటంటే, ఈ మందులోని ఇతర పదార్థమేదో ఈ విషమ పరిస్థితికి కారణం. కానీ వారివద్ద దానిని పరీక్షించడానికి సమయం లేకపోయింది. ఆసుపత్రి నిండా కోవిడ్ రోగులు, డాక్టర్ల లేమి, ఇంతమంది రోగుల చికిత్స ఒకపెద్ద ఛాలెంజ్ అక్కడి డాక్టర్లకి "ఈ పరిస్థితుల్లో మేము చేయగలిగిందల్లా ఈ విషయాన్ని పైకి రిపోర్ట్ చేసి మా విధుల్లో నిమగ్నమవడమే" అన్నారు డా. పాల్. రెండెసివిర్‌కి బదులుగా మరో బ్రాండ్ మందును కొనమని రోగుల కుటుంబాలతో చెప్పారు. రెండెసివిర్ వాడటం మానిన తరువాత రోగుల పరిస్థితి మెరుగుపడిందని డా.పాల్ వివరించారు.

జైడస్ క్యాడిల్లా గుజరాత్ కంపెనీ కాబట్టి 'గుజరాత్ ఫుడ్ అండ్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్'ది చాలా పెద్ద బాధ్యత. కానీ అది తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది అంటుంది 'మింట్'. ఝాన్సీలో జరిగింది ఎడారిలో ఇసుక రేణువు లాంటి సంఘటన. మే 2021లోనే ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్‌లలోని డజనుకి పై బడిన ఆసుపత్రులలో రెండేసివిర్ వాడిన తరువాత రోగుల పరిస్థితి విషమించిన రిపోర్టులున్నాయి. అన్నీ కూడా ఆ మందు బాచి నెంబర్ V100167కి అటూ ఇటూగా ఉన్న బాచిలే. అన్నీ కూడా జైడస్ క్యాడిల్లా కంపెనీ ఉత్పత్తి చేసినవే. దీన్ని యూపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది.ఈ మందు రోగులపై ప్రతికూల ప్రభావం చూపి ప్రాణాంతకమైనప్పటికీ ఒక్క బీహార్ తప్ప మిగిలిన రాష్ట్రాల్లోని డ్రగ్ నియంత్రణ సంస్థలు స్పదించలేదు. మింట్ పత్రిక ప్రకారం ఆయా సంస్థలు బాధ్యతారహితంగా ప్రవర్తించాయి. ఈ మందుపై పరీక్షలు జరిపి కంపెనీ నుండి వివరణ, సంజాయిషీ అడగాల్సిన ఈసంస్థలు ఆపని మాత్రం చేయలేదు. 'మింట్'కి అందిన సమాచారం ప్రకారం..గుజరాత్ ఎఫ్‌డీసీఏ సంబంధిత సమస్యపై తమ లాబరేటరీలో పరీక్షించలేదని ఈమందుల్ని వెనక్కి తెప్పించిన రుజువులు కూడా ఏమీలేవని తెలిసింది. గుజరాత్ ఎఫ్‌డీసీఏ తాము పంపిన ఈమెయిల్స్‌కి కూడా స్పందించలేదంటుంది 'మింట్' పత్రిక.

జైడస్ క్యాడిల్లా గుజరాత్‌లో ఉండడటం వల్ల ఈ కంపెనీ మందుల ప్రామాణ్యతను నిర్ధారించాల్సింది గుజరాత్ ఎఫ్‌డీసీఏ అదే ఈ కంపెనీకి ఈ మందులు ఉత్పత్తి చేయడనికి అనుమతి ఇచ్చింది. రెండేసివిర్ మందు సబ్-స్టాండర్డ్ మందని బీహార్ నియంత్రణ సంస్థ గుజరాత్ ఎఫ్‌డీసీఏ తెలిపినప్పటికీ ఈమందుల్ని పరీక్షించలేదు. గుజరాత్ ఎఫ్‌డీసీఏ జాయింట్ కమిషనర్ సబ్-స్టాండర్డ్ మందులున్న బాచీలు V100153, 156, 166, 167, 179, L100 148 తమ లాబొరేటరీకి పరీక్షార్థం రాలేదని మింట్‌కి తెలిపారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం ప్రతి సబ్-స్టాండర్డ్ ఉత్పత్తులని వెనక్కి తీసుకోవాలిసిన బాధ్యత ఆ కంపెనీలది, లేదా ఆ రాష్ట్ర ఎఫ్‌డీసీది. గుజరాత్ ఎఫ్‌డీసీఏ ఈమందుల్ని వెనక్కితీసుకున్నట్లు రుజువులు లేవు. ఈ కంపెనీ అధికారిని ఈ విషయం అడిగినప్పుడు అతను వీటిని తోసి పుచ్చాడు.

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ సంఘటనకు ఆరు నెలలముందే నవంబర్ 2020లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) రెండేసివిర్ మందు కోవిడ్ రోగులపై ప్రభావవంతం కాదని చెప్పింది. డబ్ల్యూహెచ్‌ఓ దీనిపై చాల విపులంగా అధ్యయనం చేసింది. మార్చ్ 22, 2020 నుండి జనవరి 29 2021 వరకు, తమ ఆరు రీజియన్లలోని 35 దేశాల్లో 450 అస్పత్రుల్లో సుమారు 14వేల మంది రోగులపై విస్తారంగా పరీక్షలు జరిపిన నివేదిక ప్రచురించింది. కాని మన ప్రభుత్వం ఆ మందు ఉత్పత్తిని పెంచడానికి ఒప్పుకుంది.



> భారతదేశంలో తయారైన దగ్గుమందు వల్ల ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది పిల్లలు మరణిస్తారు. ఆ తరువాతి నెలలో ఇండియాలో ఉత్పత్తి అయిన రెండు దగ్గుమందుల వల్ల ఈ పిల్లలు మరణించినట్టు డబ్ల్యూహెచ్‌ఓ చెబుతూ ఒక హెచ్చరిక జారీ చేసింది. నోయిడాలోని మారియన్ బయోటెక్ ఉత్పత్తి చేసిన మందులు పిల్లలకు ఇవ్వొద్దంటూ ఆ హెచ్చరిక. ఉజ్బెకిస్తాన్ ఈ మందులపై పరీక్షలు జరిపితే ఇవి పిల్లలకు ప్రమాదమని తేల్చింది.ఈ విషాదకర సంఘటన తరువాత అక్కడి ఆరోగ్య శాఖ ఈ కంపెనీ లైసెన్స్ రద్దు చేయాలని కోర్టులో కేసు వేసింది. అక్కడి కోర్టు దీనికి కారణమైన 23 మందికి రెండు నుండి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇందులో ఒకరు రాఘవేంద్ర ప్రతాప్ సింగ్, ఈయన 'క్వరామాక్స్' కంపెనీకి ఇండియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. ఈయనకి కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష పడింది.

ఎన్నికల బాండ్ల డేటా వల్ల తేలిందేమిటంటే, ఈ జైడస్ క్యాడిల్లా, కంపెనీ బీజేపీకి రూ.18 కోట్ల ఎన్నికల బాండ్లు ఇచ్చింది. కేంద్రంలోనూ, గుజరాత్ రాష్ట్రంలోనూ ఉండేది బీజేపీ ప్రభుత్వమే. సిక్కింని ఫార్మాహబ్ అంటారు. సిక్కిం క్రాంతికారి మోర్చాకి ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన ఐదు కంపెనీలలో 4 ఫార్మా కంపెనీలే. 1. జైడస్ క్యాడిల్లా, (8 కోట్లు) 2.టోరొంట్ ఫార్మా (7 కోట్లు) 3. మైక్రో లాబ్స్ (7 కోట్లు) 4. ఇప్కా ల్యాబ్స్ (3.5 కోట్లు) 5వ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్. ఇది వాస్తవంగా లాటరీ టిక్కెట్లు అమ్ముకునే సంస్థ. (11 కోట్లు) క్వాలిటీ పరీక్షల్లో ఫెయిల్ అయిన కంపెనీలు రాజకీయ పార్టీలకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో డబ్బులు ఇచ్చారని పేర్కొంది 'స్క్రోల్'. (మార్చ్ 18, 2024) గ్లెన్‌మార్క్ మందుల కంపెనీ ఉత్పత్తి చేస్తున్న 'బీపీ'ని కంట్రోల్ చేయడానికి ఉపయోగించే మందు టెల్మా తక్కువ ప్రమాణాల మందు అని, సరైన ప్రమాణాలు పాటించనందుకు మహారాష్ట్ర ఎఫ్‌డీసీఏ ఈ కంపెనీకి 2022, 2023 మధ్య నాలుగు నోటీసులు పంపింది. ఎన్నికల బాండ్ల డేటా వల్ల తెలుస్తుందేమిటంటే ఈ కంపెనీ ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి రూ.9 కోట్లు ఇచ్చింది.

టోరొంట్ ఫార్మా తెల్లరక్త కణాల కోసం ఉత్పత్తి చేస్తున్న డెప్లాట్ -150 తక్కువ ప్రమాణాలు కలదని 2019లోనే అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీసీఏ) ఈ కంపెనీ వార్నింగ్ ఇచ్చింది. ఇలాంటి నోటీసు వచ్చినప్పుడు సహజంగానే ప్రభుత్వం కంపెనీ ఉత్పత్తి లైసెన్స్ రద్దు చేయాలి. కానీ, ఈ కంపెనీ ఉత్పత్తి యూనిట్లు గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వాలు ఈ కంపెనీపై ఎలాంటి చర్య తీసుకోలేదు. మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ ప్రభుత్వం ఉంది. ఎన్నికల బాండ్ల డేటా ప్రకారం టోరొంట్ ఫార్మా 2019 నుండి ఏప్రిల్ 2024 వరకు రూ.77.5 కోట్ల ఎన్నికల బాండ్లు కొన్నది. బీజేపీ 61 కోట్లు, ఎస్‌కేఎం 7 కోట్లు, కాంగ్రెస్ 5 కోట్లు, ఎస్‌పీ 3 కోట్లు, ఆప్ కోటి, సిక్కిం డీఎఫ్ 0.5 కోట్లు నగదు చేసుకున్నట్లు తెలుస్తోంది.

మహారాష్ట్ర ఎఫ్‌డీసీఏ, సిప్లా కంపెనీకి నాణ్యత లేని మందులు ఉత్పత్తి చేసినందుకు గాను 2018- 2022 మధ్య నాలుగు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. 2019 నుండి ఈ కంపెనీ 39.2 కోట్ల విలువగల ఎన్నికల బాండ్లు కొన్నది. 2018లో ఇది ఉత్పత్తి చేసిన దగ్గు మందు లోపభూయిష్టమైందని తేలింది. ఆ మరుసటి ఏడాది అంటే 2019లో ఈ కంపెనీ 14 కోట్ల ఎన్నికల బాండ్లు కొన్నది. జులై 2021 నాటికి సిప్లా కంపెనీ రెండుసార్లు నోటీసులు అందుకుంది. ఇది ఉత్పత్తి చేసిన కోవిడ్ రోగులకిచ్చే రెండేసివిర్ మందు సిప్రెమిల్‌లో రెండేసివిర్ కావలిసిన దానికంటే తక్కువ మోతాదులో ఉండటంవల్ల నోటీసులు అందుకుంది. ఆ తరువాత నవంబర్ 2022లో ఈ కంపెనీ రూ.25.2 కోట్ల విలువగల బాండ్లు కొన్నది. 2019లో ఇది రూ.14 కోట్ల బాండ్లు కొని ఉంది. మొత్తం 39.2 కోట్ల విలువగల బాండ్లు. అందులో బీజేపీ రెండుసార్లు, మొదట 30 కోట్లు, రెండోసారి 7 కోట్లు, అలాగే కాంగ్రెస్ 2.2 కోట్ల బాండ్లను నగదుగా మార్చుకుంటాయి. ఈ కంపెనీ ముంబాయిలో కొన్న బాండ్ల కాలక్రమాన్ని గమనిస్తే, జులై 2019, అక్టోబర్ 2019 మధ్య అది రూ.14 కోట్ల బాండ్లు కొన్నది. అప్పుడు మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవిస్ (బీజేపీ) ప్రభుత్వం ఉంది. నవంబర్ 2019లో ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వం వచ్చింది. ఉద్ధవ్ థాక్రే జూన్ 2022 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తరువాత జరిగిన నాటకీయ పరిణామాలవల్ల, ఏకనాథ్ షిండే ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు ఈ కంపెనీ తిరిగి నవంబర్ 2022లో 25.2 కోట్ల బాండ్లు కొన్నది.

ఉజ్బెకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు

భారతదేశంలో తయారైన దగ్గుమందు వల్ల ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది పిల్లలు మరణిస్తారు. ఆ తరువాత నెలలో ఇండియాలో ఉత్పత్తి అయిన రెండు దగ్గుమందుల వల్ల ఈ పిల్లలు మరణించినట్టు డబ్ల్యూహెచ్‌ఓ చెబుతూ ఒక హెచ్చరిక జారీ చేసింది. నోయిడాలోని మారియన్ బయోటెక్ ఉత్పత్తి చేసిన మందులు పిల్లలకు ఇవ్వొద్దంటూ ఆ హెచ్చరిక. ఉజ్బెకిస్తాన్ ఈ మందులపై పరీక్షలు జరిపితే ఇవి పిల్లలకు ప్రమాదమని తేల్చింది.ఈ విషాదకర సంఘటన తరువాత అక్కడి ఆరోగ్య శాఖ ఈ కంపెనీ లైసెన్స్ రద్దు చేయాలని కోర్టులో కేసు వేసింది. అక్కడి కోర్టు దీనికి కారణమైన 23 మందికి రెండు నుండి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇందులో ఒకరు రాఘవేంద్ర ప్రతాప్ సింగ్, ఈయన 'క్వరామాక్స్' కంపెనీకి ఇండియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. ఈయనకి కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష పడింది. మారియన్ బయోటెక్ తమ దగ్గుమందు తయారీకి కావలసిన ముడిపదార్థం' మాయా కెంటేక్ ఇండియా' అనే వ్యాపారినుండి కొన్నట్టు రాయిటర్స్ తెలిపింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ 'మాయా కెంటేక్ ఇండియా'కి ఫార్మాస్యూటికల్ గ్రేడ్ రసాయనాలు అమ్మే లైసెన్సే లేదు. దానికి కేవలం ఇండస్ట్రియల్ గ్రేడ్ రసాయనాలకు మాత్రమే లైసెన్స్ ఉంది. దీనిని లిక్విడ్ డిటర్జెంట్ తయారీకి, పెయింట్ల తయారీకి వాడతారు. ఈ విషయమై మాయాకేంటేక్ ఇండియాని ప్రశ్నిస్తే, మా 'Propylene glycol'ని మారియాన్ బయోటెక్ దగ్గు మందు తయారీకి వాడుతున్న విషయం మాకు తెలియదు' అంటుంది. మారియాన్ అధినేత రాయిటర్స్‌తో మాట్లాడుతూ "మేము గత పదేళ్లుగా ఈ మందుని 'Propylene glycol'లో మలినాల గురించి ఏ విధమైన పరీక్షలు జరపకుండానే ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. ఏ ఎగుమతి దారుడు కూడా ఈ పరీక్షలు నిర్వహించరు అని కూడా తెలిపారు.

> ఎన్నికల బాండ్ల డేటా వల్ల తేలిందేమిటంటే, ఈ జైడస్ క్యాడిల్లా, కంపెనీ బీజేపీకి రూ.18 కోట్ల ఎన్నికల బాండ్లు ఇచ్చింది. కేంద్రంలోనూ, గుజరాత్ రాష్ట్రంలోనూ ఉండేది బీజేపీ ప్రభుత్వమే. సిక్కింని ఫార్మాహబ్ అంటారు. సిక్కిం క్రాంతికారి మోర్చాకి ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన ఐదు కంపెనీలలో 4 ఫార్మా కంపెనీలే. 1. జైడస్ క్యాడిల్లా, (8 కోట్లు) 2.టోరొంట్ ఫార్మా (7 కోట్లు) 3. మైక్రో లాబ్స్ (7 కోట్లు) 4. ఇప్కా ల్యాబ్స్ (3.5 కోట్లు) 5వ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్. ఇది వాస్తవంగా లాటరి టిక్కెట్లు అమ్ముకునే సంస్థ. (11 కోట్లు) క్వాలిటీ పరీక్షల్లో ఫెయిల్ అయిన కంపెనీలు రాజకీయ పార్టీలకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో డబ్బులు ఇచ్చారని పేర్కొంది 'స్క్రోల్'.

హెల్త్ యాక్టివిస్ట్ దినేష్ ఠాకూర్ ట్విట్టర్‌లో: ఈ బిల్లుని పార్లమెంటులో పెద్దగా చర్చ లేకుండానే ఆమోదించడం చాలా తప్పు అన్నారు. మహారాష్ట్ర ఎఫ్‌డీసీఏ "హెటిరో" కంపెనీకి లోపభూయిష్టమైన మందులు ఉత్పత్తి చేస్తున్నందుకు ఆరు నోటీసులు ఇచ్చింది. ఇందులో మూడు రెండేసివిర్ ముందుకి సంబంధించి అయితే మరో మూడు యాంటీ ఫంగల్ ముందుకి సంబంధించినవి. కంపెనీ రూ.40 కోట్ల ఎన్నికల బాండ్లు కొన్నది. ఈ సంస్థ రూ.120కోట్ల ఎన్నికల బాండ్లు బీఆర్‌ఎస్‌కి ఇచ్చింది. ఈ కంపెనీ ఫౌండర్ చైర్మన్ 'బండి పార్థసారథిరెడ్డి'ని బీఆర్‌ఎస్ 2022లో రాజ్యసభ మెంబెర్‌ని చేసింది. ఇలా తవ్వినకొద్దీ ఫార్మా రంగంలో లుకలుకలు బయటపడుతున్నాయి. ఇవి పిసరంత మాత్రమే. బయటపడనివి ఇంకెన్నో

(ఈ సమాచారం లైవ్ మింట్ నుంచి, ధృవ్ రాఠీ యూట్యూబ్ ఛానల్ నుంచి గ్రహించబడింది)

సేకరణ, సంకలనం: పి.జయప్రకాష్

మెయిల్ @ నవతెంగాణ

హడలెత్తిస్తున్న హోర్డింగులు

ఇటీవల మహారాష్ట్రలోని ముంబైలో "ఘట్ కోపర్"లో కూలిన హోర్డింగ్ ప్రమాదంలో సుమారు 14మంది అమాయక ప్రజలు మరణించగా సుమారు 74 మంది గాయాల పాలయ్యారు. అంతేకాదు కార్లు, పెట్రోల్ బంక్ ధ్వంసమయ్యాయి. దీనికి ప్రధాన కారణం అనుమతి లేని హోర్డిం గులు. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ లోపం. ఇటువంటి అనుమతి లేని హోర్డింగులు మన రాష్ట్రంలో కూడా అనేక పట్టణాలు, నగరాల్లో వందలకొద్దీ దర్శనమి స్తాయి. హైదరాబాద్‌లోనైతే కోకొల్లలు. గతేడాది హోర్డింగ్ కూలిన ఘటనలో ఒకరు చనిపోయినట్టు వార్తలు. ఇలాంటి ప్రమాదాలు సంభవించినపుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తారు తప్పా, ముందుగా గుర్తించి చర్యలు ఎందుకు తీసుకోరనేది నగరవాసుల ప్రశ్న. టౌన్ ప్లానింగ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రతిరోజూ పట్టణాల్లో విధుల్లో భాగంగా తిరుగుతూనే ఉంటారు. కానీ వీరికి ఈ హోర్డింగులు ఎందుకు కనపడవో.... అర్థంకాని విషయం. కొత్తగా ఏయే ప్రాంతాల్లో హోర్డింగులు వెలుస్తున్నాయో ప్రతీరోజూ సి.సి పుటేజీల పరిశీలన ద్వారా, ప్రత్యక్ష సందర్శన ద్వారానైనా గమనించొచ్చు. ప్రతీ హోర్డింగుకు అనుమతి ఉందా.. లేదా అనేకోణంలో ఆరా తీయవచ్చు. కానీ ఇవేమీ అధికారులు పరిశీలించరు. దీంతో ఇష్టారాజ్యంగా హోర్డింగులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అసలు అనుమతి పొందిన హోర్డింగులెన్ని? వాటి నాణ్యత, కాల పరిమితిని పరిశీలించాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. శిథిలావస్థలో ఉన్న హోర్డింగులు వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాతావరణంలో గంటగంటకు మార్పులు సంభవిస్తున్నాయి. ఈదురు గాలులు, సుడిగాలులు భయంకరంగా వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శిథిలావస్థకు చేరిన, అనుమతిలేని హోర్డింగులతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందన్న విషయాన్ని గుర్తించాలి. పాడుబడిన ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యుత్ స్తంభాల వంటి వాటిని పరిశీలించి యజమానులకు నోటీసులు ఇవ్వాలి. వాటిని కూల్చే విధంగా చర్యలు తీసుకోవాలి. వాహనాలు, భవనాలకు, వివిధ ఆస్తులకు నష్టం కలగకుండా చూడాలి. ప్రమాదాలు సంభవించకుండా ముందుగా చర్యలు తీసుకుంటే మంచిది. అదే సమయంలో ప్రజలు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకుంటూ రహదారులపై ప్రయాణించాలి.

- ఐ.పి.రావు

ఉన్మాదులకు ఉద్యమాలే అడ్డుకట్ట



కె.శాంతారావు
9959745723

ఉన్మాదం చాలా భయం కరమైనది. ప్రమాదకరమైనది. ప్రాణాంతకమైనది. దాని అంతిమ ఫలితం మారణహోమం. మానవ హననం. చివరకది విచక్షణ లేని నరమేధానికి సైతం (జినోసైడ్) దారి తీయవచ్చు. అది యుద్ధోన్మాదం కావచ్చు. లేదా మతోన్మాదం కావచ్చు.

అంతర్జాతీయంగా యుద్ధోన్మాదం ఇజ్రాయిల్ నేత బెంజిమన్ నెతన్యాహు రూపంలో నేడు తాజాగా బుసలు కొడ్తున్నది. గత ఎనిమిది నెలలుగా జరుపుతున్న ఆ నరమేధానికి అంతులేకుండా పోతున్నది. దాదాపు 35 వేల మందికి పైగా ప్రజానీకం ఈ యుద్ధదాడిలో నేలకొరిగారు. వారిలో 65శాతం మంది స్త్రీలు, చిన్నారులే.

ప్రస్తుతం ఈ ఘోరకలిని నిరసిస్తూ అమెరికా, ఐరోపా, ఆసియాల్లోని 120పైకి విశ్వ విద్యాలయాల్లో గుడారాల ఉద్యమం నడుస్తున్నది. యువ విద్యార్థినీ లోకం ఎక్కడికక్కడ వందల వేల సంఖ్యల్లో తరగతులను బహిష్కరించి. హాస్టల్ గృహ వసతులను విడనాడి, ఆరుబయట టెంట్లు వేసుకుని యుద్ధ దాడులకు స్వస్తి చెప్పాలని, ప్రజల ప్రాణాలను, ప్రపంచశాంతిని కాపాడాలని దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నారు. ఈ పుడమిపై ఎక్కడైనా సరే మానవాళి రక్షణకు సంఘీభావం ప్రకటించడమే తమ ధ్యేయంగా ముందుకొస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయిల్ సంబంధం ఉన్న కంపెనీలలో పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, ఆయా దేశాల పాలకవర్గాలపై ఒత్తిడి తెస్తున్నారు. వాటి లాభాలను మనం గనుక వాడుకుంటే, ఆ నెత్తురుకూడును మనం కూడా తింటున్నట్టే అని నిర్ద్వంద్వంగా వాదిస్తున్నారు.

అందుకే ఈ ఉద్యమం అటు పాలకుల్నే కాదు ఇటు శాంతి ఉద్యమకారులనూ విస్తుపోయేటట్లు చేస్తున్నది. యుద్ధాలకు వ్యతిరేకంగా గతం నుండి మానవాళి చేస్తున్న ఉద్యమాలకు మా ఉద్యమం కొనసాగింపు మాత్రమేనంటూ, ఈ ఉన్మాద పాలకులకు ముకుతాడు వేయాలంటే మాకు ఇంతకన్నా గత్యంతరం లేకుండా పోయిందని ఆ విద్యార్థి ఉద్యమ నేతలు తెలుపుతున్నారు.

నరమేధాన్ని కోరుకునే ఈ జియోనిస్టులు పైకి రూపంలో మనుషుల్లా కనిపిస్తున్నా వారు అంతరంగంలో తీవ్ర విద్వేష ఉన్మాదంతో రగలిపోతుంటారు. అన్యమతస్తుల ఊచకోతను నిర్లజ్జగా సమర్థిస్తుంటారు. క్రూరమృగాలు ఎక్కడున్నా ఒక్కలానే వ్యవహరిస్తుంటాయి. హింసా రక్తపాతాలే వాటి వికృతక్రీడ. అలాగే పెట్టుబడిదారీ దేశాల్లోని ప్రతీఘాత మితవాద శక్తులు పైకి నవ నాగరిక లక్షణాలతో సూటూబూటూ వేష భాషలతో వ్యవహరిస్తున్నా అంతర్గతంగా వారి మార్కెట్ లాభాల వేటలో ఎంతకైనా తెగిస్తారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూనే ఉంటారు. వారి వ్యవహారశైలి కపటత్వానికే ఓ పరాకాష్ట.

ఇక మన దేశంలో హిందూ మతోన్మాదులు సరేసరి. ఇస్లామోఫోబియా (ముస్లింలపై మత విద్వేషం)తో విషం కక్కుతుంటారు. నిత్యం ఎన్నికల ప్రచారంలో ఆ లజ్జాకర రెచ్చకొట్టుడు వైఖరిని మనం గమనిస్తూనే ఉన్నాం. ఎన్నికల ఓట్లకోసం మత ఘర్షణలు రగులు కొల్పేందుకు ఎంత చేయాలో అంతా చేస్తూనే ఉన్నారు.క్షణక్షణం పిల్లిమొగ్గలు వేస్తూనే ఉన్నారు.



అయినా నాలుగు దశల పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి కారణం మన భారత ప్రజానీకంలో బలంగా నాటుకుపోయిన ప్రజాస్వామ్య, మత సామరస్య వాతావరణమే కీలకమని చెప్పకతప్పదు. కంటికి రెప్పలా మనం దీనిని కాపాడుకోవాల్సిందే.

ఇలాంటి ఉన్మాదులంతా నేడు ఏకమై పాలస్తీనా స్వతంత్ర ఆకాంక్షకు, ఆ ప్రజల మానవ హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు. వందేండ్ల పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని అసలు గమనించడమే లేదు. గతేడాది అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడిని ఓ సాకుగా ప్రపంచానికి చూపడానికి యత్ని స్తున్నారు. కేవలం దానిని 'ఓ ఉగ్రవాద చర్యగా' కుదించి తమ పబ్బం గడుపుకునేందుకు విఫలయత్నం చేస్తున్నారు. పాలస్తీనా ప్రజల (అరబ్బుల) ఘటనను ఇస్లామిక్ టెర్రరిస్టు బూచిగా చూపేందుకు, ఐక్యరాజ్య సమితి న్యాయ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కుతున్నారు.

అయితే ఇలా చేయడం అమెరికా - ఇజ్రాయిల్ పాలకవర్గాలకు కొత్తేమీ కాదు. 1950 నుండి వారావిధంగా పాలస్తీనాకు వ్యతిరేకంగా మారణా యుధాలతో పాటు దుష్ప్రచారాస్త్రాలనూ సమకూర్చుకుంటున్నారు. అందుకు అవసరమయ్యే అర్థబలం అంగబలం గల ఉన్మాదుల లాబీను ఎప్పటికప్పుడు సృష్టించుకుంటూనే ఉంటారు.

ఇదే విషయాన్ని తెలియజేస్తూ 2006లో 'ది ఇజ్రాయిల్ లాబీ' అనే పుస్తకం కూడా విడుదలైంది.

ప్రపంచవ్యాప్తంగా యూదు యువతను సైన్యంలోకి ఆహ్వానిస్తూ తమ శిక్షణలో భాగంగా ఈ మతోన్మాద జాత్యాహంకారాన్ని నూరిపోస్తారు. పిల్లలకు పాఠశాలలు స్థాపించి చిన్నప్పటి నుండి వారికి అదే ఉన్మాద శిక్షణనిస్తారు. అందుకు అసంబద్ధ పురాణవాదనలను ముందు పెడతారు. పాలస్తీనా భూ భాగంపై ఇజ్రాయిల్ యూదులకు తప్ప అరబ్బులకు ఎలాంటి స్థానం లేదంటూ విషబీజాలు నాటుతారు.

చివరకు అరబ్బులు పాలస్తీనాను విడిచిపెట్టి వెళ్లడమే శ్రేయస్కరం అంటూ వారి మీడియా సన్నాయి నొక్కులతో కోడై కూస్తోంది. తరతరాలుగా జీవిస్తున్న వారి సొంతగడ్డపై వారు నిలబడటం కూడా పాపమనే రీతిలో ఓ కుట్రపూరిత భావాన్ని మనస్సుల్లోకి చొప్పిస్తారు.

పైగా నెతన్యాహుతో సహా యూదు రాజ్య భావనను తలకెక్కించుకున్న ఉన్మాదులు నరమేధం (జినోసైడ్) చేసే హక్కు, అధికారం తమ సొంతం అన్నట్టు, పరులెవ్వరూ ఆత్మరక్షణలో భాగంగా ప్రతి దాడులు చేసినా అది నేరంగానే బలంగా నమ్ముతుంటారు.

అందుకే నెతన్యాహును హిట్లర్‌ను పోలిన నరహంతకునిగా టర్కీ అధ్యక్షుడు ఎర్గోదిన్ విమర్శిస్తున్నాడు. కొలంబియా వామపక్ష నేత గుస్తావ్ పెట్రో అయితే 'చరిత్ర నిన్ను నరహంతకుడిగానే చూస్తుందని' నెతన్యాహును డైరెక్టుగానే హెచ్చరిస్తున్నాడు. 'బాంబులేసి వేలాది మంది అమాయక ప్రజలను బలికొనడం హీరోయిజం అనుకుంటున్నావా? నీకు ఫాసిస్టు హిట్లర్‌కు ఏమీ తేడాలేదు. పాలస్తీనా దేశాన్ని మొత్తం తుడిచిపెట్టేందుకు ఫాసిస్టులు ప్రయత్నిస్తుంటే మానవత్వం గలవారు చేష్టలుడిగి ఎలా కూర్చోగలరు?' అంటూ ఘాటుగా స్పందించాడు. కనుకనే మేం ఇజ్రాయిల్‌తో పూర్తి దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకుంటున్నట్టు మేడే నాడు విస్పష్టంగా ప్రకటించాడు. అంతకు ముందే బొలివియా ఇదే పనిచేసింది. హోండూరస్, బెలిజ్, మరికొన్ని చిన్నదేశాలు ఈ బాటనే ఎంచుకున్నాయి. ఇజ్రాయిల్‌కు సహకరించేది లేదని ఈజిప్టు తెగేసి చెప్పింది. ఒక వైపు శాంతి యత్నాలు జరుగుతూ ఉంటే, మరోవైపు గాజా సరిహద్దు రఫాపై ఇజ్రాయిల్ యుద్ధదాడులు జరపడం ఏరకమైన యుద్ధనీతి అని ప్రశ్నించింది.

> నరమేధాన్ని కోరుకునే ఈ జియోనిస్టులు పైకి రూపంలో మనుషుల్లా కనిపిస్తున్నా వారు అంతరంగంలో తీవ్ర విద్వేష ఉన్మాదంతో రగలిపోతుంటారు. అన్యమతస్థుల ఊచకోతను నిర్లజ్జగా సమర్థిస్తుంటారు. క్రూరమృగాలు ఎక్కడున్నా ఒక్కలానే వ్యవహరి స్తుంటాయి. హింసా రక్తపాతాలే వాటి వికృతక్రీడ. అలాగే పెట్టుబడిదారీ దేశాల్లోని ప్రతీఘాత మితవాద శక్తులు పైకి నవ నాగరిక లక్షణాలతో సూటూబూటూ వేష భాషలతో వ్యవహరిస్తున్నా అంతర్గతంగా వారి మార్కెట్ లాభాల వేటలో ఎంతకైనా తెగిస్తారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూనే ఉంటారు. వారి వ్యవహార శైలి కపటత్వానికే ఓ పరాకాష్ట.

అణుబాంబుతోనైనా సరే ఇజ్రాయిల్‌కు బుద్ధి చెప్పవలసివస్తే వెనుకాడేది లేదని ఇరాన్ అంటున్నది.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పరిణామాలే విద్యార్థి ఉద్యమాలకు కొత్త ఊపిరులు ఊదుతున్నాయి. ఉన్మాదులకు ఉద్యమాలే ఎన్నటికైనా అడ్డుకట్ట వేస్తాయని చరిత్ర మరోసారి రుజువు చేస్తున్నది.

కన్నయకుమార్‌పై దాడి



- పూలమాల వేయటానికి వచ్చి ..
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఘటన

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారంలో నార్త్ ఈస్ట్ ఢిల్లీకి చెందిన కాంగ్రెస్, ఇండియా బ్లాక్ అభ్యర్థి కన్నయ్య కుమార్‌పై దాడి జరిగింది. కన్నయ్య కుమార్‌కు పూలమాల వేస్తానన్న నెపంతో వచ్చిన ఓ యువకుడు చెంపదెబ్బ కొట్టినట్టు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన ఈశాన్య ఢిల్లీలోని ఉస్మాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్తార్ నగర్‌లో జరిగిందని పోలీసులు తెలిపారు. కన్నయ్యపై దాడి చేసిన ఆ దుండగుడిని పార్టీ కార్యకర్తలు పట్టుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా కౌన్సిలర్ ఛాయా శర్మపై కూడా అనుచితంగా ప్రవర్తించగా... పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'దేశాన్ని ముక్కలు చేయాలని ఎవరు మాట్లాడినా కన్నయ్యపై ఎటాక్ చేసిన తీరులోనే ట్రీట్‌మెంట్ ఉంటుందని ఆ దుండగుడు వీడియోలో పేర్కొన్నాడు. మాకు ఏ పార్టీతో సంబంధం లేదని, ఏ సంస్థ ఆజ్ఞతో ఈ పని చేయలేదని చెబుతున్నారు. అయితే దీనివెనుక బీజేపీ హస్తం ఉన్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

దండె విఠల్ కు సుప్రీంలో ఊరట

ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఆదేశాలపై స్టే

తదుపరి విచారణ జులై 10కి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీఆర్ఎస్ నేత దండె విఠల్ కు సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. తన ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను జులై 10కి వాయిదా వేసింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటా బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా దండె విఠల్ ఎన్నిక చెల్లదని ఈనెల 3న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే విఠల్ కు రూ. 50 వేల జరిమానా విధించింది. ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 13న దండె విఠల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై శుక్రవారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్ ల ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని విఠల్ తరపు న్యాయవాది కోర్టు ను అభ్యర్థించారు. ఈ వాదనలపై ప్రతివాది పాతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కాగా పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం, హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే సుప్రీంకోర్టు వేసవి కాలం సెలవుల తరువాత ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. కాగా, 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటా బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా విఠల్ నామినేషన్ వేశారు. దీంతో టికెట్ ఆశించి భంగపడ్డ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. తాను నామినేషన్ ఉపసంహరించుకోకపోయినా, తన సంతకాన్ని దండె విఠల్ ఫోర్జరీ చేశారని రాజేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం, సంతకం ఫోర్జరీ జరిగిందన్న సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్ ల్యాబోరేటరీకి ఇచ్చిన నివేదిక ఆధారంగా విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది.

డివైడర్‌ను ఢీకొని ముగ్గురు మృతి

- దంపతులతో పాటు కుమారుడు దుర్మరణం

నవతెలంగాణ-జోగిపేట



నాందేడ్ అఖోలా 161వ జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి ఏడేండ్ల బాలుడు మృతి చెందాడు. జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పెద్దతాడ్కూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), సునీత(30) దంపతులు తమ కుమారుడు నాగేష్ (7)తో కలిసి బైక్‌పై అందోల్ మండలం రామ్‌సానిపల్లి నేషనల్ హైవే మీదుగా వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అసోం బీజేపీలో విభేదాలు..

- మంత్రి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ఫిర్యాదు
- సోషల్ మీడియాలో వైరల్



గౌహతి: అసోం బీజేపీలో విభేదాలు ముదిరి పాకానపడ్డాయి. మంత్రి వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎమ్మెల్యే మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయనకు చెప్పాలంటూ సీఎంకు సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్ట్ చేశారు. 2015లో కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన మంత్రి జయంత మల్లబరువా ఇటీవల మీడియాతో మాట్లాడారు. పాత కాలం బీజేపీ నేతలపై వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'గత 50 ఏండ్లుగా పార్టీలో ఉన్నప్పటికీ, వారు పార్టీకి సమయం కేటాయించరు. కాబట్టి, పార్టీకి మీ సహకారం, పార్టీ పట్ల మీ అంకితభావం, నిబద్ధత ఎంత అన్నది మీ తీరు నిర్ణయిస్తుంది' అని అన్నారు.కాగా, బీజేపీ మంత్రి జయంత వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎమ్మెల్యే మృణాల్ సైకియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడే తీరు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో నోరు అదుపులో పెట్టుకోవాలని చెప్పాలంటూ సీఎం హిమంత బిస్వా శర్మకు సూచించారు. ఈ మేరకు బహిరంగంగా విమర్శిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంత్రి జయంత మాట్లాడిన వీడియో క్లిప్‌ను కూడా అందులో షేర్ చేశారు. సార్వత్రిక ఎన్నికపుడు ఇదేం రచ్చరా అంటూ బీజేపీ వర్గాలు తెగ బాధపడిపోతున్నాయట.

'శ్రమ దోపిడీ' ఆదాయాలు!

మార్క్స్ క్యాపిటల్‌ని సులభంగా పరిచయం చేయడంలో రంగ నాయకమ్మగారు ప్రసిద్ధులు. రచయిత్రిగా, నవలాకారిణిగా, విమర్శకురాలిగా తెలుగు పాఠకులకు చిరపరిచితులయిన వీరు 'శ్రమ దోపిడీ' ఆదాయాలు గురించిన విశ్లేషణను మన పత్రిక పాఠకులకు అందిస్తున్నారు. శ్రామిక వర్గ పోరాటాలలో పాల్గొనే నాయకులకు, కార్యకర్తలకు సాధారణ ప్రజలకూ అవసరమైనదిగా ఉంటుందని భావిస్తూ ప్రచురిస్తున్నాము. - సంపాదకులు



మానవ సమాజం, 3 రకాల దోపిడీ ఆదాయాలతో, వందలాది సంవత్సరాలుగా సాగుతోంది. ఆ 3 తప్పుడు ఆదాయాలు: ఇవి "కౌలూ, వడ్డీ, లాభం" అనే పేర్లతో ఉన్నాయి! ఇవి, ఈ నాడే కాదు, ఏనాటి నించో ఉన్నాయి! వీటిలో, 'లాభం' అనేది, ఆలశ్యంగా, పెట్టుబడిదారీ విధానం నించే మొదలైంది. ఆ 3 మాటలూ, 3 తప్పుడు ఆదాయాలు! ఆ తప్పులు ఏమిటో మొదట తెలుసుకుని, వాటిని తీసివేసే పరిష్కార మార్గాలేమిటో కూడా చూస్తాం!

పార్ట్ 1



1.'కౌలు' అంటే ఏమిటి?: ఈ తప్పుడు ఆదాయానికి 'భూమి'తోటే సంబంధం! 'భూమి' అనేది, మానవులు తయారు చేసిన వస్తువో, పదార్థమో, కాదు! భూమి అంతా, దాని కొండలతోటీ, గనులతోటీ, నదులతోటీ, మహా సముద్రాలతోటీ వున్న ప్రకృతి సహజ పదార్థం! (మార్క్సు: "మొత్తం సమాజం గానీ, ఒక దేశం గానీ, అన్ని సమాజాలూ కలిసిగానీ, భూగోళానికి యజమానులు కారు.") అటువంటి ప్రకృతి విషయాలు, మానవ సమాజంలో, కొందరు మానవుల 'ఆస్తులు' గా అయిపోయాయి! అది ఎలా అయిందో, ఇప్పుడే, ఇక్కడే చెప్పుకోలేము. ప్రపంచం లో వున్న భూమి అంతా కొందరికే 'ఆస్తి'! అంటే, మిగిలినవారికి చారెడు భూమి కూడా ఉండక పోవచ్చు, కొందరికి అరిచెయ్యంతైనా ఉండొచ్చు.

మానవులు జీవించడానికి, మొదట 'భూమి' అత్యవసరంగా కావాలి! నివాసాలకూ, గుప్పెడు ధాన్యమో, ఆకు కూరలో, పండించుకోవడానికీ! భూమిలేని మనిషి కూడా, భూమి మీదే ఉంటాడు. కానీ, ఏ భూమి మీద? హక్కులేని భూమి మీద! ఆ మనిషి, భూమిని ఆస్తిగా వున్న మనిషి దగ్గిరికి వచ్చి అడుగుతాడు, "నీ భూమిలో నన్ను ఏదో ఒక పంట పండించుకోనియ్యి" అని! భూమి మనిషి ఉత్సాహంగానే అంగీకరిస్తాడు. "సరే, కొంత భూమి ఇస్తా! ఏదో ఒక పంట పండించుకో! అయితే, ఆ పంటలోనించి నేను అడిగినంత భాగం నాకు ఇచ్చెయ్యి! దాని పేరు 'కౌలు' అంటాను" అంటాడు. కౌలు ఒప్పందం కుదిరింది! భూమిగల మనిషి, భూమికి యజమాని! 'భూమి మీద పంటలు పండించే మనిషి, 'కౌలు రైతు'! భూమి యజమాని, తన భూమినంతా ఒక్క కౌలుదారుడికే కాదు, భూమినిబట్టి, ఎక్కువ మందికి ఇచ్చి, ఎక్కువ కౌళ్ళు అందుకుంటూ వుంటాడు!

కౌలు" అంతా తప్పుడు ఆదాయం! ఎందుకు? భూమి యజమాని, ఆ కౌలుని, తన శ్రమ లేకుండా కౌలు రైతుల శ్రమల ద్వారా పొందుతాడు గనక. భూమి అనేదీ, అతడి శ్రమతో వచ్చింది కాదుబీ కౌలూ అతడి శ్రమ కాదు! (మార్క్సు: "కౌళ్ళని సష్టించడానికైతే, భూస్వామి ఏమీ చెయ్యడు.") కాబట్టి, కౌలు' తప్పుడు ఆదాయమే! అయితే, దీనికి పరిష్కారం ఉండాలి! ఏం పరిష్కారం? తర్వాత చూద్దాం.

2. 'వడ్డీ' అంటే ఏమిటి?: ప్రాచీన సమాజంలో, ఈ వడ్డీ' అనే మాట ఎప్పుడూ వుండి వుండదు. క్రమంగా, ఇది కూడా పుట్టింది! ఎందుకు? ఒక మనిషికి, ఒక నాడు వాడకానికి ఏదైనా వస్తువో, పదార్థమో, కొంత డబ్బో, కావలసి వస్తే, ఆ మనిషి, ఇంకో మనిషి నించి, ఏదో ఒక దాన్ని అడిగి తీసుకుని, తర్వాత ఇచ్చేస్తాడు! కానీ, అలా ఇచ్చేసేటప్పుడు, ఆ తీసుకున్న దాన్ని తిరిగి ఇచ్చివేస్తూ, ఇంకా ఏదో కూడా ఇవ్వాలి. అంటే, మొదట 10 రూపాయల డబ్బుని తీసుకుంటే, దాన్ని తిరిగి కొన్ని రోజుల్లో ఇచ్చేసేటప్పుడు, ఆ 10కి , ఇంకా ఒకటి రెండు గానీ, నాలుగైదు గానీ, ఎక్కువ రూపాయలు, కలిపి ఇవ్వాలి! ఇచ్చేదాని పేరు 'వడ్డీ'! 'అప్పు' అనే మాట కొత్తగా పుట్టినప్పుడే, ఈ 'వడ్డీ' అనే మాట కూడా పుట్టి వుంటుంది. ఈ 'వడ్డీ' గా తీసుకునేది కూడా తప్పుడు ఆదాయమే! (మార్క్సు: "వడ్డీ అనేది, మొదటి నించీ కూడా, పూర్తిగా ఒక హేతువిరుద్ధ వ్యక్తీకరణే.") ఎందుకంటే, 'వడ్డీ'ని తీసుకునే మనిషి, ఆ వడ్డీని తీసుకోవడానికి, ఏం శ్రమ ఇచ్చినట్టు? తను ఇచ్చిన డబ్బు, మళ్ళీ వెనక్కి తీసేసుకున్నాడేగానీ, దాన్ని పోగొట్టుకోలేదు కదా? దాని మీద ఇంకా తీసుకోవడానికి కారణం ఏమిటి? ఎవరికన్నా సహాయంగా ఏదైనా ఇస్తే, దాన్ని వెనక్కి తీసేసుకోవచ్చు! దానిమీద ఎక్కువని ఎందుకు తీసుకోవాలి? "సహాయం చేసినందుకు, కొంత ఎక్కువగా తీసుకుంటే తప్పా"-అంటారా? మానవుల్లో, పరస్పరం అప్పుడప్పుడూ సహాయాలు అవసరమే! వాటి కోసం అడిగినది ఇచ్చి, దాని కోసం ఎక్కువగా తీసుకోవడం సరైనదే అవుతుందా? దీన్ని ఇంకా చూడాలి. ఎలా చూసినా, 'వడ్డీ పద్ధతి' తప్పే అవుతుంది! ఈ తప్పుని ఒక మనిషి చేసినా, బ్యాంకు పేరుతో ఒక సంస్త చేసినా, తప్పే! కాబట్టి, దీనికి కూడా పరిష్కారం కావాలి! ఏమిటి?

మోడీ పర్యటనకు ముందు అదుపులోకి ఉల్లి రైతులు

ముంబయి : ఉల్లి ఎగుమతి ధరలపై కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకున్న నాసిరకం నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని భావించిన 50 మంది రైతులు, ప్రతిపక్ష నాయకులను నాసిక్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ప్రధాని మోడీ నాసిక్ పర్యటనకు ముందు ఈ ఘటన జరగడం గమనార్హం. "గతేడాది ఆగస్టు 19న, కేంద్రం ఉల్లిపాయల ఎగుమతిపై 40 శాతం సుంకాన్ని విధించింది. అదే ఏడాది అక్టోబర్ 28న ఎగుమతిదారు ప్రతి టన్ను ఉల్లిపాయకు ప్రభుత్వానికి రూ.66,647 చెల్లించాలని బదులుగా కొత్త నిర్ణయం తీసుకున్నది. ఆ తర్వాత డిసెంబర్ 7న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) ఉల్లి ఎగుమతి విధానాన్ని మార్చి 31, 2024 వరకు నిషేధం లేకుండా చేసేందుకు సవరిస్తున్నట్టు ప్రకటించింది" అని మహారాష్ట్ర రాజ్య కాండ ఉత్పాదక్ షెత్కారీ సంఘటనా (మహారాష్ట్ర రాష్ట్ర ఉల్లి ఉత్పత్తిదారుల సంఘం) వ్యవస్థాపకుడు భరత్ డిఘోలే తెలిపారు. "అయితే, మార్చి నాటికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఎగుమతి నిషేధం కొనసాగుతుందని డీజీఎఫ్‌టీ మరో ప్రకటన విడుదల చేసింది. మే 4న ఎంపిక చేయబడిన నిబంధనలు, షరతులపై నిషేధం ఎత్తివేయబడింది. ఎగుమతిదారు ఇప్పుడు మెట్రిక్ టన్నుకు రూ.45,820 ప్రభుత్వానికి చెల్లించాలి" అని ఆయన చెప్పారు.

'మా కోసం ఎవరూ మాట్లాడలేదు'

రాష్ట్రం 50కి పైగా దేశాలకు ఉల్లిని సరఫరా చేస్తుందని చెప్పిన డిఘోలే.. మహా వికాస్ అఘాడి తమకు మద్దతు ఇవ్వాలనుకుంటే వారు కేంద్రంతో తమ ఆందోళనను ఉధతం చేయగలరనీ కానీ అది ఎప్పుడూ జరగలేదని అన్నారు. "ఎన్సీపీ నాయకుడు శరద్ పవార్‌కు నిజంగా రైతుల పట్ల శ్రద్ధ ఉంటే మా సమస్యలను వాణిజ్య మంత్రి లేదా హెూం మంత్రి వద్దకు సులభంగా తీసుకెళ్లవచ్చు. ఈ విషయం మీడియా పెద్దగా పట్టించుకోలేదు. అంతేకాకుండా, ప్రధాని మోడీ నుంచి శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే వరకు ఇక్కడ ఉన్నారు. కానీ ఎవరూ మా కోసం మాట్లాడలేదు" అని ఆవేదన వ్యక్తం చేశార.

నా బిడ్డను మీకు అప్పగిస్తున్నా...

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియా మాట్లాడుతూ రాయబరేలీతో తనకు, తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించారు. 'చాలా కాలం తర్వాత మీ మధ్యకు రాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎంపీగా మీకు సేవలందించే అవకాశం నాకు కలిగించారు. నా జీవితంలో ఎప్పటికీ దీన్ని మరిచిపోలేను. గత వందేండ్లుగా ఈ గడ్డతో మా కుటుంబ అనుబంధం వేళ్లానుకుని ఉంది. ఈ అనుబంధం గంగాజలంలా స్వచ్ఛమైనది. అవధ్, రాయబరేలీలో రైతుల ఆందోళనతో ఈ అనుబంధం మొదలైంది' అని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాయబరేలీ ప్రజలు, మాజీ ప్రధాని, కీర్తిశేషులు ఇందిరా గాంధీ ద్వారా తాను నేర్చుకున్న పాఠాలే తన పిల్లలైన రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీకి నేర్పానని చెప్పారు. రాయబరేలీ ప్రజలకు ఇందిరాగాంధీ హృదయంలో ప్రత్యేక స్థానం ఉండేదని, ఆమె పనితీరును తాను చాలా దగ్గర నుంచి పరిశీలించానని, ఇక్కడి ప్రజలంటే ఆమెకు ఎనలేని అభిమానం ఉండేదని అన్నారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం పోటీ చేస్తున్న రాయబరేలీ నియోజకవర్గానికి సోనియాగాంధీ 2004 నుంచి వరుసగా నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈ సారి ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలీలో పోలింగ్ జరుగనుంది.

ఏచూరి, దేవరాజన్ ప్రసంగాలు సెన్సార్

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం చేసుకోవడానికి దూరదర్శన్, ఆకాశవాణిలు అవకాశం కల్పిస్తాయి. ప్రతీ రాజకీయ పార్టీకు కొంత సమయాన్ని ఇస్తాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని దూరదర్శన్ స్టూడియోలో సీతారాం ఏచూరి ఇచ్చిన టెలివిజన్ ప్రసంగం నుంచి రెండు పదాలను తొలగించగా, 'దివాలా' ప్రభుత్వం పదాన్ని వైఫల్య' ప్రభుత్వంగా మార్చారు. అలాగే, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జి.దేవరాజన్ కోల్‌కతాలో చేసిన ప్రసంగంలో నుంచి 'ముస్లింలు' అనే పదాన్ని తొలగించారు. ఏచూరి ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల సూచనలు తొలగించాలని కూడా అధికారులు కోరారు. అయితే తన ప్రసంగంలో తొలగింపులను, సవరణలను పున:పరిశీలించాలని దూరదర్శన్ డీజీకి ఏచూరి లేఖ రాసారు. అయితే ఏచూరి అభ్యర్థనను అధికారులు ఆమోదించలేదు. ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నామని, ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు చేపట్టామని అధికారులు వివరించారు. అయితే అధికారులు తీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దూరదర్శన్, ఆకాశవాణిలదీ అధికార నియంతృత్వంగా విశ్లేషకులు విమర్శిస్తున్నారు.ఎన్నికల చిహ్నాలు (రిజర్వేషన్, కేటాయింపు) ఉత్తర్వులు, నిబంధనలు 1968 ప్రకారం ఆరు జాతీయ పార్టీలు, 59 రాష్ట్ర పార్టీలకు దూరదర్శన్, ఆకాశవాణిలో ప్రచార అవకాశం కల్పిస్తున్నారు. జాతీయ పార్టీలకు దూరదర్శన్ జాతీయ ఛానెల్‌లో కనీసం 10 గంటల సమయం, ప్రాంతీయ దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో కనీసం 15 గంటల సమయం కేటాయిస్తారు. రాష్ట్ర పార్టీలకు ప్రాంతీయ దూరదర్శన్, ఆకాశవాణీ కేంద్రాల్లో మొత్తంగా 30 గంటల సమయం కేటాయిస్తారు. రాజకీయ నాయకులు తమ ప్రసంగాలను రికార్డింగ్ చేయడానికి కనీసం 4 రోజుల ముందే రాత పూర్వకంగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రసంగాలను అధికారులు ఆమోదించాల్సి ఉంటుంది.

ముందు నుయ్యి..వెనుక గొయ్యి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ సర్కారుకు సవాల్‌గా నిలిచాయి. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేస్తే ఒక సమస్య, చేయకపోతే మరో సమస్య సర్కారును వేటాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ పథకాలకే నిధుల లేమీ వేధిస్తుండగా, మరోవైపు కాళేశ్వరం ప్రభుత్వానికి గుదిబండ కానుందని రాజకీయ విశ్లేషకులు, సాగునీటిరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి. కాళేశ్వరాన్ని వదిలేస్తే భారీ నష్టం చేకూరే అవకాశాలు ఉన్నాయి. లేదా పాత కాంగ్రెస్ విధానం ప్రకారం మేడిగడ్డ నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి చేపడితే పరిస్థితి ఏంటనే విషయాలపై కూడా చర్చ నడుస్తున్నది. ఈనేపథ్యంలో శనివారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న తొలి క్యాబినెట్ భేటి ఇదే కావడం గమనార్హం. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ జూన్ ఆరవ తేదీ వరకు ఉన్నప్పటికీ, ఈ క్యాబినెట్‌లో తీసుకునే నిర్ణయాలు ఆ తర్వాతే అమలుచేసే అవకాశముంది. ఇదిలావుండగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఉనికిపై అటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ), ఇటు జస్టిస్ పినాకిని చంద్రఘోష్ న్యాయ విచారణ కమిషన్ అనుమానం వ్యక్తం చేశాయి. ప్రణాళిక నుంచి నిర్మాణం దాకా అన్ని చోట్లా అవకతవకలే జరిగాయని ఇప్పటికే వ్యాఖ్యానించాయి. సర్కారు నిఘా(విజిలెన్స్) విభాగం సైతం అవినీతి, అక్రమాలు జరిగాయంటూ మధ్యంతర నివేదిక అందజేసింది. ఎన్‌డీఎస్‌ఏ సైతం వర్షాలు వచ్చేలోపు తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించింది. ఏడో బ్లాక్‌లోని రెండు క్రస్ట్ గేట్లు పూర్తిగా తొలగిం చాలనీ, అలాగే బ్యారేజీకి చెందిన అన్ని గేట్లు తెరిచే ఉంచాలని అభిప్రాయపడింది. లేకపోతే భారీ నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఒకవేళ మరమ్మతు చేసినా మేడిగడ్డ బ్యారేజీ నిలబడుతుందనే గ్యారంటీ లేదంటూ నీటిపారుదల శాఖ ఈఎన్సీ జనరల్, ముఖ్యకార్యదర్శికి నివేదిక పంపింది. ఈనేపథ్యంలో గత రెండు, మూడు రోజులుగా ప్రభుత్వంలో తర్జనభర్జన చోటుచేసుకుంటున్నది. ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక ప్రకారం మరమ్మతులు చేసేందుకు ప్రయత్నాలు చేయాలని జస్టిస్ పీసీ ఘోష్ సైతం సర్కారుకు సూచించారు. ఈ నేపథ్యంలో మొత్తం పరిస్థితిని వివరిస్తూ రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అధికారులు నివేదిక సమర్పించారు. సాంకేతిక అంశాలు, ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ నివేదికలు, జస్టీస్ ఘోష్ విచారణ కమిషన్ అంశాలపై సదరు మంత్రితో చర్చించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం నిధులు అవసరమని వారు కోరారు. దీనిపై సీఎంతో మాట్లాడతానని ఇటీవల అధికారులతో మంత్రి ఉత్తమ్ చెప్పినట్టు తెలిసింది. అయితే ప్రాజెక్టు నిర్మాణ, నిర్వహణ ఒప్పందం ప్రకారం వర్కింగ్ ఏజెన్సీ అయిన ఎల్‌అండ్‌టీనే బ్యారేజీలకు మరమ్మతులు చేయాలని సాగునీటపారుదల సీతః స్థాయి అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు చట్టం ప్రకారం ప్రభుత్వ వ్యవహరిస్తే సరిపోతుందని అభిప్రాయ పడుతున్నారు. అయితే ఈ ఖర్చును భరించడానికి నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ నిరాకరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవడానికి రేవంత్ సర్కారు ఏం చేయనుందనే విషయమై ఆసక్తి నెలకొంది. క్యాబినెట్‌లో చర్చించి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తుందా ? లేదా నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ నే చేయాలని ఆదేశిస్తుందా ? అనేది తేలాల్సి ఉంది.

నేడే ఎప్‌సెట్ ఫలితాలు!

- ఉదయం 11.00 గంటలకు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11.00 గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బీ. డీన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల ఏడు నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,00,432 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 91,633 (91.24 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 8,799 (8.76 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,54,750 మంది దరఖాస్తు చేయగా, 2,40,617 (94.45 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 14,133 (5.55 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

లిక్కర్ స్కాం కానే కాదు

- కేంద్రం కూడా నేరం చేసినట్లే
- పలువురి పేర్లు చెప్పాలని కవితపై దర్యాప్తు సంస్థల ఒత్తిడి
- తీహార్ జైల్లో కవితతో ములాఖత్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్

న్యూఢిల్లీ : ఏ రాష్ట్రమైన, దేశమైన ఆదాయాన్ని పెంచుకోవడానికి రకరకాల పాలసీలు చేస్తుంటాయని, ఆ క్రమంలో ఆదాయం పెంచుకోవడం కోసం ఢిల్లీ ప్రభుత్వం లిక్కర్ పాలసీ తీసుకొచ్చిందని అని బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ అన్నారు. ఇది పాలసీయే కానీ, స్కాం కానేకాదని తెలిపారు. ఈ పాలసీ అమలులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ నేరస్తులయితే, పదేండ్లలో వివిధ ప్రయివేటీకరణ పాలసీలు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం కూడా నేరం చేసినట్లే అవుతుందని చెప్పారు. తీహార్ జైల్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవితతో శుక్రవారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ములాఖత్ అయ్యారు. అనంతరం తెలంగాణ భవన్ ముందు మీడియాతో మాట్లాడారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కవితను ఇందులో ఇరికించారని న్యాయవాదికి నోటీసులు ఇవ్వకుండానే జైలులో ఉన్న కవితను సీబీఐ అరెస్టు చేసిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రౌస్ అవెన్యూ కోర్టులో బెయిల్‌పై విచారణ జరుగుతుండగానే రాత్రికి రాత్రి జడ్జిని మార్చారంటే ఏ విధంగా వేధించాలని ప్రయత్నిస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కోర్టులను కూడా భయపెట్టిస్తున్నదని ఆరోపించారు. ఈ కేసులో పలువురిని ఇరికించడానికి, వాళ్ల పేర్లు చెప్పాలని దర్యాప్తు సంస్థలు ఒత్తిడి చేసినట్లు కవిత తమకు చెప్పారన్నారు. అస్సాం సీఎం హేమంత్ బిశ్వా శర్మ, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఛగన్ భుజబల్, ప్రఫుల్ పటేల్ వంటి వారిపై ఉన్న కేసులు ఎందుకు ముందుకు సాగలేదని ప్రశ్నించారు. మిగిలిన మూడు దశల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లిక్కర్ కేసులో పీఎంఎల్‌ఏ వర్తించదు

ఢిల్లీ లిక్కర్ కేసులో పీఎంఎల్‌ఏ చట్టం వర్తించదని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ చట్టం కేవలం, ఉగ్రవాదలకు ఆర్థిక వనరులు చేరడం, డ్రగ్స్ రవాణాకు నిధుల వినియోగం, దేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలించే చర్యలకు వర్తిస్తుందన్నారు. ఈ కేసులో ఎక్కడా డబ్బు దొరకలేదని గుర్తు చేశారు. దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్న రూ.100 కోట్లు ఎక్కడ అని అడిగారు. డబ్బు స్వాధీనం చేసుకోకుండా వ్యక్తిని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. అలాంటప్పుడు కేసుకు పీఎంఎల్‌ఏ ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. లంచం డిమాండ్ చేసినట్లు కూడా ఈ కేసులో లేనప్పుడు అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తింపజేశారో దర్యాప్తు సంస్థలు సమాధానం చెప్పాలన్నారు. కేవలం సహనిందితులు, అప్రూవర్ల నుంచి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకొని కవితను నిందితులుగా చేశారని అన్నారు.

రాబోయేది సంకీర్ణ యుగమే

దేశంలో రాబోయేది సంకీర్ణ యుగమని బాల్క సుమన్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దెబ్బతింటుందని, ఈ ఎన్నికల్లో బీజేపీకి 200-220 సీట్లు మించబోదని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల గొంతులు నొక్కి, కేసులు పెట్టి రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ భావించిందని, అదే వాళ్లకు నష్టం చేసిందన్నారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కవితను అరెస్ట్ చేశారని ఫైర్ అయ్యారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఇలాంటి కేసులతో బెదిరిస్తారనుకుంటే అది బీజేపీ భ్రమనే అవుతుందని చెప్పారు. జైల్‌లో కవిత ధైర్యంగా ఉన్నారని, ఇలాంటి కేసులకు అదిరేది, బెదిరేది లేదని తేల్చిచెప్పారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై , ఫాసిస్టు విధానాలపై ఇంకా గట్టిగా పోరాడుదామని కవిత అన్నారని వెల్లడించారు. న్యాయపరంగా కేసులను ఎదుర్కొంటామని ప్రకటించారు. తమకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించామని, తప్పకుండా న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రత

- కౌంటింగ్ హాల్స్‌కూ సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ
- నిరంతరం సాయుధ బలగాల పహారా, 144 సెక్షన్
- స్ట్రాంగ్ రూమ్‌ల లాక్‌బుక్‌లు పరిశీలన : రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రం గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ లోకేష్ కుమార్ శుక్రవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్లతో కలిసి సందర్శించారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలు, సెక్యూరిటీ లాక్‌బుక్ రిజిస్టర్‌లను, మూడు అంచెల సెక్యూరిటీ ఏర్పాట్లను రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోటుపాట్లకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ సెక్యూరిటీ చర్యలు జిల్లా యంత్రాంగం చేపట్టినట్టు తెలిపారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటుతో పాటు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నట్టు తెలిపారు.. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ సీల్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ఈవీఎంలు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అదనంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటుతో పాటు కౌంటింగ్ సెంటర్‌లో జనరేటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, నిమ్జ్ ప్రత్యేకధికారి రవీందర్ రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర క్యాబినెట్

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ప్రత్యామ్నాయాలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవల మధ్యంతర నివేదికను సమర్పించింది. ఆ నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలని సీఎం నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ తదితర అంశాలను సమావేశంలో చర్చించనున్నారు.

విభజన హామీలపై పీటముడి

విభజనకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. పదేండ్లు గడిచినా ఇప్పటి వరకూ అవి కొలిక్కిరాలేదు. ప్రధానంగా విభజన చట్టం 9, 10వ షెడ్యూల్‌లోని పలు అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. తొమ్మిదో షెడ్యూల్ లోని సమస్యలపై కేంద్రం ఏర్పాటు చేసిన షీలా భిడే కమిటీ పలు సిఫార్సులు చేసింది. ఉమ్మడి ఏపీలో దాదాపు 91 కార్పొరేషన్లు ఉండగా, ఆర్టీసీ, ఎస్ఎఫ్‌సీ వంటి 23 కార్పొరేషన్ల ఆస్తుల పంపకంలో ఎవరి వాదన వారిదే అన్న చందాన పరిస్థితి తయారైంది. ఆస్తుల విషయంలో తెలంగాణ వాదనను కేంద్రం సమర్థించినప్పటికీ ఏపీ అంగీకరించక పోవడంతో అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. పదో షెడ్యూల్‌లో మొత్తం 142 సంస్థలుండగా, తెలుగు అకాడమీ లాంటి 30 సంస్థలపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. విభజన చట్టం ప్రకారం పదేండ్లు ముగిసిన నేపథ్యంలో వీటి స్వాధీనానికి తీసుకోవాల్సిన చర్యలు, అనంతరం ఎదురయ్యే పరిస్థితులపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు.

జూరాలకు 2,451 క్యూసెక్కుల నీరు

- తాగునీటి కోసం నారాయణపూర్ డ్యామ్ నుంచి విడుదల

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

గద్వాల తాగునీటి అవసరాల కోసం కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యామ్ నుంచి విడుదల చేసిన నీళ్లు గురువారం ఉదయం జూరాల డ్యామ్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం వినతి మేరకు కర్ణాటక 1.09 టీఎంసీల నీటి విడుదలకు సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నారాయణపూర్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయగా.. గురువారం జూరాల ప్రాజెక్టుకు 2,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అలాగే అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో ఆ నీరు కూడా తోడవ్వడంతో జూరాలకు అధిక మొత్తంలో ప్రవాహం వస్తోంది.

క్యాబినెట్‌లో గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల పెంపుపై నిర్ణయం తీసుకోవాలి


- విద్యార్థి, నిరుద్యోగ నాయకులు శివానందస్వామి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల పెంపుపై శనివారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని విద్యార్థి, నిరుద్యోగ రాష్ట్ర నాయకులు మఠం శివానంద స్వామి ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ ఇచ్చిన హామీ నిలబెట్టుకో వాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకను గుణంగా గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో పోస్టుల ను అదనంగా కలపాలని కోరారు. గ్రూప్-4లో అదనంగా పోస్టులను కలిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

బంధం మరింత బలోపేతం

- చైనా, రష్యా అంగీకారం
- ఉక్రెయిన్ సమస్యకు రాజకీయ పరిష్కారానికి ప్రణాళిక
- పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం : సంయుక్త ప్రకటన విడుదల



బీజింగ్ : చైనా, రష్యా మధ్య సహకార బంధాన్ని మరింత బలోపేతం గావించాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించి పలు ఒప్పందాలపై చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ గురువారం సంతకాలు చేశారు. ఆ తరువాత వారు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టపరచుకోవడం ద్వారా కొత్త శకాన్ని నెలకొల్పేందుకు ఇరువురు నేతలు ప్రతినబూనారు. ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలనే విషయంలో రష్యా,చైనా నిబద్ధతను ఈ సంయుక్త ప్రకటన చాటిచెబుతోంది. ఉక్రెయిన్ సమస్యకు సరైన రాజకీయ పరిష్కారం చూపాలనే దానిపై ఇరు దేశాలు ఏకీభావంతో ఉన్నాయి. పుతిన్ రెండు రోజుల చైనా పర్యటన శక్రవారంతో ముగిసింది. .ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ రష్యా, చైనా మధ్య సంబంధాలు స్థిరమైనవి, రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలే కాకుండా ప్రాంతంతీయ, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సులకు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. చైనా, రష్యా రెండూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు, అభివృద్ధి చెందున్న ప్రధాన మార్కెట్‌లని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

చైనా, రష్యా మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు. రెండు దేశాలు ఈ సందర్భాన్ని కొత్త శకం ప్రారంభానికి బిందువుగా తీసుకోవాలని, ద్వైపాక్షిక సహకారాన్ని సుసంపన్నం చేసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పుతిన్ మాట్లాడుతూ, చైనాతో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం, ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (షాంఘై సహకార కూటమి) వంటి ఫ్రేమ్‌వర్కులలో సన్నిహితంగా కమ్యూనికేట్ చేసుకోవడం, సహకరించుకోవడం, మరింత న్యాయమైన, సమతుల్యతతో కూడిన అంతర్జాతీయ క్రమాన్ని ఏర్పాటు చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని అన్నారు. వాణిజ్యం, ఆర్థికం, ప్రకృతి పరిరక్షణ, తనిఖీ, మీడియా వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు సంబంధించిన ఒప్పందాలపై ఇరువురు నేతలు సంతకాలు చేశారు.

పాలస్తీనా- ఇజ్రాయిల్ వివాదానికి తక్షణమే తగు పరిష్కారాన్ని చూపాల్సిన అవసరముందని పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరూ చెప్పారు. రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని వారు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితిపై రెండు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అణ్వాయుధాలు కలిగిన దేశాల మధ్య ప్రత్యక్ష ఘర్షణను నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని, అణ్వాయుధాల తొలి ప్రయోగాన్ని నిషేధిస్తూ అణ్వస్త్ర దేశాలన్నీ ఒక ఒప్పందానికి రావాలని వారు సూచించారు.

ప్రపంచ వ్యాప్తంగాను, అంతరిక్షంలో క్షిపణి రక్షణ వ్యవస్థ విస్తరణ, సైనిక ప్రయోజనాలకు కోసం వాటిని వినియోగించడానికి అమెరికా యత్నించడంపై ఇరు దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికా అనుసరిస్తున్న సంఘర్షణ విధానాలకు స్వస్తిపలకాలని, ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం మానుకోవాలని ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొట్టే వైఖరిని విడనాడాలని చైనా, రష్యా పిలుపునిచ్చాయి. చైనా లక్ష్యంగా అమెరికా రూపొందించిన ఆసియా పసిఫిక్ వ్యూహాన్ని, ఆకస్ కూటమి ఏర్పాటును తాము గట్టిగా వ్యతిరేకిస్తున్నామని ఇరువురు నేతలు చెప్పారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

లెప్రసీ రికార్డుల పరిశీలన..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుల్తాన్ బజార్, ఇసామియా బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ జిల్లా న్యూక్లియస్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లెప్రసీ ఎల్‌సీడీసీ ఎస్ఐఎస్ రికార్డులను, లెప్రసి కేసుల వివరాలను పరిశీ లించిన జిల్లా పీఎంఓ ఆఫీసర్ వనిత, డీప్యూటీ పిఎంలో ఆఫీసర్‌లు రాధాకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, క్లస్టర్ డీప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, నోడల్ పర్సన్స్‌లు రామలక్ష్మి విజయమ్మ తదితరులు.

వృద్ధురాలు అదృశ్యం..



నవతెలంగాణ-హాయత్‌నగర్

మతి స్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం హాయత్ నగర్‌లోని ఆర్ టీసీ కాలనీలో నివాసం ఉంటున్న సరికంటి సైదులు తల్లి సరికంటి మట్టమ్మ (65) ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఐఎస్ఆర్ నుండి వెళ్లిపోంది. ఊరి నుండి ఇంటికి వచ్చిన ఆమె కొడుకు వచ్చి ఆరా తీయగా అతని తల్లి లేకపోవడంతో చుట్టూ పక్కల వారిని, బంధువులను ఆరాతీయగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో హాయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష‌మెంట్ యాక్ట్ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ నిబంధనలు పాటించని హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష‌మెంట్ యాక్ట్ సమావేశానికి చైర్మెన్ హెూదాలో హాజరైన కలెక్టర్.. ప్రయివేటు క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, హాస్పిటల్స్ నడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలోని అన్ని క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, హాస్పిటల్స్, వెల్‌నెస్ సెంటర్లు, ఫిజియోథెరఫీ సెంటర్లు, ఐక్లినిక్‌లు, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హెూమియో, సిద్ధ, యోగా, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్‌లు సైతం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేదంటే పెనాలిటీ, సీజ్ చేస్తామని హెచ్చరించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలు ప్రతి క్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్, హాస్పిటల్స్, ఆయుష్ సెంటర్లను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం లేని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైదులు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదనీ, వీరు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజెక్షన్లు, సెలైన్‌లు పెట్టరాదని, అల్లోపతి వైద్యం చేయరాదని, వారి దగ్గర మందులను నిల్వ ఉంచుకోరాదని తెలిపారు. ప్రయివేటు హాస్పిటల్స్, నర్సింగ్ హెూంలలో ఆయుష్ వైద్యులని డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా కానీ (లేదా) వైద్యం చేయడానికి కానీ నియమించుకోకూడదనీ, నియమించుకుంటే చట్టప్రకారం అలాంటి హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజీఈ టెస్టులో ఉతీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాతనే ప్రాక్టీస్ కానీ, హాస్పిటల్స్‌లో పని చేయటం కానీ చేసుకోవాలని తెలిపారు. చాలా మంది విదేశీ వైద్యులు ఎఫ్ఎంజీఈ పరీక్ష పాస్ కాకుండానే హాస్పిటల్స్‌లో పని చేస్తున్నారని, ప్రాక్టీస్ సైతం చేస్తున్నట్టు తమ దష్టికి వచ్చిందని తెలిపారు. తమ ప్రత్యేక బందాల తనిఖీల్లో వైద్యులు పాస్ కాకుండా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా పని చేస్తే ఆ హాస్పిటల్స్ యాజమాన్యంపై, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి క్లినిక్, పాలీ క్లినిక్, నర్సింగ్ హెూమ్, హాస్పిటల్స్, ఆయుష్ క్లినికల్, పాలీ క్లినిక్ హాస్పిటల్స్ వారు వారి వారి సెంటర్లలో వసూలు చేసే ఫీజుల వివరాలు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలనీ, పాతబస్తీలో అయితే ఉర్దూలో కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ప్రకారమే రోగుల నుంచి చార్జీలు వసూలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వారి, వారి ఇనిస్టిట్యూటల్‌లో పని చేసే వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నెంబర్లు, వారి వారి విద్యార్హతలు కూడా రిసెప్షన్ వద్ద ప్రదర్శించాలని సూచించారు. ప్రతి హాస్పిటల్, నర్సింగ్ హెూమ్ వారు నిర్ణయించుకున్న రేట్స్ (రాక్ రేట్లను) ప్రతి ఏడాదీ జూన్ మొదటి వారంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో సీజరిన్ రేట్ ఎక్కువగా ఉండటంతో తప్పనిసరిగా ఇండికేషన్ ఉన్న కేసులకు మాత్రమే సి-సెక్షన్ కాన్పులు చేయాలని, అనవసరంగా ఇండికేషన్ కాకుండా సి-సెక్షన్ కాన్పులు చేస్తే వైద్య అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు రాసి సదరు వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎంటీపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబంధనలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షంలో అబార్షన్ చేయాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబాషన్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా చేసిన అబార్షన్ల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా కార్యాలయంలో అందజేయాలని కోరారు. గైనకాలజిస్టు, ఈఆర్‌టీ, సరోజనీ లెవల్-2 రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్న వారు మాత్రమే ఐవీఎఫ్ సెంటర్లు నడుపుకోవడానికి అర్హులు అనీ, లెవల్-1, లెవల్-2 సర్టిఫికెట్స్ లేని వారు ఐవీఎఫ్ సెంటర్ అని పేరు పెట్టుకోరాదని సూచించారు. అలా పెట్టుకుంటే తమ ప్రత్యేక తనిఖీ బందాలు గుర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన జబ్బుల గురించి పేషెంట్లకు తప్పనిసరిగా వారికి అర్థమయ్యే భాషలో వివరించాలన్నారు. జబ్బుకు అయ్యే ఖర్చులను కూడా ముందుగానే వివరించాలని, రోగుల హక్కులు, బాధ్యతలు ప్రతి హాస్పిటల్‌లో తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. మలేరియా, డెంట్యూ, టీబీ, హెచ్ఐవీ వంటి వ్యాధులు సోకిన వారి వివరాలు ప్రతినెలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు తెలపాలని కోరారు. జిల్లాలో తనిఖీ బందాలు నిరంతరం క్లినిక్‌లు, హాస్పిల్స్‌ను తనిఖీ చేస్తుంటాయని చెప్పారు. తనిఖీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతుల సర్టిఫికెట్లు, సిబ్బంది వివరాలను, రేట్ల టేబుల్స్ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కదిర్వన్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.వెంకట్, ఐఎంఏ బ్రాంచ్ సెక్రెటరీ డాక్టర్ మిన్‌హాజ్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారులు, మాస్ మీడియా అధికారులు రాములు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఏకాగ్రతతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు



నవతెలంగాణ-ముషీరాబాద్

పట్టుదల ఏకాగ్రతతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చునని ఆల్ ఇండియా యుపిఎస్సి సిఎస్ఈ 2023 నందల సాయి కిరణ్ 27 ర్యాంకర్ తెలిపారు. యుపీఎస్సీలో సత్తా చాటిన పలువురితో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని విజన్ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నందల సాయి కిరణ్ హాజరై తన జీవితంలో ఎదుర్కొన్న సందర్భాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ తన అనుభవాలను వెల్లడించారు. 2018లో నిట్ వరంగల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత, క్వాల్ కామ్ లో చేరానన్నారు. పూర్తి సమయం ఉద్యోగం చేయాల్సి ఉన్నప్పటికీ, అతను 2022 ప్రయత్నాన్ని లక్ష్యంగా చేసుకుని జనవరి 2021లో యుపీఎస్సీ పరీక్షలకు సిద్ధం కావడం ప్రారంభించామని తెలిపారు. ప్రిలిమ్స్ తర్వాత మెయిన్స్ ప్రిపరేషన్‌కు కోసం సిద్ధమవుతూ జనరల్ స్టడీస్, సోషియాలజీ కోసం విజన్ ఐఏఎస్ యొక్క పూర్తి-నిడివి టెస్ట్‌లలో చేరి అభ్యసించానన్నారు. తుది ఎంపిక జాబితాలో మొదటి పేజీలో పేరు రావడంతో ప్రయత్నాలు ఫలించాయని తెలిపారు.

వరల్డ్ హైపర్‌టెన్షన్ డే టీఎక్స్ ఆస్పత్రి త్రీకే వాక్‌థాన్



నవతెలంగాణ-అంబర్‌పేట:

వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా టీఎక్స్ ఆసుపత్రులు హైపర్‌టెన్షన్ పై అవగాహన పెంచేందుకు త్రీకే వాక్‌థాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కార్డియాలజీ బృందం, డాక్టర్ సరత్ చంద్ర, డాక్టర్ సుమీత్ సిన్హా, డాక్టర్ దీపక్ సహా, డాక్టర్ జె. శశి, డాక్టర్ ప్రుధ్వి,డాక్టర్ అవినాష్ దాల్, డాక్టర్ సోహైల్ సయ్యద్ , డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రాముఖ్యతను, రక్తపోటు సంబంధిత, దాని అనారోగ్యం గురించి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. డైరెక్టర్లు డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజు, రవీంద్ర రామిరెడ్డి, అలాగే మేనేజ్‌మెంట్ సభ్యులు నవ్య , శ్రీకాంత్ వొడ్నాల, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, దాని సజావుగా సాగడానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అనాథలను ఆదుకోవాలి

- పీ.ఎస్.జీ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరు అనాథలకు తమ వంతు సాయం చేసి ఆదుకోవాలని పీ.ఎస్.జీ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు కోరారు. పీ.ఎస్.జీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పులి స్వరూప గౌడ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ముషీరాబాద్‌లోని అనాథ ఆశ్రమంలో చిన్నారులకు ప్లేట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పీ.ఎస్.జీ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు పులి సందీప్ గౌడ్ మాట్లాడుతూ పులి స్వరూప గౌడ్ పేదల అభ్యున్నతి కోసం అనాథలకు తమ వంతు ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. అటువంటి స్వరూప గౌడ్ రెండవ వర్ధంతి చిన్నారుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పేద కుటుంబానికి చెందిన అమ్మాయిలకు పీ.ఎస్.జీ ట్రస్ట్ ద్వారా పుస్తే, మెట్టెలు అందజేస్తామని ఎవరైనా పేద కుటుంబీకులు ఉంటే మా ట్రస్టినీ సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీశైలం గౌడ్, పులి ప్రదీప్ గౌడ్, పులి సందీప్ గౌడ్, పులి రేఖ గౌడ్, పులి సన్విక గౌడ్ ,పులి ప్రవళిక గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర భవిష్యత్తు తరాలకు అందించాలి

- ట్యాంక్ బాండ్‌పై వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహెూత్సవాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి చరిత్ర భవిష్యత్తు తరాలకు అందించాలని విశ్వ బ్రాహ్మణ మను మాయ సంఘం నాయకులు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ విశ్వబ్రాహ్మణ మనుమాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్ బాండ్‌పై పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద స్వామివారి 331 ఆరాధన మహెూత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధన మహెూత్సవాలకు విశ్వబ్రాహ్మణ మనుమాయ సంఘం అధ్యక్షులు అశోక్ చారి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారి ఘనతను నేటి తరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మనుమాయ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కోశాధికారి వండ్ల బ్రహ్మం , వండ్ల మల్లేష్ చారి శ్రీధర్ చారి, వెంకటేష్ చారి, బ్రహ్మచారి ,సాయిలు, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో పెన్ను గన్ను పట్టిన బండి యాదగిరి



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి అని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, సిరికొండమధుసూదనాచారి అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనా చారి మాట్లాడుతూ 'బండెనక బండి కట్టి పదహారుబండ్లు కటి' పాటను రాసి దొరల గుండెల్లో గుబులు లేపారని, ప్రజల హృదయాల్లో ఆ పాట చిరస్మరణీయంగా నిలిచి ఉందన్నారు. అప్పటి నుంచి బండి యాదగిరి పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పాటలతో ప్రజానీకాన్ని ఉత్తేజితం చేసిన యాదగిరి గన్నుపట్టి పోరాటంలో పాల్గొన్న యోధుడని కొనియాడారు. బండి యాదగిరి వంటి త్యాగ ధనుల వల్లనే నేడు తెలంగాణ విముక్తి చెందింద న్నారు. ఆయనచరిత్ర నేటి యువతకు స్ఫూర్తిని వ్వాలన్నారు. సాయుధ పోరాటంలో అద్భుతంగా పాత్రధారి బండి యాదగిరి అని అన్నారు. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు వంటి కవులు, కళాకారులు తమ కలాలు, గళాల, కళారూపాల ద్వారా సాయుధ పోరాటంలో మద్దతు కూడగట్టడంలో విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, ప్రముఖ గాయకుడు శ్రీధరం రామ సుబ్రహ్మణ్యం, గాయనీ గరిమెళ్ళ సీత తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైల్‌లో సెల్ ఫోన్ దొంగతనం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎంఎంటిఎస్ రైల్‌లో సెల్ ఫోన్‌ను దొంగలించి పారిపోయిన వ్యక్తిని నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్ స్పెక్టర్ బి. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..చందన్ నాయక్(23) హైటెక్ సిటీ లింగంపల్లి వెళ్లేందుకు ఎంఎంటీఎస్ రైలు ఎక్కి ఎంట్రెన్స్ వద్ద నిలబడ్డాడు. సయ్యద్ ఇర్ఫాన్ (21) రైలు కదులుతుండగా రైలు ఎక్కాడు. ఈ క్రమంలో అతడు చందన్ జేబులో చెయ్యి పెట్టి మొబైల్‌ను దొంగలించి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్ట్ నేలంటి మధును ప్రజా ఏక్తా పార్టీ రాజకీయ వ్యూహకర్తగా నియమించామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త తెలిపారు.
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలి

- కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ శేరిలింగంపల్లి జోన్ లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బయోడైవర్సిటీ, క్యూ మార్ట్, డీఎల్ఎఫ్ ప్రాంతాలను సందర్శించి వరద నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ బయోడైవర్సిటీ వద్ద గతంలో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ కంటే ప్రతిపాదిత బాక్స్ డ్రెన్ నిర్మాణం పెద్దగా చేపట్టి వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ మార్ట్ వద్ద నీరు పోయేందుకు అదనంగా గ్రిల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎల్ఎఫ్ రోడ్డులో ఉన్న డ్రెన్ ను ఎప్పటిక ప్పుడు క్లీన్ చేయాలని అక్రమ భవన నిర్మాణాలు కూల్చి వేయాలని ఎస్‌డబ్ల్యూడీసీసీని ఆదేశించారు. కమిషనర్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఎస్.డబ్ల్యూ.డి డిప్యూటీ కమిషనర్ వేణు గోపాల్ రెడ్డి, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సారూ.. స్పందించండి..

- అన్ని అనుమతులున్నా ట్రాఫిక్ అనుమతి లేదంటూ 30 రోజులుగా ఎగ్జిబిషన్‌కు అనుమతి నిరాకరణ
- ఎగ్జిబిషన్ ఓపెన్ కాకపోవడంతో 200 కుటుంబాలు దిక్కుతోచని స్థితి
- సమ్మర్ 'ఉత్సవ్ మేళా నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎగ్జిబిషన్‌కు అను మతిని ఇవ్వాలని సమ్మర్ ఉత్సత్ మేళా నిర్వాహకులు మీర్జా రఫీక్ బేగ్ కోరారు. శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పర్యాటక ప్రాంతంగా ఎంతో గుర్తింపు సాధించిన హైదరాబాద్ మహా నగరానికి మరింత వన్నె తెచ్చే విధంగా సాగర శీరంలో, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న హెచ్ఎండీఏ మైదానంలో వేసవిలో నగరవాసులను అలరించేందుకు కాశ్మీర్ అందాలను వరిచయం చేస్తూ ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా ఎగ్జిబిషన్‌కు అన్ని శాఖల అనుమతులు ఇచ్చినా, ట్రాఫిక్ పోలీసులు అనుమతి నిరాకరించడంతో 30 రోజులు పూర్తవుతున్నా ఎగ్జిబిషన్ ప్రారంభం కాలేదన్నారు. ఇది వీఐపీ జోన్ అని, ఇక్కడి నుంచి సీఎం రాక పోకలు సాగిస్తారని, ఇలాంటి ప్లేస్‌లో ఎలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారంటూ అనుమతి నిరాకరించారని తెలిపారు. రూ.లక్షలు హెచ్ఎండీఏకు చెల్లించి, జీహెచ్ఎంసీ, ఫైర్, లా అండ్ ఆర్డర్, ఆర్అండ్‌బీ శాఖల నుంచి అనుమతులు ఇచ్చినా ట్రాఫిక్ నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో నెల రోజులుగా ఎగ్జిబిషన్ లో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటుచేసుకుని నానా ఇబ్బందులు వడుతున్నారని తెలిపారు.

వారు తెచ్చుకున్న స్టాక్ సేల్స్ కాక, రోజు పూట తిండి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ముందుగా గ్రౌండ్ అనుమతి కోరుతూ హెచ్ఎండీఏకు 60 రోజులకు గాను డబ్బులు చెల్లించి, ఆపై ఎగ్జిబిషన్ తయారీ పనులు పూర్తిచేసి లా అండ్ ఆర్డర్, ఫైర్, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అనుమతులతో పాటు ట్రాఫిక్ పోలీసుల అనుమతి తీసుకోవాలని, అయితే సెంట్రల్ జోన్ పరిధిలోని ఖైరతాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వరిధిలోకి వచ్చే ఈ ఎగ్జిబిషన్ అనుమతిని ట్రాఫిక్ ఉన్నతాధికారులు నిరాకరించడంతోపాటు ఇది వీఐపీ జోన్ అని, ముఖ్యమంత్రి రూట్ అని చెప్పి కాలయాపన చేయడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయని చెప్పారని తెలిపారు. ఎన్నికల తర్వాత అనుమతి ఇస్తామన్న అధికారులు ఎన్నికలు పూర్తయినా ఇప్పటికి ఎగ్జిబిషన్‌కు అనుమతివ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి రూట్ సమయంలో ప్రయివేటు సెక్యూరిటీతో బందోబస్తు ఏర్పాటు చేసుకుంటామని వినతిపత్రం రాసి ఇచ్చినా అనుమతివ్వడం లేదన్నారు. దాంతో 200 మంది కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. ఎగ్జిబిషన్‌లో 40శాతం వర్కింగ్ ఉండాలని చెప్పడంతో 40శాతం పార్కింగ్ ఇచ్చామని, అదే పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు 40శాతం పార్కింగ్ లేకున్నా ట్రాఫిక్ అనుమతి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఐమాక్స్ వక్కన ఉన్న హెచ్ఎండీఏ స్థలం వీఐపీ జోన్ అంటున్నారని, ఇక్కడ ఉన్న ఐమాక్స్, ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్క్ ఇవన్నీ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్ కిందకే వస్తాయి కదా అన్నారు. ఇదే గ్రౌండ్‌లో గతంలో కూడా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. అప్పుడు లేని ఇబ్బందులు, ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. వీఐపీ జోన్ అయితే హెచ్ఎండీఏ గ్రౌండ్ అనుమతి కోసం రూ.లక్షల్లో రెంట్ రూపంలో డబ్బులు ఏవిధంగా తీసుకున్నారని ప్రశ్నించారు. 60 రోజుల అనుమతి కోరుతూ మేం తీసుకున్న అనుమతిలో ఇప్పటికే 30 రోజులు వృథాగా పోయాయని, ఇప్పుడు మా వరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి వందల మంది కుటుంబాలు ఆధారపడిన ఎగ్జిబిషన్‌ను కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు గడువు పొడిగించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సమ్మర్ ఉత్సవ్ మేళా స్టాల్ హెూల్డర్లు, బాధితులు పాల్గొన్నారు.

దాదాపూర్ గ్రామపంచాయతీకి జాతీయ అవార్డు

నవతెలంగాణ-దోమ

2023-24సంవత్సరానికి మండల పరిధిలోని దాదాపూర్ గ్రామపం చాయతీ నేషనల్ పంచాయతీ అవార్డుకు సెలక్షన్ నిమిత్తం ప్రతిపాదనలు పంపించారు. ఆ పనులు ఫామ్ పాండ్, ఫిష్ పాండ్, ఎంఐ ట్యాంక్స్, క మ్యూనిటీ సోక్ పిట్స్, మాజిక్ సోక్ పిట్, హరితహారం ప్లాంట్స్ పార్కు లేషన్ థాంక్స్ నర్సరీ పల్లె ప్రకృతి వనలు పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీ సత్య కుమార్ సైంటిస్ట్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా శృతి, సైంటిస్ట్ సర్వేస్ డిపార్ట్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండి యా జయసుధ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ హెచ్.మహేష్ బాబు, ఎంపీఓ సోమలింగం, ఏపీడీ సరళ కుమారి, ఏపీఓ దస్తయ్య, పంచాయతీ కార్యదర్శిలు రవీందర్ రెడ్డి, వినోద్, రాజేష్, వెంకట్ నర్సింలు, మోహన్, సంతోష, అన్నపూర్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు నా రాయణరెడ్డి, బాలయ్య శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్లు మొగులయ్య అంబ య్య గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకిన యువకుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ- సిటీబ్యూరో

ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి పోయిన యువకుని మృతదేహం ఎట్టకేలకు లభ్యమ యింది. 24 గంటల ఉత్కంఠకు తెర పడింది. మాడ్గుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం...మండలంలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన బై కని కొమరయ్య (32) ఈనెల 16న మధ్యాహ్న సమయంలో పక్క గ్రామం కొలుకులపల్లి గ్రామ సమీ పంలోని ఈదమ్మ బావి వద్దకు ఈత కోసం వెళ్లాడు. బావిలో దూకుతున్న సమయంలో ప్రమాదవశాత్తు బావి లో మునిగిపోయాడు. దూకిన ఎంతసేపటికి పైకి రాకపో వడంతో అదే బావిలో ఈత కొడుతున్న కొందరు వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు.ఈ మే రకు విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఫైర్ ఆఫీ సర్, వారి సిబ్బంది సాయంతో గురువారం మధ్యాహ్నం నుండి గాలింపు చర్యలు చేపట్టారు. చర్యల్లో భాగంగా బావి నుండి నీటిని మొత్తాన్ని బయటకు తొలగించి శుక్రవారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశా రు. ఈ మేరకు మృతుని భార్య అలివేలు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యు లకు అప్పజెప్పారు .

చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలి



- నాగారం మున్సిపల్ కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 20వ వార్డులోని దాయరా కుంట చెరువులో గుర్రపు డెక్క పెరగడంతో దుర్గంధమైన వాసన వస్తుందని, వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్‌కు కాంగ్రెస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దాయరాకుంట సమీపంలోని 18,19 ,20 వార్డుల్లోని దత్తాత్రేయ కాలనీ, శివశక్తి కాలనీ, బీఎంఆర్ కాలనీ, గోపికృష్ణ కాలనీ, అరవిందనగర్ కాలనీ, మనీ ఎన్‌క్లేవ్ వార్డులోని కాలనీ వాసులు మలేరియా, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులకు గురువుతున్నారని పేర్కొన్నారు. కుంటలో చెత్త వేయటంతో దుర్వాసన వస్తుందన్నారు. వైస్ చైర్మెన్ బండారు మల్లేశ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్రా సురేష్ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో గుర్రపు డెక్క తొలగింపుపై తీర్మానం చేసి ఐదు నెలలుగా గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే దాయరకుంటలోని గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్రా సురేష్ , సుర్వి శ్రీనివాస్ గౌడ్, పంగ హరిబాబు పాల్గొన్నారు.

పెట్రోలియం ఉత్పత్తులను భద్రపరచుటకు ప్రజాభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల శివారులోని సర్వే నంబర్ 480లో సాయి ఇండస్ట్రీస్ కంపెనీకి చెందిన పెట్రోలియం ఉత్పత్తులను భద్రపరచుటకు ప్రజాభిప్రా య సేకరణను చేపడుతున్నట్లుగా మున్సిపల్ కమిషనర్ రాములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇట్టి స్థలంలో క్లాసి ఫార్నస్ ఆయిల్ 50 కే.ఎల్ మూడు కంటైనర్ల చొప్పున మొత్తం 150 కే.ఎల్, లైట్ డీజిల్ ఆయిల్, ఫార్మస్ అయిల్ 400 కే.ఎల్ పెట్రోలియం ఉత్పత్తులను నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు తెలపాలని కోరారు.

పనులను సకాలంలో పూర్తి చేయాలి



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని సాయిరాం నగర్, గణేష్ నగర్ కాలనీలో సీవరేజ్ పైప్ లైన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. శుక్రవారం పైపులైన్ పనులను వాటర్ బోర్డు అధికా రులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కారణంగా ఆలస్యమైన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు దగ్గరుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, అశోక్ రెడ్డి, మల్లారెడ్డి, నరసింహ, యాదయ్య, బుచ్చిరెడ్డి, జగదీష్, సుధాకర్‌రెడ్డి, ఇందిరా, పుష్ప, పద్మ ,రమ్య ఉన్నారు.

ఆదాయం కోసం అడ్డగోలుగా రేట్లు పెంచుతారా?

- సర్కారు వైఖరిని తప్పుబట్టిన రియాల్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-బోడుప్పల్

సర్కారు ఆదాయం పెంచుకోవడం కోసం రిజిస్ట్రే షన్ ఛార్జీలు పెంచితే పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసినట్లేనని తెలంగాణ రియాల్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడం కోసం పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తుందన్నారు. భూముల మార్కెట్ విలువకు క్రయ, విక్రయ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, వాస్తవంగా మార్కెట్ విలువ రెట్టింపు చేసి స్టాంపు డ్యూటీ ప్రస్తుతం ఉన్న 7.5 శాతం దానిని 3శాతానికి తగ్గించాలని కోరారు. దీని వలన కొనుగోలు దారులకు, అమ్మకం దారులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కేవలం మార్కెట్ విలువ పెంచి స్టాంపు డ్యూటీ 7.5శాతం ఉంచితే రిజిస్ట్రేషన్ ఛార్జీలు కొనుగోలు దారులకు భారం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఛార్జీలతో పాటు ఎల్‌ఆర్ఎస్ ఛార్జీలను కలుపుకుంటే లక్షల్లో చెల్లించాల్సి వస్తోందన్నారు. మార్కెట్ విలువ పెంచినా ఎల్‌ఆర్ఎస్ ఛార్జీలు పెరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ విలువకు ఎల్‌ఆర్ఎస్‌కు లింకు ఉంటుందని, మార్కెట్ విలువపైనే ఎల్‌ఆర్ఎస్ ఛార్జీలు వసూల్ చేస్తారన్నారు. తెలంగాణలో 142 సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లు ఉంటే అందులో 100కు పైగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లు అద్దె భవనాల్లోనే ఉన్నాయని తెలిపారు. మంచినీటి సౌకర్యం, కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోను లేవని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు సొంత భవనాలు కట్టాలనే నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అన్నారు.

బోడుప్పల్ మేయర్ పీఠం హస్తగతమేనా?

- పాలకవర్గం ఏర్పాటుకు కాంగ్రెస్‌కు బలం
- అవిశ్వాసంపై కలెక్టర్‌కు నోటీసు అందజేత
- పంతం నెగ్గించుకోనున్న వజ్రేష్



శుక్రవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసు ఇచ్చిన అనంతరం మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలతో కార్పొరేటర్లు

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి షాక్ మీద షాక్ తగులుతోంది. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠం గులాబీ చెయ్యి జారింది. బోడుప్పల్‌లో మెజార్టీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరడంతో మేయర్ పీఠం హస్తగతం కానుంది. శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్‌కు చెందిన 21 మంది కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం నోటీసును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

నాడు ఉనికి కోసం పాట్లు..

2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బోడుప్పల్ కార్పొరేషన్ ఎన్నికలలో 28 డివిజన్లకుగాను 14 డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థుల సహకారంతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థి దానగళ్ల అనీత సైతం బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరడంతో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య 20కి చేరింది.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో మారిన సీన్..

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు ఆరు మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా మేడ్చల్ అసెంబ్లీ స్థానం కోల్పోయింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా మారడంతో సుమారు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బోడుప్పల్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి మార్గం సులువైంది.

పట్టు కోసం వజ్రేష్ యాదవ్..

అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన మల్లారెడ్డిని గడగడలాడించిన కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తన పట్టు నిలుపుకోవడం కోసం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కోటలను ఒక్కొక్కటిగా బద్దలు కొడుతున్నారు. బోడుప్పల్‌లో స్థానికుడైన వజ్రేష్ యాదవ్ బోడుప్పల్ నుంచే మల్లారెడ్డి పతనాన్ని మొదలు పెట్టాలనే సంకల్పంతో బీఆర్ఎస్ మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకోవడం కోసం శతవిధాలుగా ప్రయత్నాలు మొదలు పెట్టి చివరకు విజయం సాధించాడు.

శుక్రవారం కలెక్టర్‌కు నోటీసు..

21 మంది కార్పొరేటర్లతో కూడిన బృందం వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యం లో శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు కలెక్టర్ కార్యాలయంలో బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం కోసం నోటీసును అందజేశారు.

నూతన మేయర్‌గా అజయ్ యాదవ్!

బోడుప్పల్ రెండో మేయర్‌గా 6వ డివిజన్ కార్పొరేట ర్ తోటకూర అజయ్ యాదవ్ ఎన్నిక లాంఛనమే అనిపి స్తోంది. ఒక వైపు తండ్రి మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కావడం, మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండదం డలు పుష్కలంగా ఉండడంతో అజయ్ యాదవ్ మేయర్ అవుతారని చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ కోసం పలువురు పోటీ పడుతున్నా 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఎన్నిక లాంఛనమే అని తెలుస్తోంది.

పంతం నెగ్గించుకున్న వజ్రేష్ యాదవ్...

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన వజ్రేష్ యాదవ్ ప్రస్తుతం మల్లారెడ్డిని వరుస దెబ్బ మీద దెబ్బ కొడుతున్నారు. నియోజకవర్గంలోని ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం, జవహర్ నగర్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టించి నూతన మేయర్‌ను ఎన్నుకోవడం, మిగతా మున్సిపాల్టీలో కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్ కోసం పావులు కదపడం, పీర్జాదిగూడ మేయర్‌ను దించే విషయంపై నియోజకవర్గ బాధ్యుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్ పూర్తి స్థాయిలో కసిమీద పని చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన పరాభావానికి కసి తీర్చుకోవడానికి మల్లారెడ్డిని దెబ్బ కొట్టే వ్యూహ రచనలలో వజ్రేష్ యాదవ్ ఉన్నట్లు తెలుస్తుంది.

కాలజ్ఞానం రచించిన మేధావి
పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి



- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, కార్పొరేటర్ వేణు

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆధునిక టెక్నాలజీ లేని కాలంలో కాలజ్ఞానాన్ని రచించిన అపర మేధావి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ కొనియాడారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ చంద్రపురి కాలనీలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కుల, మత, వర్గ భేదాలు లేవని మనుషులంతా ఒక్కటేనని, మూఢనమ్మకాలను, స్త్రీలపై జరుగుతున్న వివక్షతను ఖండిస్తూ బ్రహ్మంగారు ఆనాడే కాలజ్ఞానంలో వివరించారని గుర్తు చేశారు. ఆయన చాలా ముందు చూపుతో కాలజ్ఞానం రాశాడని, కాలజ్ఞానంలో చెప్పినవన్నీ నిజం అవుతున్నాయని అన్నారు. ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని, వారి మాటలను నమ్మకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ వారు నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ వెంకటాచారి, ప్రెసిడెంట్ నాగేష్ చారి, సభ్యులు రమేష్‌చారి, ఆంజనేయులు, నరేందర్, దేవేందర్, మూర్తి, శంకరాచారి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పీర్జాదిగూడ, పర్వతాపూర్..
రోడ్డు విస్తరణపై కాంగ్రెస్ సవితి తల్లి ప్రేమ

- బీఆర్ఎస్ హయాంలో రూ.26 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- కాంగ్రెస్ హయాంలో నిధులు నిల్
- ప్రభుత్వ అలసత్వంతోనే ఇబ్బందులు
- బీఆర్ఎస్ పీర్జాదిగూడ అధ్యక్షులు రవీందర్



నవతెలంగాణ-బోడుప్పల్

కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల కేటాయింపులో అలసత్వం వల్లే హెచ్ఎండీఏ నిధులు రూ.26 కోట్లతో చేపట్టిన పీర్జాదిగూడ, పర్వతాపూర్ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు ఆలస్యం అవుతున్నాయని పీర్జాదిగూడ బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి రవీందర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో పెరిగిన జనాభా, వాహనదారులకు మెరుగైన రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టాలనే సంకల్పంతో మేయర్ జక్క వెంకట్ రెడ్డి నేతృత్వంలోని పాలకమండలి రోడ్డు విస్తరణ ఆవశ్యకతను నాటి మాజీ మంత్రి కేటీఆర్‌కు వివరించారు. కేటీఆర్ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు హెచ్ఎండీఏ ద్వారా సుమారు రూ.26.32 కోట్లను మంజూరు చేసి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాన చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పనులు చకచక మొదలయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పీర్జాదిగూడ, పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడిందని, దీనికి ప్రధాన కారణం పనులకు అవసరమైన నిధులను విడుదల చేయకపోవడమేనని ఆరోపించారు. ప్రభుత్వ అలసత్వంతో వాహనదారులకు ఇక్కట్లు పడుతుంటే స్థానిక కాంగ్రెస్ నాయకులు నిధులు విడుదలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సింది పోయి అధికారులపై ఒత్తిడి తేవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

రోడ్డు విస్తరణ వేగవంతంపై పాలకమండలి దృష్టి

పీర్జాదిగూడ కమాన్ - పర్వతాపూర్ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసే విషయంలో పాలక మండలి కట్టుబడి ఉందని, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని, ప్రభుత్వం కూడా రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు త్వరగా విడుదల చేసి పెండింగ్ పనులను పూర్తి చేయాలని పీర్జాదిగూడ బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి రవీందర్ డిమాండ్ చేశారు. రోడ్డు పనులు పూర్తి అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ఆక్రమణలు కూల్చేసిన అధికారులు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఇందిరాగాంధీ విగ్రహం, కనాజీగూడలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను, వ్యాపార దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. పాదాచారులు వెళ్లే రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై, రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్న వారిపైన మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. పాదాచారులు, వాహనదారులు స్వేచ్ఛగా రాకపోకలకు సాగించేందుకు అధికారులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డు ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించారు. దీంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గి నగరంలో రాకపోకలు సాఫీగా సాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌కు ప్రజల సహకరించాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, శ్రవణ్, అప్సర్, సాయి, రవళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అరుంధతి హాస్పిటల్‌లో అరుదైన చికిత్స



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని అరుంధతి హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బాపట్లకు చెందిన 22 ఏండ్ల బెస్సీడిబోరాకు హృదయ స్పందన ఉండాల్సిన దాని కంటే మూడు రెట్లు అధికంగా (వేగంగా) కొట్టుకోవడం అనే సమస్యతో అరుంధతి హాస్పిటల్‌కు వచ్చారు. పరీక్షించిన కార్డియాలజీ వైద్య బృందం డాక్టర్ హర్ష వర్ధన్‌రెడ్డి నేతృత్వంలో గుండె వేగాన్ని తగ్గించే ప్రక్రియను (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ) ఉపయోగించి విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా పేషెంట్ మాట్లాడుతూ.. తాము ఈ చికిత్స కోసం పలు హాస్పిటల్స్‌కు వెళ్లడంతో చికిత్స ఆలస్యం చేశారనీ, అంతేకాకుండా రూ.2లక్షలు ఖర్చు కూడా అయిందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో అరుంధతి హాస్పిటల్‌ను ఆశ్రయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు హాస్పిటల్ ఫౌండర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య బృందాన్ని మర్రి లక్ష్మణ్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి డైరెక్టర్ ధీరణ్‌రెడ్డి, డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

మా అమ్మ పేరుతో హాస్పిటల్‌ను స్థాపించాను

-హాస్పిటల్ ఫౌండర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



'అరుంధతి' హాస్పిటల్‌ను మా అమ్మ పేరుతో స్థాపించాను. ఆమె కోరిక మేరకు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అధునాతన వైద్య సహాయం పూర్తి ఉచితంగా అందిస్తున్నాం. వైద్యం సహాయం పొందిన వారి కండ్లల్లో ఆనందాన్ని చూస్తే అంతులేని సంతృప్తి కలుగుతుంది.

టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శిగా ముజీబ్‌ను నియమించాలి

- జిల్లా కార్యవర్గంతో పాటు 45 యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శుల ప్రతిపాదన
- ఉద్యోగులకు ఒక్క గ్యారెంటీ పథకం ఇవ్వాలి డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 22న జరిగే కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశంలో 'కార్యదర్శి'గా డాక్టర్ ముజీబ్‌ని నియమించాలని హైదరాబాద్ జిల్లా కార్యవర్గంతో పాటు పలు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు ప్రతిపాదించారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సభ్యులు, 45 యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తూ.. మరణించిన ఉద్యోగుల ఆత్మశాంతి కోసం ఒక నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న డీఏ, 2023 పీఆర్సీ, హెల్త్ కార్డ్, పెండింగ్ మెడికల్ రీయంబర్స్‌మెంట్, జీపీఎఫ్, సరెండర్ లీవ్ బిల్లులతో పాటు ఇతర ఉద్యోగుల ముఖ్యంశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల మాదిరిగా ఉద్యోగులకు ఒక్క గ్యారెంటీ పథకం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, హరిబాబు, వైదిక్ శాస్త్ర, బోలిగిద్ద శంకర్, గీత సింగ్, ముహమ్మద్ వహీద్, మాజీ సభ్యులు ప్రభాకర్, జానకి పాల్గొన్నారు.

ఉబెర్ ఈట్స్‌కు ఉబెర్ టెక్ బృందం తోడ్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ వ్యాపారులను అధిగమించి మైలురాయిని ఉబెర్ జరుపుకుంటున్న వేళ, ఈ విజయాన్ని సాధ్యం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారతదేశంలో ఉన్న దాని ఇంజినీరింగ్ టీం సంతోషిస్తుంది. ఈ సందర్భంగా ఉబర్ ఇంజినీరింగ్ డైరెక్టర్ అండ్ ఈట్స్ ఇంజినీరింగ్ హెడ్ జైతీర్థ్ పట్వారీ మాట్లాడుతూ 'మా ఈ విజయంలో అంతర్భాగమైన వ్యాపారులను సానుకూలంగా ప్రభావితం చేయడానికి మేం చేస్తున్న ప్రయత్నాల పట్ల మేం గర్విస్తున్నాం. దేశంలోని అత్యంత ప్రతిభావంతులైన సాంకేతిక బృందాలు ఫుడ్ డెలివరీ భవిష్యత్‌ను పునర్నిర్వచించడంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, కస్టమర్ల జీవితాలను మెరుగు పరుస్తూనే ఉన్నాం' అని తెలిపారు.



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్ రావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు, జిడిపల్లి రాజేశ్వర్రావు, నాయినేని తులసీరావు, రవిరాజు, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డిలు దర్శించుకున్నారు. అనంతరం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం ఉదయం పుర అభిషేక దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్ రావులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

లెక్క లేదంటే.. వేటే..!

- ఎన్నికల ప్రచార వ్యయం వివరాలు సమర్పించాల్సిందే
- వ్యయ పరిశీలనకు ప్రత్యేక అధికారులు
- నెల రోజుల్లోగా అందజేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. మల్కాజిగిరి నుంచి 22 మంది బరిలో నిలిచారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రచారమూ ప్రభావితం చేస్తుంది. ఆ ప్రచార వ్యయం కూడా పెరుగుతూ వస్తోంది. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సభలకు జనాలను తరలించే వాహనాలు, భోజనాలు, టెంట్లు ఇలా ప్రతిదానికీ అభ్యర్థులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వీటన్నింటికీ ఎన్నికల సంఘం స్థానికంగా ధరలను అనుసరించి చెల్లింపులను నిర్దేశించింది. ఆ మేరకు వ్యయ వివరాలను అభ్యర్థులు నమోదు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులో ఖాతా తెరిచి దాని ద్వారానే చెల్లింపులు చేయాలి. అభ్యర్థులు ప్రచార వ్యయానికి సంబంధించి ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికలు పూర్తయిన తర్వాత నెల రోజుల్లోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలి. లేనిపక్షంలో ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది.

వ్యయ పరిశీలకులు వీరే..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా మనోజ్ అలోయిస్ లక్రా, ధృవ్ భోలా ఉన్నారు. వీరు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార వ్యయాలను పరిశీలిస్తారు.

వ్యయం పెంపు ఇలా..

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయ పరిమితి 1952లో రూ.25 వేలుగా ఉండేది. 1971లో రూ.35వేలు ఉండగా.. 1980లో రూ.లక్షకు పెరిగింది. 1984 నుంచి 1991 వరకు రూ.1.50 లక్షలు, 1996లో రూ.4.50 లక్షలకు చేరింది. 1998లో రూ.15 లక్షలు, 2004లో రూ.25 లక్షలకు పెరుగుతూ వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచార వ్యయ పరిమితిపై ప్రధాన సవరణ జరిగి రూ.70 లక్షలకు పెంచారు. దీనిపై 2020లో 10శాతం పెరిగింది. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు 2022లో ప్రచార వ్యయ పరిమితిని రూ.95 లక్షలకు పెంచారు. దాంతో లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షల వరకు ప్రచారానికి ఖర్చు చేసే అవకాశం ఉంది.

107 మంది పోటీకి అనర్హులు

రాష్ట్రంలోని 107 మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన వివరాలు సమర్పించకపోవడంతో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 10ఏ ప్రకారం అనర్హత వేటు వేసింది. వీరిలో అత్యధికంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన 68 మంది ఉన్నారు. అప్పట్లో పసుపు రైతులు భారీ సంఖ్యలో నామినేషన్ వేసిన వారే కావడం గమనార్హం. వచ్చే జూన్ 23వ తేదీ వరకు వీరు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గంలోని 2, మహబూబాబాద్, మెదక్‌లో ఒక్కొక్కరు ఉండగా.. వీరిపై జూన్ 10వ తేదీ వరకు వేటు కొన సాగుతుంది. జుక్కల్, రామగుండం, కరీంనగర్, గజ్వేల్, మల్కాజిగిరి, నాగార్జునసాగర్, ఆలేరు, జనగాం, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరు, దేవరకొండ 5, మిర్యాలగూడ, పాలకుర్తి ముగ్గురు చొప్పున, నల్గొండ, ములుగు 4 చొప్పున, నకిరేకల్ 2, మల్కాజిగిరి ఒకరిపై జూలై 14వ తేదీ వరకు వేటు వేసింది. పాలకుర్తిలో ముగ్గురిపై ఆగస్టు 25వ తేదీ వరకు, డోర్నకల్ ఒకరిపై సెప్టెంబర్ 21వ తేదీ వరకు అనర్హత వేటు పడింది.

విద్యుద్ఘాతంతో బాలుడు మృతి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఇంట్లోకి వచ్చిన వరద నీటిని తోడే ప్రయత్నం చేస్తుండగా బాలుడికి విద్యుత్ షాక్ తగిలడంతో, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్ పల్లి సి.ఐ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని, ఇందిరానగర్‌లో నివాసం ఉంటూ.. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న మహ్మద్ పాషా, నజీమాబేగం దంపతుల, మూడో కుమారుడు షాదుల్లా ఇమ్రాన్(10) గచ్చిబౌలిలోని షాహబ్ గుల్షన్ ఉర్దూ పాఠశాలకు చెందిన వసతిగృహంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇటీవలే తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసుకునేందుకు షాదుల్లా గురువారం ఇంటి వద్దనే ఉన్నాడు. ఆ రోజు సాయంత్రం కురిసిన వర్షానికి ఇంట్లోకి వరద నీరు చేరడంతో, మంచంపై లేవలేని స్థితిలో ఉన్న తల్లికి సాయంచేసేందుకు విద్యుత్ మోటార్‌తో నీటిని తోడే ప్రయత్నం చేస్తుండగా... మోటారు యొక్క విద్యుత్తు తీగలను కరెంట్ ప్లగ్‌లో పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. స్థానికుల సమాచారంతో.. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ నవీన్, పైలెట్ కవిరాజు సీపీఆర్ చేసి, సమీ పంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స జరుగుతుండగా బాలుడు శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కూకట్‌పల్లి సి.ఐ కృష్ణ మోహన్ తెలిపారు.

కెమికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలి





నవతెలంగాణ-దుండిగల్

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న కెమికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలని. దుండిగల్ స్థానిక తండా కార్పొరేటర్ శంకర్ నాయక్ కోరారు. గురువారం రాత్రి విషపూరితమైన కెమికల్స్ వ్యర్థ పదార్థాలను ట్యాంకర్ల ద్వారా తీసుకువచ్చి చిన్న కుంటల్లో వేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కార్పొరేటర్ శుక్రవారం వాటిని పరిశీలించారు. విషపూరితమైన కెమికల్స్ వ్యర్థ పదార్థా లను రాత్రికి రాత్రి ట్యాంకర్ల ద్వారా తీసుకు వచ్చి కలుషితం వరుస్తున్న కెమికల్స్ మాఫియా దారులను అడ్డుకట్ట వేయాలన్నారు. చట్ట ప్రకారం వారిని శిక్షించాలని కార్పొరేటర్ అన్నారు. గత కొన్ని సంవత్సరాల కాలంగా తండాలో రామ్‌కి సంస్థ నిర్వహిస్తున్న విషపూరిత కాలుష్య వాయువుతో ప్రజలు, మూగజీవాలకు శాపంగా మారింది. ఇప్పటికే అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న ప్రజలకు అది చాలదన్నట్లు కెమికల్స్ మాఫియా దారులు విషపూరిత కెమికల్స్‌ను రాత్రికి రాత్రి తీసుకువచ్చి కుంటలలో, చెరువులలో పడవేసి వెళుతున్నారని.. ప్రజలకు అదేవిధంగా నిత్యం మూగ జీవాలు తాగే నీరు కలుషితం చేసే విధంగా చేయడం వల్ల చుట్టుప్రక్కల వివిధ చెట్లు గడ్డి సైతం కాలుష్యం కారణంగా బూడిద రంగుగా మారుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పై మానవత్వం లేని విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. గతంలో సైతం దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ దుండిగల్ తండాలో, గాగిలాపూర్‌లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నయాన్నారు.

చర్యలు చేపట్టే పీసీబీ అధికారులు కెమికల్స్ మాఫియాదారుల పట్ల ఉదాసీనతే....

దుండిగల్ తాండాలో చెరువుల కలుషితం, పొగతో, ఇక్కడి ప్రజలు ఫిర్యాదులు పీసీబీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోగా.. కాలుష్య మాఫియా దారుల పట్ల ఉదాసీనతతో ఎటువంటి సంబంధం లేనట్లు వ్యవహరించా రని స్థానిక ప్రజలు ఆరోపించారు. అలాగే సీసీ కెమెరాలు అమర్చి స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో మున్సిపల్ అధికారులు, పోలీస్ నిఘా వేసే విధంగా ముఖ్యంగా పీసీబీ అధికారులు సమన్వయంతో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని స్థానికులు కోరారు. ప్రజల, మూగ జీవాల పట్ల చెలగాటమాడే కెమికల్స్ మాఫియా దారుల పట్ల వెంటనే పై అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరారు.



సంఘటనపై స్పందించిన పీసీబీ అధికారులు...

గురువారం రాత్రి జరిగిన కలుషిత ట్యాంకర్ల పట్ల శనివారం స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ప్రజలు పీసీబీ అధికారులకు తెలియ జేశారు. వెంటనే స్పందించిన అధికారులు సంఘటన స్థలానికి వచ్చి పరీక్ష నిర్ధారణ నిమిత్తమై శాంపిల్స్ సేకరించుకుని వెళ్లారు.

డ్రగ్ సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు



- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- ఒకరు పరారీ
- రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఎం.డి.ఎం.ఏ.డ్రగ్ సరఫరా చేస్తున్న యువకులను పట్టుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటి పోలీసులు. గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్న యువకులను ఎస్‌ఓటీ మాదాపూర్ టీం, జగద్గిరిగుట్ట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, నిందితులను శు క్రవారం అదుపులోకి తీసుకున్నారు. సిఐ.కే.క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి బాలకృష్ణ హైస్కూల్ భూదేవి హిల్స్, తులసినగర్ వద్ద ఇద్దరు విద్యార్థులు విజయవాడకు పోరంకి గ్రామానికి చెందిన రోహిత్, గతంలో బెంగళూరు విమానాశ్రయంలో పనిచేసేవాడు. గోపన్‌పల్లి ప్రాంతానికి చెందిన జూలపల్లి అఖిల్ శివ, చెన్నైలోని యూనివర్సిటీలో బీబీఏ చేస్తున్నాడు. వీరికి జగద్గిరిగుట్ట శిరిడి హిల్స్‌కు చెందిన తిలక్ సింగ్, సదరు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు పక్క సమాచారం తెలుసుకొని పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి 02 చిన్న జిప్ కవర్లలో 03 (ఎం.డి. ఎం.ఏ).డ్రగ్, చిన్న ప్యాకెట్లలో ఉన్న 45 గ్రాముల గంజాయిని అమ్ముతున్న తిలక్ సింగ్‌తో పాటు అఖిల్ శివను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితులు రోహిత్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

డెంగ్యూను నివారిద్దాం..

- మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవంను పురస్కరించుకొని కోఠిలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగ్యూ అవగాహనా ర్యాలీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలలో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరగడం వలన బస్తీలలో పారిశుధ్య కార్యక్రమాలు మెరుగు పడడం వలన డెంగ్యూ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఐనప్పటికి డెంగ్యూ వ్యాధిని వ్యాపింపచేసే దోముల పెరుగుదలను అరికట్టడానికి నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ కుండా చూడాలన్నారు. పనికి రాని పాత్రలు, పాత టైర్లు, నీటి తొట్టెలు, వాడిపడేసిన ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాలలో ఉండకుండా చూసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములు నీటి తొట్టిలపై మూతలు ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇంటిలో నిల్వవున్న నీటిని పారాబోసి కొత్త నీటిని నింపాలి. దీనినే ఫ్రైడే -డ్రై అంటాం అన్నారు. దోమల ప్రభావం ఉన్న ప్రాంతాలలో ప్రజలు దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు కానీ, దోమల కాయిల్స్ కానీ వాడాలి. ప్రజలు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని ప్రజలకు సూచించారు. బస్తీలలో ఫాగింగ్ చేయడం ద్వారా లేదా నీటి నిల్వ గుంటలలో ఆయిల్ బాల్స్ వేయడం ద్వారా, గంబుషియా చేపలను వదలడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చు అన్నారు. డెంగ్యూ వ్యాధిని వ్యాపింప దోమలు పగటి పూట కుట్టుతాయి అని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలు వైద్య ఆరోగ్య శాఖ నిరంతర పర్యవేక్షణ, ప్రజలలో అవగాహన కలిగించడం వలన గడిచిన కొన్ని సంవత్సరాలుగా మన ప్రాంతాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య గననీయంగా తగ్గిందని చెప్పారు.డెంగ్యూ నివారణ చర్యలు తీసుకోవడం సమాజంలో ప్రతీ ఒక్కరి భాధ్యత అని, దోమలు పుట్టకుండా,కుట్టకుండా అందరు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టగలమని తెలిపారు.

నల్లగండ్ల అపర్ణ మాల్‌లో మ్యాక్స్ ఫ్యాషన్ స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ మ్యాక్స్ ఫ్యాషన్ తమ 74వ స్టోర్‌ను నగరంలోని నల్లగండ్లలో అపర్ణ మాల్‌లో ప్రారంభించింది. విశాలమైన విస్తీర్ణం గల ఈ నూతన మ్యాక్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది. ఈ స్టోర్ నల్లగండ్ల ఫ్యాషన్ వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా ఉంది. అందుబాటైన ధరలో, తాము చెలించిన ధరకు అత్యాధునిక విలువని కలిగి ఉంది. కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్సరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం కోసం మ్యాక్స్ స్టోర్‌ను సందర్శించవచ్చు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవ ఆఫర్ కింద రూ.4,999, ఆ పైన షాపింగ్ చేసిన వారికి ఆకర్షనీయమైన బహుమతులు అందిస్తుంది. అంతేకాకుండా అతి తక్కువ ధర రూ.199 నుంచి ఫ్యాషన్ దుస్తులును అందిస్తున్నదని మ్యాక్స్ ఫ్యాషన్ రీజినల్ బిజినెస్ హెడ్ ఏపీ అండ్ తెలంగాణ ఆనంద్ రామ్ పెద్దిరాజు తెలిపారు.

వీధి కుక్కలను నియంత్రించాలి



- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రెండో డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ జి.వెంకటరాజం

నవతెలంగాణ-దుండిగల్

ప్రజలపై విరుచుకు పడుతున్న వీధి కుక్కలను నియంత్రించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రెండవ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ జి.వెంకటరాజం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో ఏ వీధిలో చూసిన పదుల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. కుక్కలను నియంత్రించి ప్రజలకు వీటి నుంచి కాపాడాలని, ఈ మేరకు కార్పొరేటర్ శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. వీధి కుక్కల దాడులు ఇటీవల తరచు ప్రతి చోట పిల్లలపై వృద్ధులపై జరుగుతూనే ఉన్నాయని, అయితే ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపట్టితే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ప్రగతి నగర్‌లో ఇటీవల అనేక వీధుల్లో వీధి కుక్కలు ప్రజలపై మీద పడి విరుచుకుపడుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రహదారుల వెంట ప్రయాణించే వాహనా లు దారులు పాదాచారులు ఇటీవల భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు డాగ్ స్కాడ్ వాహనాల ద్వారా వీటిని అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కమిషనర్‌ను కోరారు.

కృష్ణమూర్తికి విశ్వ సేవా రత్న బిరుదు ప్రదానం



- రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం

నవతెలంగాణ-బాలానగర్

కంజర్ల కృష్ణ మూర్తిచారి ఫౌండేషన్ తరపున వివిధ సేవా కార్యక్రమాలు గుర్తించి, ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం నిర్వహించిన ప్రజ్ఞ శిల్పులకు గౌరవ బిరుదు ప్రధానోత్సవం చేశారు. ఈ మేరకు విశ్వ సేవా రత్న బిరుదుతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కంజర్ల కృష్ణమాచారి చేసిన సేవలను గుర్తించి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్మోహన్ ఆచారికి, కమిటీ సభ్యులకు కంజర్ల కృష్ణమూర్తి చారి మునుముందు మరెన్నో పదవులు చేపట్టాలని కోరారు. ఎర్రవెల్లి అశోక్ చారి శంకరాచారి, నాగులపల్లి ప్రభు తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని డి.పి కాలనీలో గల శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయ 27వ వార్షికోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడు తూ...సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చు కోవాలని..దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంద న్నారు. భక్తి భవం మనసులో ఉన్నప్పుడే మంచి పనులు చేయాలనిపిస్తుంది అన్నారు. ప్రజలంద రూ కులమతాలకు అతీతగా పండుగలు జరుపుకోవాలని కోరారు. తన డివిజన్‌లో ఎండోమెంట్ ఆధీనంలో గల దేవాలయ అభివృద్ధికి ఎల్లపుడు కృషిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో హెూమం, వెంకటేశ్వ రా స్వామి కళ్యాణం, అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్మకర్త, కమిటీ అధ్యక్షులు సుధీర్ రెడ్డి, కమిటీ సభ్యులు రంగా స్వామి, విజయ్ కుమార్, పృథ్వి, శంకర్ శాస్త్రి పంతులు ఉన్నారు.

బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కష్టపడి పనిచేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ముఖ్యంగా జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కుటుంబ సభ్యులకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దుమ్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి స్థానం పక్కా బీఆర్ఎస్ దేనని ధీమావ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పాలనల పట్ల ప్రజలకు నమ్మకం పోయిందని ఆయా పార్టీల అభ్యర్థులు స్థానికేతరులు కాదని ప్రజలు అన్ని గమనించారన్నారు. భారీ మెజారిటీతో రాగిడి లక్ష్మారెడ్డి గెలవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్ బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - మలక్‌పేట్





నిన్న కురిసిన వర్షానికి మలక్‌పేట్‌లో డ్రైయినేజీలు పొంగిపొర్లాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బలాల ఆ ప్రాంతాలలో పర్యటించారు. తర్వాత నీటి నిల్వల ప్రాంతాలలో, డ్రైయినేజీ, తూముల పూడిలకను సిబ్బందితో తీయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వల ప్రాంతాలలో, తూముల పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రాణహితలో ఘనంగా నర్సింగ్ డే

నవతెలంగాణ - చైతన్యపురి



చైతన్యపురిలోని ప్రాణహిత ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ నర్సింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆసుపత్రిలోని నర్సింగ్ సిబ్బంది వైద్య బృందంతో కలిసి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ చిన్నమారి రాహుల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి నర్సులు చేస్తున్న సేవలు చాలా గొప్పవని కొనియాడారు. వైద్యరంగంలో కీలకమైన నర్సువృత్తి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటారని వివరించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన తోడ్పాటు వెలకట్టలేని మని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫీజ్‌లో

10 శాతం డిస్కౌంట్ పేరుతో మోసాలు

అమెరికా విద్యార్థులను మోసం చేస్తున్న నిందితుడి అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

విదేశీ విద్యార్థులను టార్గెట్ చేసుకుని సెమిస్టర్ ఫీజ్‌లో 10శాతం డిస్కౌంట్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కనోళ్ల అశోక్‌కుమార్, ఢిల్లీకి చెందిన తరుణ్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు వివిధ కన్సల్టెన్సీలలో పనిచేస్తున్నారు. తరుణ్ కొన్నాళ్ల నుంచి అమెరికాలోనే ఉంటున్నాడు. అయితే ఇద్దరు నిందితులు ఇక్కడి నుంచి కన్సల్టెన్సీ ద్వారా విద్యార్థులను అమెరికా, ఇతర దేశాలకు పంపించేవారు. అమెరికాలో వివిధ యూనివర్సిటీలలో చదువుతున్న భారతీయ విద్యార్థులను టార్గెట్ చేసి వారి డేటాను సేకరించేవారు.

విదేశాలల్లో విద్యార్థులు చెల్లించే సెమిస్టర్ ఫీజులను తమ ద్వారా చెల్లిస్తే 10శాతం డిస్కౌంట్ లభిస్తుందని నమ్మించేవారు. అనంతరం విద్యార్థుల నుంచి సెమిస్టర్ ఫీజులను తీసుకు వివిధ బ్యాంక్ అకౌంట్స్‌లో వేయించుకునేవారు.

ఆ తర్వాత వారి క్రెడిట్ కార్డులతో ఫీజు చెల్లించినట్టు చేసి, తిరిగి కాన్సల్ చేసేవారు. కానీ విద్యార్థులకు మాత్రం డబ్బులు చెల్లించామని, 10శాతం డిస్కౌంట్ వచ్చిందని రిసిప్ట్‌లు చూపించే వారు. ఇదే తరహాలో నగరంలో ఓ బాధితున్ని మోసం చేశారు. అమెరికాలో చదువుతున్న బాధితుని కుమారునికి సంబంధించిన సెమిస్టర్ ఫీజు చెల్లిస్తామని చెప్పిన నిందితులు.. రూ.4,38,599లకు దండుకున్నారు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు కనోళ్ల అశోక్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎన్. బోస్ కిరణ్, ఎస్‌ఐలు పీ.సురేష్‌తోపాటు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

'కుల, మత రహిత సమాజ నిర్మాణమే

వీరబ్రహ్మేంద్రస్వామికిచ్చే ఘన నివాళి'



నవతెలంగాణ - ఎల్బీనగర్

కుల, మత రహిత సమాజ నిర్మాణమే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికిచ్చే ఘన నివాళి అని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగాచారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ పైనున్న ఆయన విగ్రహం వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాండురంగా చారి ప్రసంగిస్తూ 17వ శతాబ్దం దక్షిణ భారతదేశంలో మూఢాచారాలు, అంద విశ్వాసాలపై, వర్ణవ్యవస్థ, కుల,మత వైశ్యామ్యాలపై, అంటరానితనంపై, బలహీన వర్గాలకు విద్య అవకాశాల అంశాలపై తన జీవిత కాలమంతా ప్రజలలో చైతన్యం రగిలించాడని గుర్తుచేశారు. సమాజంలోని మూఢ విశ్వాసాలను ఖండిస్తూ.. అజ్ఞానంలో మగ్గిపోతున్న మానవాళికి జ్ఞానోదయాన్ని కలిగించిన క్రాంతి దర్శి కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చైతన్య మూర్తి వీరబ్రహ్మేంద్రస్వామి అని కొనియాడారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 1693 వైశాఖ శుద్ధ దశమి రోజున జీవసమాధి అయ్యారని గుర్తుచేశారు. బ్రహ్మంగారు చేసిన పోరాటాలలో ముఖ్యమైనది బ్రాహ్మణులు విశ్వబ్రాహ్మణుల మధ్య సంఘర్షణలు జరిగాయని.. ఈ దేశంలో బ్రాహ్మణులు మాత్రమే చదువుకోవాలని ఆంక్షలు విధిస్తే.. దాన్ని తిప్పి కొట్టి సబ్బండ వర్గాలకు బడుగు, బలహీన వర్గాల చదువుతో ఈ దేశం ముందుకు వెళ్తుందని ఆనాడే బ్రాహ్మణులకు బుద్ధి చెప్పారని, కాలజ్ఞానంలో ఉన్నది గుర్తు చేశారు. బ్రహ్మంగారి మఠాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2000 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఆయన పేరుతో కళాకారులకు, మేధావులకు, సాహిత్య ప్రియులకు అవార్డులు ప్రదానం చేయాలని కోరారు. ఆయన రచనలు దేశవ్యాప్తంగా ఈనాటి సమాజానికి అందించాలని, దేశవ్యాప్తంగా బ్రహ్మంగారి విగ్రహాలను ఏర్పాటు, ఆయన పేరుతో విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో వర్కర్స్ పార్టీ ద్వారా హైదరాబాద్ నుండి బ్రహ్మంగారి మఠం వరకు సబ్బండ వర్గాలతో 101 సభ్యులతో సైకిల్ జాత ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల సమన్వ వేదిక చైర్మన్ కుందారం గణేష్ చారి, కవి రచయిత ఇంద్రవెల్లి రమేష్, అనుకూల సమాజం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బాణాల ద్రోణాచారి, కనకాచారి, శ్యాం సుందర చారి, వర్కర్స్ పార్టీ నాయకులు కొప్పు యాదయ్య, మోత్కూరు మల్లాచారి, కాసోజు పాండురంగా చారి, ధర్మచారి తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న శివనారాయణ కమిటీ హాల్లో వీరబ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాదన కార్యక్రమాన్ని శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు కలకొండ శ్రీనివాస చారి, నారాయణదాసు సతీష్ చారి బృందం, విశ్వబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ శ్రీ విశ్వకర్మ ఆలయంలో, ఉప్పల్ విశ్వకర్మల ఆత్మగౌరవ భవన స్థలం యందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ భిక్షపతి చారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్ చారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాస, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మచారి, కోశాధికారి లెంకలపల్లి యాదగిరి చారి, నారోజు సత్యంచారి, కుమార్ చారి, నైనాచారి, ఆంజనేయులుచారి, శివకుమార్ చారి, పంతులు వెంకటాచారి, విశ్వబ్రాహ్మణ కుల బంధువులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన సబితమ్మ



నవతెలంగాణ - చైతన్యపురి

అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుగాను మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి..ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో శుక్రవారం తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 21 కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. అష్ట లక్ష్మి దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా ఇంద్రారెడ్డికి ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దేవాలయం పరిధిలోని అన్న ప్రసాదశాలను, నిత్య అన్నదాన సత్రాన్ని కలియ3 తిరిగి పర్యవేక్షించారు. తర్వాత చంద్రశేఖర్ గుప్తా సబితా ఇంద్రా రెడ్డికి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళా రెడ్డి, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, జగన్ మోహన్ రెడ్డి, అంకిరెడ్డి, ఆకుల అరవింద్, జగిని రమేష్ గుప్తా, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, శ్యామ్ గుప్త, మహేందర్ రెడ్డి, పొద్దుటూరి శ్రీనివాస్, పుష్పలత రెడ్డి, అనురాధ, స్వప్న రెడ్డి పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి



- ప్రధానోపాధ్యాయులు అర్జున్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించే ఉచిత సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.అర్జున్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుండి 18 వ తేదీ వరకు బడంగ్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించే ఉచిత సమ్మర్ క్యాంపును 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అగస్త ఫౌండేషన్, అర్క డెవలప్‌మెంట్ ఫౌండేషన్ గ్రుఫ్ ఆధ్వర్యంలో శీలా నివేదిత, సుకన్య బృందం వారు నిర్వహించే ఉచిత సమ్మర్ క్యాంపు ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు వివిధ కోర్సుల్లో శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 33మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతో మేలు చేకూరుతుందని.. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదిలో సరిత విద్యానికేతన్ స్కూల్ అద్భుత విజయం



నవతెలంగాణ - సిటీబ్యూరో

సీబీఎస్‌ఈ పరీక్షా ఫలితాల్లో సరిత విద్యానికేతన్ స్కూల్ అద్భుత విజయం సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ సాబిత్, ప్రిన్సిపాల్ షీభ క్రిష్టల్, వైస్ ప్రిన్సిపాల్ నవనీత, అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా చదువుపై శ్రద్ధ కనబరిచే విధంగా వారికి జీవిత లక్ష్యాలను నిర్దేశిస్తూ చదువు యొక్క విలువను తెలియజేస్తూ, వారికి చదువులో వస్తున్నటువంటి మార్పులకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశామన్నారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అని విద్యార్థులకు సూచించారు. మా స్కూల్ నందు ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం.. ప్రతి విద్యార్థిని నిషితంగా గమనించడం, పిల్లల గురించి ఎప్పటికప్పుడు వారి యొక్క తల్లిదండ్రులకు చెబుతూ విద్యార్థులను విజయతీరాలకు చేర్చామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జలసంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ - సిటీబ్యూరో

జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు అన్నారు. జలసంరక్షణకు ప్రాధాన్యమిస్తూ నీటి వృధాను అరికట్టేలా నిర్మాణాలు ఉండాలన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షోలో ఈపీటీఆర్‌ఐతో కలిసి జల మండలి సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను వారు సందర్శించారు. ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జలమండలి రూపొందించిన బ్రోచర్‌ను వారు పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

యువతకు క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 31వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు నారాయణ గౌడ్ నూతనంగా నిర్మించిన బాక్స్ క్రికెట్‌ని, క్రీడా మైదానాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, మనోధైర్యం, ఉపాధి అవకాశాలు కల్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడామైదానం నిర్వాహకులు, కాలనీవాసులులు పాల్గొన్నారు.

గ్లేని గల్ఫ్ అవేర్ హాస్పిటల్‌లో 5కే రన్



నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని మే 17న నిర్వహించుకుంటున్నామని సీఓఓ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ రాజీవ్ గార్గ్, డాక్టర్ ముఖేష్ రావు, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మలింద్ర స్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లేని గల్ఫ్ అవేర్ హాస్పిటల్ నందు రక్తపోటు గురించి ప్రజలలో అవగాహన కల్పించడానికి 5కే వాక్ థాన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం యొక్క తీమ్, మీ బీపీని కచ్చితంగా పరీక్షించుకోండి.. దానిని నియంత్రించండి మరియు ఎక్కువ కాలం జీవించండి, రక్తపోటు యొక్క ప్రాధాన్యత ప్రాముఖ్యత మరియు దాని తీవ్రమైన వైద్యపరమైన సమస్యల గురించి ప్రజలకు తెలియడానికి, నివారణ గుర్తింపు మరియు చికిత్స సమాచారాన్ని అందించడానికి మేము ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. డబ్ల్యూహెచ్ఓ ఈ కార్యక్రమాన్ని 2005 సంవత్సరం మే 17 ప్రారంభించడం జరిగిందన్నారు. ఏదైనా బీపీ 140 /90 ఎంఎకి శ్రద్ధ పరిశోధన మరియు చికిత్స అవసరమని తెలుసుకోవాలి ప్రారంభ దశలో రక్తపోటును నియంత్రించడానికి ఉత్తమమైన మార్గం శరీర బరువును నియంత్రించడం ద్వారా మరియు తక్కువ ఉప్పు రోజుకి ఐదు గ్రాములు తీసుకోవాలని, తక్కువ కార్బోహైడ్రేట్ తీసుకోవాలని, మాంసాకృతులను తక్కువ తీసుకోవాలని సూచించారు. నెఫ్రోపతి కార్డియోమయోపతి, స్ట్రోక్ దృష్టి కోల్పోవడం వంటివి లక్షపొడి వలన కలిగే అవయవ నష్టాన్ని తనిఖీ చేయడం తప్పనిసరి అన్నారు. రక్తపోటు పరీక్షలు వార్షిక ప్రతిపాదికన 14 సంవత్సరముల నుండి ప్రారంభించాలని అన్నారు. ప్రజలు అందరూ రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇందులో రక్తపోటు బరువు బీఎంఐ లిపిడ్ షుగర్, థైరాయిడ్ కోసం రక్తపరీక్షల చేయించుకోవాలని అన్నారు. రక్తపోటును మెరుగుపరచుకోవడానికి, సంబంధిత చికిత్స, సమస్యల గురించి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. మనం సంవత్సరానికి 14 కిలోల ఉప్పును తీసుకుంటున్నామని, ఇది డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన దానికంటే రెండింతలు ఎక్కువ..ప్రతి సంవత్సరం 50శాతం తగ్గించి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పండ్ల దుకాణాలను తొలగించాలని వినతి



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మాసబ్ చెరువు కట్టపైన ఇటీవల వెలసిన పండ్ల దుకాణాలను వెంటనే తొలగించాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సామ భీమ్ రెడ్డి, పన్నాల మధుసూదన్ రెడ్డి శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ హైవే పైన సాగర్ కాంప్లెక్స్ బీఎన్‌రెడ్డి దగ్గర ఇటీవల పండ్ల వ్యాపారులకు, విక్రయిదారులకు జరిగిన గొడవలు నిర్దాక్షిణ్యంగా ఒక మనిషి హత్యకు గురయ్యారన్నారు. వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు అట్టి దుకాణాలను తొలగించడం జరిగిందన్నారు. మళ్లీ ఈ మధ్యనే ఇంజాపూర్ నుంచి తుర్కయంజాల్ మస్కతి వరకు కొత్త కొత్తగా దుకాణం వెలుస్తున్నాయన్నారు. వాటి వలన ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు క్రితంలో జరిగిన గొడవలు కూడా పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదని అందుకే ఆ దుకాణాలను తొలగించాలని కోరారు. తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వెంటనే స్పందించి.. దుకాణాలను తొలగిస్తానని హామీ ఇచ్చారన్నారు.

కేఏ పాల్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఎల్బీనగర్ ఎమ్మెల్సీ సీటు తనకు ఇస్తానని మోసం చేశాడని హైదరా బాద్‌లోని జిల్లెల్లగూడకు చెందిన కిరణ్‌కుమార్ అనే వ్యక్తి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ పలు నియోజకవర్గాల్లో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎల్బీనగర్ సీటు కోసం జిల్లెల్లగూడకు చెందిన కిరణ్‌కుమార్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో తాను కేఏ పాల్‌ను కలవగా..ఎల్బీ నగర్ సీటు కోసం రూ.50 లక్షలు అడిగాడని కిరణ్‌కుమార్ ఆరోపించాడు. ఈ డబ్బుల్లో రూ. 30 లక్షలను ఆన్‌లైన్‌లో చెల్లించా నన్నాడు. మిగతా రూ. 20 లక్షలను పలు దఫాల్లో చెల్లించానని తనకు టికెట్ ఇవ్వలేదని ఆరోపిస్తూ శుక్రవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేఏ పాల్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు.. చీటింగ్ కేసు నమోదు చేసుకున్నారు.

హైదరాబాద్ మెట్రో రైలు సమయం పొడిగింపు..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు వేళలను శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు పొడిగించారు. ప్రస్తుతం ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు మెట్రో టెర్మినల్ నుంచి చివరి మెట్రో నడుస్తోంది. అయితే ప్రయాణికుల కోరికతో చివరి మెట్రో రాత్రి 11.45 గంటలకు నడిపించాలని అధికారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అందుకు సంబంధించిన ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం రాత్రి 11.45 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరింది.

ఇంటర్ సప్లిమెంటరీ
పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 3వరకు నిర్వహించనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు కల్పించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. విద్యార్థులకు సకాలంలో పరీక్ష కేంద్రాలు చేరుకునేలా బస్సులు నడపాలని టీఎస్‌ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరిక్ష కేంద్రాల్లోని ఆరు జోన్లలో క్లీనింగ్, సానిటేషన్‌కు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు సూచించారు. జిల్లావ్యాప్తంగా ఫస్ట్ ఇయర్ 43,689 మంది విద్యార్థులు, సెకండ ఇయర్ 33,167 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. జంటనగరాల పరిధిలో135 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించామన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కన్వీనర్‌గా అయిదుగురు సభ్యులతో కూడిన జిల్లా పరీక్షల కమిటీ, హైపర్ కమిటీ ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తుందన్నారు. మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు నలుగురు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని డీఐఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి డి. ఒడ్డెన్న, అడిషనల్ డీసీపీ ఎమ్. బాపురావు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ మహమ్మద్ షాకీర్ హుస్సేన్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కె. ప్రార్థన, వైద్యశాఖ డాక్టర్ సుధా మాధురి, పోస్టల్ శాఖ రమేష్, వాటర్ వర్క్స్ రియాజుద్దీన్, ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- స్థానిక పోలీసుల దర్యాప్తుపై బాధితుల అనుమానం
- డీసీపీని ఆశ్రయించిన బాధితులు
- సమగ్ర దర్యాప్తుకు ఏసీపీని ఆదేశించిన సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇద్దరు మహిళలు కొట్టుకోగా ఒక మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. అయితే గొడవ కారణంగానే ఆమె మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. సైదాబాద్ పోలీసులు మాత్రం ఆమె అనారోగ్యంతో మృతి చెందింది... పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత సెక్షన్లు మార్చుతామంటూ కుటుంబ సభ్యులను తిప్పి పంపుతున్నారు... ఘటన జరిగి 15 రోజులవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కేసు గుర్చి పట్టించుకోకపోవడంపై మృతురాలి కుటుంబ సభ్యులు సౌత్‌ఈస్ట్ డీసీపీ జానకీ దరవాత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ కేసుపై సమగ్రంగా దర్యాప్తు జరుపాలంటూ సైదాబాద్ ఏసీపీని ఆమె ఆదేశించింది.

వివరాల్లోకెళ్తే.. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివాసముండే శకుంతల భాయ్(60), ఆమె ఇంటిముందు కిరాణ దుకాణం నిర్వహించే సువర్ణ అనే మహిళ గత నెల 25వ తేదీ రాత్రి కొట్టుకున్నారు. అనంతరం శకుంతల అపస్మరక స్థితిలోకి వెళ్లింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 1వ తేదీన మృతి చెందింది. అయితే గొడవ జరిగిన మరుసటి రోజు శకుంతలను దవాఖానాలో చేర్పించి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిందని, ఆ తరువాత తమ ఫిర్యాదుతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పోలీసులు కేసు నమోదు చేశారని వెల్లడించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఈ గొడవ కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తుండగా, పోస్టుమార్టం నివేదిక తరువాతే తదుపరి దర్యాప్తు చేస్తామంటూ పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సైదాబాద్ పోలీసుల వ్యవహారం అనుమానంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు డీసీపీని కలిశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత, గొడవ కారణంగా దెబ్బలు తగిలి మృతి చెందిందా? ఆ గొడవతో మనస్తాపానికి గురైందా? అనే అంశాలను పరిగణలోకి తీసుకొని తదుపరి విచారణ చేస్తామని బాధితులకు డీసీపీ భరోసా ఇచ్చారు. పోలీసులపై చేసే ఆరోపణలు అవాస్తవాలని, బాధితుల ఫిర్యాదు తీసుకోవడం ఎలాంటి జాప్యం లేదని, బాధితులు తనను కలిశారని, వారు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకొని పోస్టుమార్టం రిపోర్టును వెంటనే తెప్పించి సమగ్ర దర్యాప్తు జరుపాలంటూ ఏసీపీని ఆదేశించినట్టు డీసీపీ చెప్పారు

ఓయూలో పోతులూరి కాలజ్ఞాన స్మారక ఉపన్యాసాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సంఘసంస్కర్త, సర్వమతసమైక్యతను చాటి చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన తత్వంపై ఇక ప్రతి ఏడాది మే 17న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్మారకోపన్యాసాలు జరుగనున్నాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా దినోత్సవం సందర్భంగా ఈ స్మారక ఉపన్యాసాలు జరుగుతాయి. ఉస్మానియాలో ఈ స్మారకోపన్యాసాలు నిర్వహించేందుకు ఐదు లక్షల రూపాయల డి.డి.ని శుక్రవారం యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డి. రవీందర్‌కు విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అట్లూరి రవీంద్రాచారి అందజేశారు. యూనివర్శిటీ బ్యాంకులో ఈ డబ్బును ఫిక్స్ డిపాజిట్ చేయగా వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తుల చేత కాలజ్ఞాన స్మారకోపన్యాసాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్ లర్ డీ. రవీందర్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర, కాలజ్ఞానం బోధనలపై మొట్టమొదటి సారిగా ఉస్మానియా యూనివర్శిటీలో స్మారకోపన్యాసాలు పెట్టడం గర్వకారణం అన్నారు. ఇది తన చేతులమీదుగా జరగడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. సిద్ధడ్మి, కక్కడ్మీకలుపుకుని కులమత భేదాలు లేని సమాజం కోసం కాలజ్ఞానం చెప్పిన వీరబ్రహ్మం తత్వాలు ఈ కాలానికి ఎంతో అవసరమైనవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అట్లూరి రవీంద్రాచారి బీ.సీ.కమీషన్ సభ్యులు ఉపేంద్ర, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టీ.గౌరీ శంకర్, ఫౌండేషన్ సభ్యులు మహరాజా రవీంద్రాచారి, కీమోజు జితేందర్, సంకోజు రాఘవేందర్, కొలనూరు శ్రీనివాసాచారి, ప్రొ. వెంకటరాజలింగం తదితరులు పాల్గొన్నారు.

యే వతన్ మేరే వతన్' ఒక అద్భుత చిత్రం

- కనువిప్పు కలిగించే చిత్రం
- పలువురు వక్తలు
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ-ముషీరాబాద్

యే వతన్ మేరే వతన్' ఒక అద్భుత చిత్రం అని, చరిత్రను వక్రీకరించి, హిందూ, ముస్లిం రాజకీయాలు నడుపుతూ ఒక వర్గం ప్రజలను అవమానపరుస్తున్నవారికి కనువిప్పు కలిగించే చిత్రం అని ఆ చిత్ర ప్రదర్శనకు హాజరైన పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి థియేటర్స్ ఆధ్వర్యంలో దేశభక్తి చలనచిత్రం "ఏ వతన్, మేరే వతన్" ప్రదర్శన గావించారు. అనంతరం లోహియా విచార్ మంచ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ 90 వ స్థాపన దినోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంచ్ అధ్యక్షులు గోపాల్ సింగ్, ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం పాలకులకు స్వాతంత్ర్య ఉద్యమం గురించి చెప్పే చిత్రం యే వతన్ మేరే వతన్ అన్నారు. ఇటీవలనే రిలీజై ప్రేక్ష కుల ఆదరణ పొందుతున్న ఈ చిత్రంలో అలనాటి నటి, సునీల్ దత్ భార్య, సంజయ్ దత్ తల్లి నర్గీస్ కనిపించారని తెలిపారు. వక్రీకరణలు, కల్పితాలు లేకుండా ఫ్రీడం ఫైటర్ ఉషా మెహతా చరిత్రను చక్కగా వివరించినట్టు చెప్పారు. దేశభక్తి, త్యాగాలు అంటే ఏమిటో చూపించింది ఈ చిత్రం అన్నారు. ఉషా మెహతా తన రేడియో ద్వారా స్వాతంత్ర్య పోరాట వార్తలను, నేతల ఉపన్యాసాలను, ప్రజలకు అందించే క్రమంలో అనుభవించిన నిర్బంధాల ను, కష్ట నష్టాలను, ప్రాణ త్యాగాలను ఇందులో చక్కగా చూపించారని తెలిపారు. ఉషా మెహతా పాత్రలో సారా అలీఖాన్ చాలా బాగా నటించిందనే కన్నా ఆ పాత్రలో జీవించిందని కొనియాడారు. రామ్ మనోహర్ లోహియా పాత్రలో ఇమ్రాన్ హష్మీ, సారా అలీ ఖాన్ తండ్రి జడ్జి పాత్రలో సచిన్ ఖరేకర్ నటన బాగున్నదన్నారు. సారా అలీ ఖాన్ మిత్రుల కౌశిక్, ఫహద్ పాత్రల్లో నటించిన ఇద్దరు యువకులు నటనలో జీవించారని చెప్పారు. ఫహద్ పాత్రను చాలా బాగా తీశారని... జడ్జిగా తనకు బ్రిటిష్ సర్కార్ ఇచ్చిన కారును ఎక్కమని తండ్రి కోరినప్పుడు, సారా కారు ముందు బ్రిటిష్ జెండా చూసి కాలి నడకనే వెళ్లి పోవడం, రేడియో స్టేషన్ పెట్టేందుకు రూ. నాలుగు వేలు అవసరం ఉండి ఆలోచిస్తున్న సందర్భంలో నానమ్మ నగలు తెచ్చి ఇచ్చి 'ఇక ప్రారంభించండి. అంటూ ప్రోత్సహించిన సీన్ ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఈ చిత్రాన్ని చూడాలని కోరారు. ఈ చిత్రాన్ని ప్రతి పల్లెలో ప్రదర్శించి ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా చేస్తామన్నారు. అన్నింటికీ మించి హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి అందరూ కలిసి స్వాతంత్ర పోరాటం లో ఎలా పాల్గొన్నారో, వారి త్యాగాలను చాలా చిన్న స్టోరీలో చూపించడం గొప్ప విషయం అని కొనియాడారు.





సెల్‌ఫోన్ దొంగ అరెస్టు



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకెళ్తే.. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం.. షేక్ కాజా భాష సైట్ వన్ బోరబండ హెచ్‌ఎఫ్ నగర్‌లో నివసిస్తూ ప్లంబర్‌గా పని చేస్తునానడు. అయితే అతను సెల్ ఫోన్ దొంగతనాలు చేస్తున్నాడు. గతంలోనూ ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు సెల్‌ఫోన్ దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ మేరకు పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద నుంచి సెల్ ఫోన్‌లు రికవరీ చేసుకున్నారు.

టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎమ్మెల్యే,ఎంపీ టికెట్ల విషయంలో తీరని అన్యాయం చేశారని, ఇప్పటికే అగ్రకులాలకు ముఖ్యమంత్రి పదవి, ఎస్సీ లకు ఉప ముఖ్యమంత్రి ఇచ్చారని.. 55 శాతం ఉన్న బీసీలకు ఖచ్చితంగా టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. స్వాతంత్రం అనంతరం రాజకీయ అధికారాన్ని అగ్రవర్ణాలు అనుభవిస్తూ, సహజ వనరులను గుప్పిట్లో పెట్టుకొని సమాజం పై ఆధిపత్యం చెలాయిస్తున్నాయని, సమర్థవంతంగా పని చేస్తున్న బీసీ నేతలు ప్రజాదరణ పొందితే ఎక్కడ ముఖ్యమంత్రి అవుతారేమోననే భయంతో అవినీతి ముద్ర వేసి తొలగిస్తున్నారని ఆరోపించారు.



తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం ఆవిర్భావం

నవతెలంగాణ - బంజారాహిల్స్

స్వరాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని కోల్పోయిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారి హక్కులను పరిరక్షించేందుకు తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరాన్ని ఏర్పాటు చేసినట్టు ఫోరం అధ్యక్షుడు,ఉద్యమ సమయంలో పోలీస్ ఉద్యోగం కోల్పోయిన భోర్గి సంజీవ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావస్తున్నా రాష్ట్ర ఏర్పాటు కోసం త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మ బలి దానాలు, నిస్వార్ధ ఉద్యమకారుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడితే ఫలితం కొంత మందికే పరిమితమైందని వాపోయారు. రాష్ట్రంలో పాలన మారితే ఉద్యమ కారులకు మేలు జరుగుతుందని భావించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథంలోనే నూతన ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిజమైన అమరవీరులను గుర్తించి ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, 500 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు పోరాడుతూనే రైతాంగ, కార్మికుల పక్షాన నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె చాంద్ పాషా,హైమండ్,కార్తీక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

- బీబీజీ సీఎండీ మల్లికార్జున రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

జ్ఞానం, నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఈ వేసవి కాలాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బీబీజీ) సీఎండీ మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సెలవులు అంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారన్నారని.. అయితే, సెలవులను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ విరామ సమయాన్ని సజనాత్మకంగా మార్చడానికి బీబీజీ నడుం కట్టిందన్నారు. ఈ మేరకు 'బీబీజీ బంగారుతల్లి వేసవి ప్రత్యేక వీడియోలు, కార్యకలాపాలు' ను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సమాచారం, విద్యా వీడియోలు, పాడ్‌క్యాస్ట్‌లు, జీకే క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంలో సహాయ పడనున్నామన్నారు. విద్యార్థులు నైపుణ్యం, జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడానికి వినోదభరిత గేమ్‌లు ఉన్నాయన్నారు. సామాజిక సేవలో ఉన్న ఆనందం మరెందులో ఉండదని చెప్పారు. ఈ ప్రోగ్రామ్ కమ్యూనికేషన్ స్కిల్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సరదా గణితం, వేసవిలో చేయవలసినవి, చేయకూడనివి, వచ్చే విద్యా సంవత్సరానికి సంసిద్ధత తదితర అంశాలు అందించనున్నామని తెలిపారు. ప్రతీ వీడియో చివరలో ఒక అసైన్‌మెంట్ ఉంటుందన్నారు.అసైన్‌మెంట్‌ను సమర్పించిన విద్యార్థులకు బీబీజీ బంగారుతల్లి నుంచి 'ఇన్‌క్రెడిబుల్ స్టూడెంట్'గా సర్టిఫై చేస్తూ 'డిజిటల్ సర్టిఫికేట్'తో రివార్డ్ ఇవ్వనున్నామని ప్రకటించారు.



మహంకాళి ఆలయంలో కార్పొరేటర్ పూజలు

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహంకాళమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ దంపతులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు కార్పొరేటర్ చెప్పారు.





పీఎంజే జ్యువెల్స్‌లో 'పవిత్రం' టెంపుల్ జ్యువెలరీ కలెక్షన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

భారతీయ ఆధ్యాత్మిక, దేవాలయాల వైభవాలను ప్రతిబింబిస్తున్న ఆభరణాలు, ప్రతిష్టాత్మక దేవాలయాల స్ఫూర్తిగా ఆకర్షణీయమైన డిజైన్‌ల రూపకల్పన నూతన ఆవిష్కరణ 'పవిత్రం'ను పీఎంజే జ్యువెల్స్ మర్చండైజింగ్ హెడ్ నీరవ్ చల్లా సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్టోర్‌లలో అందుబాటులో ఉండే సరికొత్త కళాఖండాన్ని ఆవిష్కరణ ఉత్సవం సందర్భంగా నీరవ్ చల్లా మాట్లాడారు. భారతీయ దేవాలయాల దివ్య హస్తకళకు చిహ్నంగా "పవిత్రం" పేరుతో ఈ కలెక్షన్‌ను రూపొందించడం..ఈ ఆవిష్కరణ దక్షిణ భారతీయ ఆర్కిటెక్చరల్ అద్భుతాల వైభవం నుంచి ప్రేరణ పొంది దేశంలోని ప్రముఖ ఆలయాలన్నింటిలో అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కొత్తగా ప్రారంభించిన సేకరణ తమ 18 స్టోర్లలో వినియోగదారులందరికీ అందుబాటులో ఉంటాయని, దేవతలకు సంబంధించిన దైవిక వైభవం, పవిత్రమైన మూలాంశాలు, వాస్తుశిల్పం తదితరాలను ఇష్టపడే ఔత్సాహికులకు 'పవిత్రం' ఒక వేడుకే తమ పీఎంజే జ్యువెల్స్ కస్టమర్లను దైవత్వం, భారతీయ గొప్ప సాంస్కృతిక వారసత్వంతో అలంకరించుకోవడానికి ఆహ్వానిస్తుందని తెలిపారు. "పవిత్రం" కలెక్షన్.....కోణార్క్ సూర్యదేవాలయం, మల్లికార్జున దేవాలయం, మీనాక్షి అమ్మ దేవాలయం, పద్మనాభ స్వామి దేవాలయం, తిరుపతి వేంకటేశ్వర దేవాలయం వంటి తదితర దేవాలయాల గొప్పతనాన్ని, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తెలియజేస్తుందని వారు వివరించారు.

ఓయూ వీసీ ఎవరో..?

- ఎస్సీ ఎస్టీలకా ? లేక ఓసీ లకా ?
- ఉస్మానియా యూనివర్సిటీలో జోరుగా చర్చ
- కాంగ్రెస్ సానుభూతిపరులకు అందలమా ? చేయి ఇస్తారా ?
- బోధన, పరిశోధన , అక్కడమీక్ ఉన్నవారికా ? లేకా లాబీయింగ్ చేసే వారికా ?



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో 9 విశ్వవిద్యాలయాల వీసీల కాలపరిమితం ఈ నెల 21తో ముగియనున్న విషయం తెలిసిందే . ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 9 విశ్వవిద్యాలయాలకు ఉప కులపోతులను (వీసీ) లను నియమించడానికి సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. దాంతో వీసీల కోసం దరఖాస్తులు చేసుకున్న పలువురు ప్రొఫెసర్లు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ కోసం 193 మంది ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మారు ఎవరికి అవకాశం ఇస్తుందో ? ఏ వర్గానికి అవకాశం ఇస్తుందో ? అన్న చర్చ ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

ఎస్సీ ఎస్టీ లకు అందని ద్రాక్షగా ఓయూ వీసీ ?

ఇప్పటికే పలుమార్లు ఓసీలు , బీసీల సామాజిక వర్గాలకు చెందిన ప్రొఫెసర్లు ఓయూ వీసీ లుగా పని చేసిన విషయం తెలిసిందే. మరి ఇప్పటివరకు అవకాశం రాని ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు వీసీ అవకాశం అందని ద్రాక్షగా అందనంత దూరంలో ఉందని ఆ వర్గాల ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి ఈ వర్గాలకు అవకాశమిస్తుందా ? లేదా వేచి చూడాల్సిందే? మరొకవైపు ఉస్మాని విశ్వవిద్యాలయంలో ఓసీలకే అవకాశం ఇవ్వాలని అదే సామాజిక వర్గానికి చెందిన కొందరు విద్యార్థులే చర్చించుకోవడం గమనార్హం.

ఇప్పటికే మూడు మార్లు వరుసగా ఉస్మానియాకు బీసీ సామాజిక వర్గానికి చెందినవారె వీసీ లుగా పనిచేశారు. ఈమారు ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందిన ప్రొఫెసర్స్ వీసీలుగా వస్తారని చర్చ నడుస్తుంది .

పార్టీ విధేయులుకా ? లేక ? ఇతరులకా ?

ఇప్పటివరకు ఉస్మానియాలో కాంగ్రెస్ పార్టీ ఐడియాజి లేదని.. ఒకరు ఇద్దరు ప్రొఫెసర్స్ మాత్రమే ఉన్నారని తెలిసింది. వారు తమకు కూడా అవకాశం వస్తుందని వారి వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ అన్ని యూనివర్సిటీ , యూజీసీ , పరిశోధన సంస్థల్లో వారి వారి సానుభూతి పరులు , అనుబంధ సంస్థల వారికి ,అగ్ర తంబులం ఇవ్వడమే కాకుండా సెంట్రల్ యూనివర్సిటీల్లో కూడా ప్రొఫెసర్లుగా అవకాశాలు పుష్కలంగా ఇచ్చారు. మరి కాంగ్రెస్ కూడా తమ ఐడియాజి , సానుభూతి పరులకు అవకాశం ఇస్తుందో లేక వేరే వారికి ఇస్తారో వేచి చూడాల్సిందే.

కంటికి నిద్రలేదు జోరుగా లాబీయింగ్..

ఓయూలో గత మూడు నెలల నుంచి ఓయూ ప్రొఫెసర్లు వీసీలుగా అయ్యేందుకు ఎమ్మెల్యే , మంత్రులు , చివరికి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో లాబింగ్ చేస్తుంటే, మరికొందరు తమ సామాజి వర్గానికి చెందిన వారితో, ఇంకొందరు బ్యూరో క్రాట్స్‌తో మరికొందరు తమ పరిచయాలు ఉపయోగించి వీసీలుగా అయ్యేందుకు పావులు కదుపుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పని చేస్తున్న వీసీల్లో కూడా ఒక్కరు మినహా అందరూ వీసీలకోసం దంఖాస్తు చేసుకొని మళ్ళీ తమకే అవకాశం వస్తుంది వీసీ లుగా మళ్లీ వస్తాం అంటూ ధీమా వ్యక్తం చేస్తూ మేకపోతు గాంబీర్యాన్ని ప్రదర్శించడం విశ్వవిద్యాలయాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇదిలా ఉండగా నాలుగు రోజుల్లో పదవులు ముగియనున్న కొంతమంది వీసీలు కొన్ని ఆర్థికపరమైన అంశాలపై , ఈసీ అనుమతులు లేకపోయినా ఉత్తర్వులు జారీ చేయటం ఎంతవరకు సమంజసం కాదని అక్కడ ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, సంఘాల నాయకులు అంటున్నారు. మరోవైపు గత ప్రభుత్వంపై అనేక విమర్శలు ఉన్నా విషయం తెలిసిందే. కొందరు ఆర్థికంగా పెటుబడులు పెట్టి ఉన్నవారు వీసీలుగా వచ్చారని, మరికొంత మందికి కనీసం ఒక్కరోజు పాఠ్యాంశాలు బోధించని వారికి పరిశోధన అనుభవం లేనివారు వీసీలుగా వచ్చి అనేక వివాదాలకు తావిచ్చారని విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. కొందరు ప్రొఫెసర్లు ఏకంగా నిఘా వర్గాలను కూడా ప్రసన్నం చేసుకుని వీసీ అయ్యారని విద్యార్థులు సహా ప్రొఫెసర్లు ఆరోపిస్తున్నారు. ఈసారైనా మంచి అకాడమీక్ ,పాఠ్యాంశ బోధన , పరిశోధన అనుభవంతో పాటు స్థానికంగా ప్రొఫెసర్లను, విద్యార్థులను, ఉద్యోగులు,కలుపుకుపో యి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి తలనొప్పులు లేకుండా, సమస్యలు అక్కడే పరిష్కరించే, సర్దుకుని పోయి వివాద రహితులకు వీసీలుగా అవకాశం ఇవ్వాలని లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి విశ్వవిద్యాలయాల నుంచి వ్యతిరేకత వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఇవన్నీ గమనం ఉంచుకోవాలని ఆర్థిక ప్రలోభాలకు గురి చేసే వారికి కాకుండా హుందాతనంగా, ఉండే వారికి వీసీ లుగా అవకాశం ఇవ్వాలని ఆచార్యులు , విద్యార్థులు , ఉద్యోగులు , కోరుకుంటున్నారు ఓయూలో నియంతలు, షాడోలు , కాకుండా మంచివారిని , వీసీలుగా అవకాశం ఇవ్వాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

స్వార్థమే పరమార్థంలా ఓయూ వీసీ వ్యవహారం



- ఔట అధ్యక్షుడు ప్రొ.మనోహర్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులది స్వార్థపర ఆలోచనలని, కేవలం వారి స్వార్థం కోసమే, పదవి నుంచి పోతూ పోతూ రావలసిన 2016 పీఆర్సీ బకాయిలను ప్రభుత్వ అనుమతి లేకున్నా విడుదల చేసుకోవడాన్ని ఓయూ ఔట తీవ్రంగా ఖండిస్తుందని అధ్యక్షుడు ప్రొ.మనోహర్ అన్నారు. ఇటీవల సీపీఎస్, 2016 పిఆర్సి వేతన బకాయిల గురించి గురించి ఉస్మానియా ప్రొఫెసర్ అందరూ ధర్నా చేసినప్పుడు ఉపాధ్యాయుల అందరి ముందు సీపీఎస్ ను అమలు చేస్తామని అదే విధంగా 2016 ఏరియర్స్ చెల్లిస్తామని ఓయూ వీసీ వాగ్దానం చేశారని తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ అమలు కావలసిన రూ. 48 కోట్లు , 2016 వేతన బకాయిలు చెల్లించడానికి అవసరమైన నిధులు అన్ని కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయం వద్ద ఉన్నాయని వీసీ ప్రొ. రవీందర్ ఉపాధ్యాయుల ముందు చెప్పినట్టు తెలిపారు. అయితే దీనికి భిన్నంగా ప్రొసీడింగ్ ఆర్సి నెంబర్ 15 70/06/2024-2025 విడుదల చేస్తూ వేతన బకాయిలను కేవలం 01-01-2016 నుండి 30-06-2019 వరకు పదవీ విరమణ పొందిన అధ్యాపకులకు మాత్రమే చెల్లిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేయడం వెనుక వీసి స్వార్థం తప్ప మరొకటి లేదన్నారు. తను అధికారిగా అందరి బాగోగులు పట్టించుకోవాలని అధికారి కేవలం తనకు వ్యక్తిగత లబ్దిచేకూర్చడానికి మాత్రమే ప్రభుత్వం నుంచి గాని ఇతర సాధికార వ్యవస్థల నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే తన పదవీకాలం 5 రోజులు మాత్రమే ఉందని ఇలాంటి పరిస్థితుల్లో ఉస్మానియా ఖజానా నిధులు డ్రా చేయడాన్ని చూస్తే వీసీ ఎంతకు తెగించాడో అర్థమవుతున్నదన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విడుదల చేసినటువంటి వేతన బకాయిల ఉత్తర్వులను ఒకసారి పరిశీలిస్తే వీసీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అందిన కాడికి దండుకొని పోవాలని ధోరణి కనిపిస్తుందని మనోహర్ ఆరోపించారు. వేతన బకాయిల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులను కేవలం వీసీ ఆదేశాల ఆధారంగా డిప్యూటీ రిజిస్ట్రార్ బకాయలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందంటే డిప్యూటీ రిజిస్ట్రర్ పైన ఎంత ఒత్తిడి ఉందో మనం అర్థం చేసుకోవచ్చు అన్నారు. స్వార్థపూరిత ద్వంద ప్రమాణాల వల్ల ఉపాధ్యాయ లోకం నష్టపోతుందన్నారు. ఇప్పటికైనా ఉస్మానియా విశ్వవిద్యాల అధికారులు సరైనటువంటి ఉత్తర్వులని విడుదల చేస్తూ అందరూ ఉపాధ్యాయులకు 2016 వేతన బకాయిలను చెల్లించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికపై పరిశీలించి ఉస్మానియా యూనివర్సిటీ సొంత నిధుల నుండి వేతన బకాయిలను పదవిలో ఉన్న పదవీ విరమణ పొందిన అందరూ ఉపాధ్యాయులకు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్న ఔటా కోరుతుందన్నారు. ఈ విషయమై శుక్రవారం వీసీని కలవడానికి ఔట బృందం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు వెళితే అక్కడ వీసీ అందుబాటులో లేడని , అందుబాటులో ఉన్న రిజిస్ట్రార్‌ను అడిగితే త్వరలోనే ఉపాధ్యాయులకు వేతన బకాయిలను చెల్లిస్తాం అని చెప్పినా ఆయన మాటలు నమ్మశక్యంగా లేవ న్నారు. ఇప్పటికైనా ఒంటెద్దు పోకడలు , స్వార్థ చింతన లేని వీసీలను నియమించాలని కోరారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఓయూలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌లను శుక్రవారం వీసీ ప్రొ. డి. రవీందర్ ప్రారంభించారు. డిజిటల్ బోర్డులను తొలుత ఆర్ట్స్ కళాశాలలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ డిపార్ట్ మెంట్‌లో ఇంగ్లీష్, తెలుగు విభాగాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకొని విద్యార్థులకు ఎఫెక్టివ్ బోధనను అందిం చే ఉద్దేశంతో తరగతి గదుల్లో డిజిటల్ బోర్డ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్ టెక్నాలజీ విద్యార్థులకే కాకుం డా ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులకు సైతం డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. వివిధ రకాల సాంకేతిక అవకాశాలను ఉపయోగించుకుని విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో, అంతర్జాతీయ స్థాయిలో పాఠాలు బోధిం చే అవకాశం చేకూరుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్ రావు మాట్లాడుతూ కళాశాలలోని (పి. జి) ఎం. ఏ కోర్సులకు 25 డిపార్ట్మెంటులకు చెందిన తరగతి గదుల్లో అత్యాధునిక డిజిటల్ బోర్డులను వీసీ సహకారంతో ఏర్పాటు చేశామని చెప్పారు. టీచింగ్ అండ్ లెర్నింగ్ ప్రక్రియలో విద్యార్థులు, అధ్యాపకులకు ఈ డిజిటల్ బోర్డులు ఎంతో అనుకూలంగా, మరింత ఉపయో గకరం గా ఉంటాయని పేర్కొ న్నారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొ. తలత్ సుల్తానా, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ షఫర్డ్ భీనవేని (అకాడమిక్), వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ బాలు నాయక్ (హాస్టల్స్), హెడ్ ప్రొ.జె.వివేక్ వర్ధన్, లైబ్రెరీయన్ డా.ఎ. ఎస్.చక్రవర్తి, ప్రొ.మాయదేవి, ప్రొ.రాములు, వివిధ శాఖల హెడ్స్, బీఓఎస్ చైర్మన్‌లు, ఫ్యాకల్టీ మెంబర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

23న అన్నమయ్య జయంతి వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 23 న వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య జయంతి వేడుకలు శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై నిర్వహిస్తున్నట్టు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వెమరాజు విజయ్ కుమార్ అన్నమాచార్య మిషన్ ప్రతినిధి కామిసెట్టి గోదా లక్ష్మి పత్రికా విలేకరులకు తెలిపారు శుక్రవారం ఇందుకు సంబంధించిన గోడ పత్రికను సంస్థ కార్యాలయంలో పే అండ్ అకౌంట్స్ డిప్యూటీ కమిషనర్ వసుంధర సంస్థ ప్రతినిధులతో కలసి విడుదల చేశారు. పదకొండు మంది నాట్య గురువుల శిష్యులు 50 మంది తో కలిసి అన్నమయ్య కీర్తనల పై కూచిపూడి భరతనాట్యం ఆంధ్ర నాట్యం లలో శ్రీ పదర్చన శీర్షికన ప్రదర్శన చేస్తారని సమన్వయ కర్త సుధా మాల ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె వి రమణ పాల్గొంటారని, అతిథులుగా కవి ఫణీంద్ర, పోలీస్ ఉన్నతాధికారి విజయ్ కుమార్ , రజిత ఆకుల, పద్మిని మాచానీ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

బోరబండలో ఇద్దరు నకిలీ డాక్టర్లపై కేసు

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు నకిలీ డాక్టర్లపై బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నాగుల మీరా తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఆర్ఆర్ పురంలో ఎంబీబీఎస్ డాక్టర్లు అని చెప్పుకుంటూ, తెలిసి తెలియని మందులు రాస్తూ రోగులను మోసం చేస్తున్న వెంకటేశ్వర క్లినిక్ నడుపుతున్న డాక్టర్ రాజమౌళి,ఏయూ హెల్త్ కేర్ సెంటర్ నడుపుతున్న డాక్టర్ ఉదయ్ లపై, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్టర్ డాక్టర్ రమేష్ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు క్లినిక్‌లకు లైసెన్సులు ఎవరిచ్చారు, అదే విధంగా ఎవరు ఫిర్యాదు చేశారు, ఎవరైనా రోగులకు నష్టం జరిగిందా, బిల్డింగ్ అద్దెకు ఇచ్చిన ఇంటి యజమానులను కూడా పిలిపించి క్లినిక్ నడుపుతున్న వారు ఎంబీబీఎస్ డాక్టర్లు అని తెలుసా లేదా? వారి రికార్డు స్టేట్మెంట్ చేస్తామని, అన్ని వివరాలు సేకరించిన తర్వాత నకిలీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని బోరబండ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్ తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి పూజలో కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

సంఘ సంస్కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331వ ఆరాధన మహోత్సవాలు రామంతపూర్ శ్రీనివాస పురంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, గౌరవ పెద్దలు లాలుకోట వెంకటాచారి, వేములవాడ మదన్మోహన్ చారి, కుందారం గణేష్ చారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బైరోజు రామస్వామి, ప్రధానకార్యదర్శి యాలాల వెంకటేశం చారి, కోశాధికారి వేములవాడ నరసింహచారి, మేరుగోజు వేణుచారి, పగిడోజు వెంకటా చారి ,కర్ణకంటి అశోక్ చారి,వడ్ల సిద్దిరాములుచారి ,కొడపర్తి రాంచంద్రం, సుంకోజునారాయణచారి ,పుల్లూరి పద్మా చారి,కొడపర్తి గోపిచారి, పాములపర్తి నరేందర్ చారి ,శిల్పి శశిధర్ చారి, చెల్లోజు ఎల్లాచారి, నాగరం భాస్కర్ చారి, నాగారం శ్రీనివాస్ చారి,సిర్వోజు రవిచారి, కనపర్తి రామరత్నం చారి, రాల్లబండి కుమార్ చారి, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్త పోటు సైలెంట్ కిల్లర్

- పట్టించుకోకపోతే ముప్పు తప్పదు
- డాక్టర్ పెద్ది శ్రీధర్ రెడ్డి పెద్ది



నవతెలంగాణ-బంజారాహిల్స్

అధిక రక్తపోటు ప్రస్తుతం అందరినీ భయపెడుతూ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఈ మహమ్మారి కబలిస్తోందని, జాగ్రత్తలు తీసుకోకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవని ప్రముఖ వైద్యులు, సీనియర్ కార్డియాలజిస్ట్. కార్డియాక్ సెంటర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి పెద్ది అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తపోటుపై ఆయన మాటల్లోనే.. "హైపర్ టెన్షన్.. దీన్నే బిపి అంటారు ప్రస్తుతం దీని బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. హైపర్‌టెన్షన్ పై అవగాహన కల్పించటం ద్వారా పరిస్థితి తీవ్రతను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 17ను ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని జరుపుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జాగ్రత్తలు తీసుకునే లక్ష్యంగా ప్రచారం చేస్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మారుతున్న జీవనశైలి,ఆహారపు అలవాట్లు నిద్రలేమి ఎలక్ట్రానిక్ వస్తుల వినియోగం హైబీపీకి కారణమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంతో పాటు మెట్రో నగరాల్లో ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. దాదాపు 20 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. అధిక రక్తపోటు పైకి ప్రమాదకరంగా కనిపించకపోయిన చాపకింద నీరులా కబలిస్తుంది. సకాలంలో గుర్తించి చికిత్స అందించకుంటే చివరకు గుండె జబ్బులు లేదా స్ట్రోక్ వచ్చే ప్రమాదానికి దారి తీస్తుందనీ 85 దేశాలకు చెందిన హైపర్‌టెన్షన్ సొసైటీలు, లీగ్‌లతో కలిపి వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ ఏర్పాటైంది. రక్తపోటు గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవటం వల్ల పరిస్థితి తీవ్రంగా మారుతున్నది. అధిక కొవ్వు పదార్థాలను తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, ఒత్తిడి, ఆందోళన ,డిప్రెషన్ వంటివి రక్తపోటుకు ప్రధాన కారణాలు. వీటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడమే ఈ వ్యాధికి కారణం కాగా వారసత్వంగా కూడా ఇది వచ్చే అవకాశాలున్నాయి. తలనొప్పి, వికారం, వాంతులు, తల తిరగడం , శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి హైపర్ టెన్షన్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సత్వరం వైద్యులను సంప్రదించి చికిత్స పొందటం ఉత్తమం. అంతేకాకుండా రక్తపోటు సమస్య దరిచేరకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి, రోజువారి వ్యాయామాలు చేయాలి. సాధారణ హైబీపీ స్థాయిలు 120/80 కాగా ప్రస్తుతం 130/90 ఉన్నా ఎలాంటి ఇబ్బంది ఉండదు. అంతకు మించి నమోదయితే ప్రమాదం" అని తెలిపారు.

టాటూ వేయించుకుంటున్నారా.. అయితే జాగ్రత్త!

టాటూలు వేయించుకోవడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. తమకు ఇష్టమైన వారిపై ఉన్న ప్రేమకు గుర్తుగా కొందరు టాటూ వేయించుకుంటే, ఫ్యాషన్ కోసం ఇంకొందరు వేయించుకుంటారు. టాటూ వేయించుకున్నప్పుడు చర్మ సంరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. లేకపోతే అలర్జీలు, దద్దుర్లు వచ్చే ప్రమాదముంది. టాటూ వేయించుకున్న ప్రాంతంలో కణాలు దెబ్బతినడంతో చర్మం తేమనుకోల్పోయి నిర్జీవంగా మారుతుంది. అక్కడ కొత్త కణాల ఉత్పత్తిని ప్రేరేపించడానికి మాయిశ్చరైజర్ అప్లయ్ చేయడం మంచిది. ఆ ప్రాంతంలో కొత్త కణాలు పుట్టుకొచ్చేదాకా.. అంటే రెండు మూడు వారాలపాటు బ్యూటీ మాస్కులు, స్క్రబ్‌లు, వ్యాక్స్‌లు వాడొద్దు. వీటివల్ల ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది.











వేగంగా నడిస్తే.....

నడక ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీన్ని సులభమైన వ్యాయామాల్లో ఒకటిగా పేర్కొంటారు వైద్య నిపుణులు. రోజూ వాకింగ్ చేస్తే ఎన్నో రోగాలు నయమవుతాయని, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని అనేక అధ్యయనాల్లో తేలింది. వేగవంతమైన నడకతో కలిగే ప్రయోజనాలను చూద్దాం.

కండరాలు, కీళ్ళకు బలం: వేగవంతమైన నడకను మీ దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా మీ శరీరం మరింత దృఢంగా తయారవుతుంది. వేగంగా కండరాలను కదిలించడం ద్వారా మీ కండరాలకు బలం చేకూరుతుంది. ముఖ్యంగా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్న వారికి వేగంగా నడవడం కొంత ఉపశమనాన్ని అందిస్తుంది. ఇది రక్త ప్రసరణను పెంచడంలో కూడా సహాయపడుతుంది.

మెరుగైన జీవక్రియ : మీరు వేగంగా నడవడానికి, మీ శరీరానికి ఎక్కువ శక్తి అవసరం. వేగంగా నడవడం ద్వారా మీ శరీర జీవక్రియను మెరుగుపడుతుంది. మీ శరీర బలాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకోవడంలో సహాయపడుతుంది. ఇది మీ శరీరంలో జీర్ణక్రియను కూడా ప్రేరేపిస్తుంది. మీ శరీరంలో కొవ్వు శాతాన్ని తగ్గించి పొట్ట వద్ద కొవ్వును తగ్గిస్తుంది.

హార్మోన్ల నియంత్రణ : విరామం లేకుండా పని చేయడం, శారీరక శ్రమ లేకపోవడం అనేవి హార్మోన్ల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తాయి. కార్టిసాల్ వంటి ఒత్తిడి కలుగజేసే హార్మోన్లను తగ్గించడమే కాకుండా, ఎండార్ఫిన్లు, హార్మోన్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఎండార్ఫిన్లు కూడా శరీరంలో సానుకూల అనుభూతిని కలిగిస్తాయి. పిసిఓడి వంటి హార్మోన్ల అసమతౌల్యత కారణంగా ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలను తగ్గించడానికి ఈ వేగవంతమైన నడక సహాయపడుతుంది.

అధిక బరువుకు చెక్ : వేగవంతమైన నడక ద్వారా మీరు క్యాలరీల రూపంలో ఎక్కువ శక్తిని బర్న్ చేస్తారు. ఇది మీ కండరాల శక్తిని పెంచుతుంది. తద్వారా మీ శరీర బరువును నియంత్రిస్తుంది. మీ వయస్సుకు తగ్గట్లు శరీర బరువు ఉండేలా చేస్తుంది. ఏదైనా అదనపు కొవ్వు తగ్గించడానికి నడక చాలా సహాయపడుతుంది. అంతేకాక, నడుము చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి, గుండె వేగంగా కొట్టుకోవడానికి బ్రిస్క్ వాక్ ఎంతగానో ఉపయోగపడుతుంది. నడక సమయంలో గట్టిగా ఊపిరి పీల్చుకోవడం ద్వారా మీ కొవ్వు కరుగుతుంది. ఇది మీ కేలరీలను వేగంగా కోల్పోవటానికి సహాయపడుతుంది.



మెరుగైన ఆరోగ్యం : వేగవంతమైన నడక వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీకు శారీరక వ్యాయామంగా పనిచేస్తుంది. అంతేకాక, మీ గుండెకు ఆరోగ్యం చేకూర్చుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. డయాబెటిస్ నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది. మీ కండరాలలోని కణాలు శక్తిని పొందటానికి బాగా పనిచేస్తుంది. అంతేకాక, రక్తపోటును నియంత్రించడం, మెరుగైన రక్త ప్రసరణ, ఆక్సిజన్ ప్రసరణ, సమతుల్య కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ వంటి ప్రయోజనాలను చేకూర్చుతుంది.

దీన్లో నిర్లక్ష్యం వద్దు

దాంపత్య జీవితంలో శృంగానిది కీలక పాత్ర. అయితే చాలా మంది భార్యాభర్తలు తీరిక లేని పని వేళలు, షిఫ్టుల్లో మార్పుల కారణంగా దీనికి సమయం కేటాయించలేకపోతున్నారు. మరికొందరు పని ఒత్తిళ్లతో సతమతమవుతూ లైంగిక జీవితాన్ని ఆస్వాదించలేకపోతారు. ఫలితంగా ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తుతాయి. పరిస్థితి ఇక్కడి దాకా రాకూడదంటే ముందే జాగ్రత్తపడడం మంచిదంటున్నారు నిపుణులు. ఇద్దరికీ దొరికిన సమయాన్నే ఇందుకు సద్వినియోగం చేసుకోవాలంటున్నారు. ఇందులో భాగంగా ఇద్దరూ పరస్పరం ఒకరి కోరికల్ని మరొకరు తెలుసుకొని మసలుకోవడం, అప్పుడప్పుడూ వెకేషన్స్‌కి ప్లాన్ చేసుకోవడం వంటివి చేయాలి. ఇవన్నీ మానసికంగా, శారీరకంగా ఇద్దరినీ దగ్గర చేసే మార్గాలు. కాబట్టి కెరీర్ విషయంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ లైంగిక జీవితాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయడం తగదంటున్నారు నిపుణులు.

బంధం దృఢమవ్వాలంటే..?

పెండ్లి తర్వాత తమ సంసారం హాయిగా సాగిపోవాలని భార్యాభర్తలు కోరుకోవడం సహజం. జీవితం హాయిగా గడవాలన్నా, ఉన్నత స్థాయికి ఎదగాలన్నా ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయడం తప్పనిసరి. అయితే ఈ హడావిడిలో పడి చాలా జంటలు ఒకరికొకరు తగిన సమయం కేటాయించుకోలేక పోతున్నారు. ఇక పని వేళలు, సెలవు రోజులు వేర్వేరుగా ఉండే వారు ఇంట్లో ఉన్నా హాయ్, బైలతో సరిపెట్టుకోవాల్సిందే. నిజానికి ఈ ఉరుకుల పరుగుల జీవితం ఆరోగ్యాన్నే కాదు అనుబంధాన్నీ దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. సంసారంలో కలతలు రావడానికి ఇదీ ఓ కారణమంటూ చాలా మంది ఆవేదన చెందుతున్నారు. ఏదేమైనా పని వేళలు, సెలవు రోజుల్లో తేడాల వల్ల అనుబంధానికి ముప్పు వాటిల్లకూడదంటే భార్యాభర్తలు తమకు దొరికిన ఆ కాస్త సమయాన్నే తెలివిగా సద్వినియోగం చేసుకోవడం మంచిదంటున్నారు. మరి అదెలాగో తెలుసుకుందాం...

భార్యాభర్తలిద్దరికీ షిఫ్టు సమయాలు వేరైనప్పటికీ రోజులో ఏదో ఒక సమయం ఇద్దరికీ అనువుగా రావచ్చు. ఓరోజు మధ్యాహ్నం లంచ్ సమయానికి ఇద్దరూ ఇంట్లోనే ఉండచ్చు. లేదంటే రాత్రిళ్లు కలిసి భోజనం చేసే అవకాశం దొరకచ్చు. మరో రోజు ఉదయాన్నే కలిసి వ్యాయామం చేయడానికి వీలు కుదరచ్చు. ఇంకో రోజు కలిసి ఇంటి పనులు, వంట పని చేసుకునేందుకు సమయం కలిసి రావచ్చు.

సరదాగా మాట్లాడుకోవచ్చు

సెలవు రోజుల్లో కొంతమంది మొబైల్స్, టీవీలకు అతుక్కుపోవడం, ఇంకొంత మంది దొరక్క దొరక్క ఖాళీ సమయం దొరికిందని తమకు నచ్చిన పనుల్లో లీనమవడం వంటివి చేస్తుంటారు. కానీ ఇలాంటి పనులతో సమయాన్ని వృథా చేసుకోకుండా భాగస్వామితో గడపడానికి కేటాయిస్తే ఇద్దరూ కలిసి కాసేపు సరదాగా మాట్లాడుకోవచ్చు. దీని వల్ల ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ దెబ్బతినకుండా జాగ్రత్తపడవచ్చు. అలాగే పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక వీక్లీ ఆఫ్‌లు కుదరకపోయినా నెలకోసారో లేదా రెండుసార్లో ఒకరి వీక్లీ ఆఫ్ రోజున మరొకరు సెలవు పెట్టుకోవడం, ఇదే విధంగా మరోసారి ఇంకొకరు సెలవుల్ని ఎడ్జస్ట్ చేసుకోవడం వల్ల మరింత ఎక్కువ సమయం కలిసి గడిపేందుకు వీలు దొరుకుతుంది.

భావాలు పంచుకోండి

కాపురమన్నాక కలతలు, గొడవలు సహజం. వీటికి తోడు కెరీర్ పరంగా ఇద్దరూ బిజీగా ఉండడం వల్ల కలిసి గడపలేకపోతున్నామన్న ఒత్తిడి ఇద్దరిలోనూ సహజం. ఇవి మానసికంగా కుంగదీస్తాయి. ఈ చిరాకుతోనూ భార్యాభర్తలిద్దరి మధ్యా గొడవలు రావచ్చు. అయితే పని వేళల్లో తేడాల వల్ల అసలే సమయం దొరకట్లేదని ఈ గొడవల్ని నిర్లక్ష్యం చేస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీ ఇద్దరికీ ఉమ్మడిగా దొరికిన ఆ కాస్త సమయంలోనే ఓ పావుగంటో, అరగంటో కేటాయించి ఈ సమస్యల్ని పరిష్కరించుకోవడం మేలంటున్నారు నిపుణులు. అలాగే ఒకరి కష్టసుఖాల్ని మరొకరు పంచుకోవడం, ఒకరికొకరు అండగా నిలవడం కూడా బిజీ లైఫ్‌స్టైల్లోనూ అనుబంధాన్ని పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గమే అంటున్నారు.



సహాయం చేసుకోవడం

ఇద్దరూ ఉద్యోగాలు చేసే భార్యాభర్తలు బాధ్యతల్నే కాదు ఇంటి పనుల్నీ సమానంగా పంచుకోవడం మనం చూస్తుంటాం. ఇద్దరూ కలిసి ఆయా పనులు చేసుకోవడం వల్ల ఇంటి పని త్వరగా పూర్తవుతుంది. ఒక్కరిపైనే భారం పడకుండానూ ఉంటుంది. ఇలా ఒకరికొకరు సహాయం చేసుకోవడం వల్ల ఇద్దరి మధ్య అనుబంధం పెరుగుతుంది. అయితే షిఫ్టు వేళలు వేరైనా కలిసి గడిపే సమయం దొరక్క పోయినా ఇంటి పనుల్ని సమానంగా పంచుకుంటూ ముందుకు సాగితే భార్యాభర్తలు తమ అనుబంధాన్ని దృఢం చేసుకోవచ్చం టున్నారు నిపుణులు. అదెలాగంటే ఒకరు చేయగా మిగిలిన పనుల్ని మరొకరు చేసుకోవడం వల్ల సమయం ఆదా అవుతుంది. పరోక్షంగా ఒకరికొకరు సహాయపడినట్లూ ఉంటుంది. ఇది కూడా ఆలుమగల మధ్య అనుబంధాన్ని పెంచుతుందంటున్నారు నిపుణులు.

ధాన్యం సేకరణ త్వరగా పూర్తిచేయండి

(మొదటిపేజీ తరువాయి)

త్వరగా మిల్లులకు వాటిని చేర్చాలని చెప్పారు. శుక్రవారంనాడామె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొంత మంది కలెక్టర్లు తీసుకున్న చర్యలను ఆమె అభినందించారు. ఇదే విధానాన్ని అన్ని జిల్లాల కలెక్టర్లు అనుకరించి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా తీసుకోవాలని చెప్పారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. పలు జిల్లాల్లో వీటిని వేగంగా పూర్తి చేస్తున్నందుకు కలెక్టర్లను అభినందించారు. పాఠశాలలు పున్ణప్రారంభమయ్యే జూన్ 12 తేదీ నాటికి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచే రోజున ప్రతి విద్యార్థికి నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మరమ్మతు పనులు, కరెంటు, మరుగుదొడ్లు, త్రాగునీరు, పెయింటింగ్, ఫర్నీచర్ పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని చెప్పారు. సమావేశంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డీఎస్ చౌహాన్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, పంచాయత్ రాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. పార్లమెంటరీ కన్వెన్షన్ ప్రకారం.. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వాలి. కాబట్టి బీజేపీయేతర పార్టీలలో అత్యధిక సంఖ్యాబలం సాధించిన ప్రతిపక్షాలకు, ప్రత్యేకించి కాంగ్రెస్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వవలసి ఉంటుంది. ఈ కారణంగానే మోడీ డిప్యూటీ స్పీకర్ ఎంపిక విషయంలో అయిష్టతను వ్యక్తం చేసి ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "గడిచిన పదేండ్లలో మోడీ పార్లమెంటును నడుపుతూ రాజ్యాంగ సారాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. లోతైన చర్చల కోసం స్టాండింగ్ కమిటీకి బిల్లులను సూచించే రాజ్యాంగపరమైన లేదా పార్లమెంటరీ స్కీమ్ ఆచరణలో తొలగించబడింది. కొన్ని చర్యలను ఆమోదించే సమయంలో షార్ట్ కట్‌లు ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధానిపై ఒకటి కంటే ఎక్కువసార్లు ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి" అని చెప్తున్నారు.

రైతుల తీవ్ర నిరసనలతో పాటు ప్రతిపక్షాల నిరసనల నడుమ మూడు 'నల్ల' చట్టాలు(సాగు చట్టాలు) పార్లమెంటులో ఆమోదం పొందాయి. ఇదేవిధంగా, పార్లమెంట్‌లో జరిగిన గందరగోళాన్ని సద్వినియోగం చేసుకొని మోడీ ప్రభుత్వం అనేక బిల్లులను చట్టాలుగా మార్చింది. లోక్‌సభ, రాజ్యసభ నుంచి చాలా మంది ప్రతిపక్ష సభ్యులను ప్రిసైడింగ్ అధికారులు బయటకు పంపిన తర్వాత బిల్లులు ఆమోదించబడటం గమనార్హం. " లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ కుర్చీలకు ఉన్న గౌరవాన్ని ప్రధాని మోడీ తగ్గించారు. 17వ లోక్‌సభకు అధ్యక్షత వహించిన ఓం బిర్లా 'కుడివైపు' చూసేవారు. ప్రతిపక్ష నాయకులకు సరైన గౌరవం దక్కేది కాదు. సభలో ప్రసంగించేందుకు తగిన అవకాశమూ లభించేది కాదు. ఇది ప్రతిపక్షంలో కీలకంగా ఉన్న నేత రాహుల్ గాంధీ విషయంలో అనేకసార్లు జరిగింది. సభలో బీజేపీ ఎంపీలు ఆయనను గేలి చేసే విధానం, మాట్లాడనీయకపోవటం, స్పీకర్ అంతగా కట్టడి చేయకపోవటం వంటివి జరిగాయి. కొన్నేండ్ల క్రితం బీజేపీకి మెజారిటీ లేని రాజ్యసభను తప్పించేందుకు మోడీ మనీ బిల్లుగా పేర్కొంటూ వివాదాస్పద బిల్లును ఎలా ఆమోదింపజేసుకున్నారో పార్లమెంటరీ ఘట్టాన్ని పరిశీలకులు మరచిపోలేదు. తర్వాత అది మనీ బిల్లు కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, బీజేపీ రాజ్యాంగాన్ని కూడా మోడీ పట్టించుకోలేదు. 2019లో కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్థానంలో జె.పి నడ్డాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోడీ నియమించారు. అసలు, బీజేపీ రాజ్యాంగంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే నిబంధనే లేకపోవటం గమనార్హం. "పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య చర్చల ద్వారా నడుస్తుంది. ప్రధాని ఎప్పుడూ చర్చను కొనసాగించటంలో ఎటువంటి చొరవ తీసుకోలేదని ప్రతిపక్షాల ఆరోపణ. ప్రధాని తన హయాంలో గుజరాత్‌లో అనుసరించిన దారుణ ప్రజాస్వామ్య పద్ధతులను పార్లమెంటుకు తీసుకురావటం బాధాకరం. ప్రత్యర్థులను తాత్కాలికంగా అసెంబ్లీ నుంచి బహిష్కరించటం, వారు లేనప్పుడు హడావుడిగా శాసనాలను ఆమోదించటం మోడీ హయాంలో గుజరాత్ మోడల్. ఈ 'గుజరాత్ మోడల్' ప్రత్యర్థులను ఫైరింగ్ లైన్‌పైకి తెచ్చి రాజ్యాంగాన్ని దెబ్బతీసింది. వారి ఏకైక తప్పు ఏమిటంటే వారు ప్రభుత్వానికి కుడి వైపున లేకపోవటమే" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు.

డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్.. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ఒక ఫూల్‌ప్రూఫ్ డాక్యుమెంట్ అని సూచించారు. అయితే ఇది అధికారంలో ఉన్న వ్యక్తుల స్వభావం, సమగ్రత, వారు పని చేసే విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. రాజ్యాంగ నిర్మాతల భయాలు నిజమయ్యేలా మోడీ తీరు ఉన్నదని మేధావులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ, ప్రధాని విధానాలు, తీరుతెన్నులు భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కావని వారు అంటున్నారు.

'భూమి పుత్రుడు' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ పత్రికా వ్యాసాల సంకలనం సన్ ఆఫ్ ది సాయిల్ (భూమి పుత్రుడు) పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు ఆవిష్కరించారు. శుక్రవారంనాడిక్కడి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, గాదరి బాలమల్లు, పుస్తక రచయిత గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలా చేసి ఉంటే..నన్ను ఉరి తీయాలి

(మొదటిపేజీ తరువాయి)

సృష్టికర్తలను నేను గౌరవిస్తాను' అని ఆయన అన్నారు. కొద్దిమంది సంపన్నులకే బీజేపీ లబ్ది చేకూర్చిందని విపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో మోడీ ఈ సమాధానమిచ్చారు. ఏదైనా తప్పుగా రుజువైతే పరిణామాలను ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నాననీ, సంపద సృష్టికర్తలకు తన మద్దతును మోడీ గట్టిగా సమర్థించుకున్నారు. "నేను నిజాయితీ లేని పని చేసి ఉంటే, నేను (ఎవరికైనా) తప్పుడు మార్గంలో ఉంటే, నన్ను ఉరితీయాలి. కానీ నా దేశంలో సంపద సృష్టికర్తలను నేను గౌరవిస్తాను" అని మోడీ అన్నారు.

సన్న వడ్లకేనా..?

(మొదటిపేజీ తరువాయి)

చేయాలనేది సందిగ్ధంగా మారింది. దేశంలోనే వరి సాగులో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉంది. పండించే ధాన్యంలో 90 శాతం దొడ్డు రకమే. ఖరీఫ్, యాసంగి రెండు సీజన్లలోనూ రైతులు దొడ్డు రకాల్నే పండిస్తున్నారు. ఖరీఫ్‌లో కొంత సన్న రకం సాగు చేసినా వ్యాపారులు, మిల్లర్లు కొనగా రైతు అవసరాల కోసమే ఉంచుకుంటారు. దాంతో రూ.500 బోనస్ అనేది రైతుకు అందని ద్రాక్షే కానుంది.

ఏటా తగ్గుతున్న ప్రభుత్వ కొనుగోళ్లు

రాష్ట్రంలో సన్న రకాల వడ్లను పండించడం ప్రశ్నార్థకమనే చెప్పాలి. గత మూడేండ్ల కాలంలో రాష్ట్రంలో పండించిన ధాన్యం దిగుబడులు ప్రభుత్వం కొనుగోళ్లు చేసిన వివరాల్ని పరిశీలిస్తే... 2020-21 ఖరీఫ్‌లో 96.31 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా ప్రభుత్వం 48.74 లక్షల టన్నులే కొనుగోలు చేసింది. యాసంగిలో 122.20 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా 92.20 లక్షల టన్నుల్నే కొనుగోలు చేసింది. ఆ ఏడాదిలో 218.51 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా ప్రభుత్వం 141.03 లక్షల టన్నుల్ని మాత్రమే కొనుగోలు చేసింది. 2021-22 ఖరీఫ్‌లో 124.46 లక్షల టన్నుల దిగుబడి రాగా 70.22 లక్షల టన్నుల్ని ప్రభుత్వం కొన్నది. యాసంగిలో 77.12 లక్షల టన్నుల దిగుబడులు రాగా 50.39 లక్షల టన్నుల్ని సర్కారు కొన్నది. ఈ ఏడాదిలో 202.18 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా ప్రభుత్వం కేవలం 120.61 లక్షల టన్నుల్ని కొనుగోలు చేసింది. 2022-23 ఖరీఫ్‌లో 138.03 లక్షల టన్నుల దిగుబడులు రాగా 65.01 లక్షల టన్నుల ధాన్యాన్నే ప్రభుత్వం కొన్నది. యాసంగిలో 120.14 లక్షల టన్నుల దిగుబడులు రాగా 66.85 లక్షల టన్నుల్లే సర్కారు కొన్నది. ఈ ఏడాదిలో మొత్తం 258.17 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు రాగా ప్రభుత్వం 131.86 లక్షల టన్నులే కొనుగోలు చేసింది. 2023-24 ఖరీఫ్‌లో 33.69 లక్షల టన్నులు, ఈ యాసంగిలో 60.70 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 30.20 లక్షల టన్నుల ధాన్యాన్నే ప్రభుత్వం కొనుగోలు చేసింది.

సన్న వడ్ల సాగు ప్రశ్నార్థకమే

రాష్ట్రంలో సన్న రకాల ధాన్యాన్ని పండించడం ప్రశ్నార్థకంగా మారింది. వరి సాగును పరిశీలిస్తే.. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాల్ని 30 నుంచి 40 శాతమే సాగు చేస్తారు. దొడ్డు రకం వరిని 60 నుంచి 70 శాతం సాగు చేస్తారు. యాసంగి సీజన్‌లో అయితే సన్నాలు కేవలం 10 నుంచి 15 శాతమే సాగు చేస్తారు. 90 శాతం దొడ్డు రకం ధాన్యాన్నే సాగు చేస్తూ వచ్చారు. ఈ సన్నరకాల్ని పండించేది కూడా నల్లగొండ, నిజామాబాద్, వరంగల్ ప్రాంతాల్లోనే పండిస్తున్నారు. సన్న ధాన్యాన్ని వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తారు. కొంత మేర రైతులు తమ అవసరాల కోసం ఉంచుకుంటారు. వరి సాగు అధికంగా ఉండే సిద్దిపేట, మెదక్, కరీంనగర్, సంగారెడ్డి ఇతర ప్రాంతాల్లో సన్న వడ్ల సాగు నామమాత్రమే. సన్న రకం వరిని సాగు చేస్తే ఖరీఫ్ సీజన్‌లో విపరీతంగా తెగుళ్ల బెడద ఉంటుంది. పంట దిగుబడి వచ్చే లోపు ఐదారు సార్లు పురుగు మందుల్ని పిచికారి చేయాలి. దోమకాటు వస్తే



పంటంతా దెబ్బతింటుంది. దిగుబడులు ఎకరాకు 20 బస్తాలు కూడా రావు. పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ ఉన్నందున్నే రైతులు సన్నాల సాగుకు దూరమయ్యారు. గతంలోనూ కేంద్రం, ఎఫ్‌సీఐ దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయబో మని తేల్చి చెప్పింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల్ని సాగు చేయాలని ప్రోత్సహించింది. కొందరు సాగు చేసినా కొనుగోళ్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

బోనస్ భారం తగ్గించుకునేందుకేనా..?

క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే యాసంగి సీజన్ ధాన్యం దిగుబడులు వచ్చాయి. రైతులు బోనస్ ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నుంచి ఇస్తామని ప్రకటించింది. ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి బోనస్ కేవలం సన్న రకాలు పండిస్తేనే ఇస్తామంటూ సెలవిచ్చారు. రాష్ట్రంలో ఏటా 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. కోటీ లక్షల టన్నుల వరకు ధాన్యం దిగుబడులొస్తాయి. ఈ లెక్కన బోనస్ ఇవ్వాల్సి వస్తే ఏటా రూ.5 నుంచి 7 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది. ఇంత భారాన్ని మోయలేని పరిస్థితుల్లోనే సీఎం కేవలం సన్నాలకే ఇస్తామని మాట మార్చినట్టు విపక్షాలు, రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. రైతులు పండించే సన్న వడ్లను వ్యాపారులు, మిల్లర్లు పోటీ పడి ఎక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వానికి అమ్మేది తక్కువే ఉంటది. పది ఇరవై లక్షల టన్నులకు బోనస్ ఇవ్వాల్సి వస్తే వెయ్యి కోట్లతో పనైపోతుందని సీఎం బావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఖరీఫ్ సాగుపై అస్పష్టత

ముందస్తు రుతుపవనాలు వస్తాయని చెప్పడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వివిధ రకాల పంటలేసుకునేందుకు దుక్కులు దున్ని విత్తనాలు సమకూర్చుకునే పనిలో పడ్డారు. ఇంతలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో రాష్ట్రంలోని రైతుల్లో అస్పష్టత నెలకొంది. సంగారెడ్డి జిల్లాలో వరి 1.50 లక్షల ఎకరాల్లో, మెదక్ జిల్లాలో 3.27 లక్షల ఎకరాల్లో, సిద్దిపేట జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇందులో 90 శాతం దొడ్డు రకం వరినే సాగు చేస్తారు. సీఎం ప్రకటన వల్ల బోనస్ రాదనే గుబులుతో సన్నరకం సాగు చేయాలా..? దొడ్డు రకం వేయాలా..? అనే గందరగోళంలో రైతులున్నారు.

వడ్లకు బోనస్ ఇవ్వాలి: ఆముదాల మల్లారెడ్డి, సిద్దిపేట జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి

రైతులు పండించే అన్ని రకాల వరి ధాన్యానికీ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలి. సన్న రకాలకే బోనస్ ఇస్తామని చెప్పడం సరైందికాదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ వేరు సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు వేరుగా ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలయ్యాక మాట మార్చడం భావ్యం కాదు. 90 శాతం పండించే దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వబోమని చెప్పడమంటే రైతుల్ని విస్మరించడమే అవుతుంది. అందరికీ ఇస్తామని సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి.

సర్కారు డైలమా..?

(మొదటిపేజీ తరువాయి)

ఓటింగ్‌తో ఒకవేళ బీజేపీకి ఎంపీ సీట్లు పెరిగితే మరికొంత కాలం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన పొడించే అవకాశముందనే ప్రచారం జరుగుతున్నది. స్థానిక ఎన్నికలను నిర్వహించాలా? మరికొంత కాలం ప్రత్యేక అధికారుల పాలన పొడిగించాలా? అనే అంశంపైనా శనివారం జరిగే రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో చర్చ జరిగే అవకాశముందని తెలుస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో ఆగస్టు మొదటి వారం కల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తికావాలి. అయితే, లోక్‌సభ, ఆ వెంటనే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో మరికొంత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి. కాగా, రాష్ట్రంలో కులగణన చేసి ఎన్నికలకు వెళ్తే బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశముందనీ, ఆ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ రాష్ట్రంలో బలంగా వినిపిస్తున్నది. ఒకవేళ లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకుంటే బీసీ కులగణన అంశాన్ని తెరపైకి తెచ్చి మరింత కాలం స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందనే చర్చ నడుస్తున్నది. ఆ గ్యాపులో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీ, తదితర ప్రజాకర్షణ పథకాలు అమలు చేసిన తర్వాత రాష్ట్ర సర్కారు ఎన్నికలకు వెళ్లే సూచనలున్నాయి. రిజర్వేషన్లతో పాటు పథకాల అమలు పెంపు ద్వారా స్థానికపోరులో లబ్ది పొందే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఆ పార్టీకి అనుకూల ఫలితాలు వస్తే జూలైలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే సూచనలున్నాయి. అయితే, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చనీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం హార్డ్‌కోర్‌గా పనిచేసిన స్థానిక నాయకులను గుర్తించి ప్రోత్సహిస్తూ వారిని ఎన్నికలకు సన్నద్ధం చేయాలని టీపీసీసీ ఇప్పటికే రాష్ట్ర శ్రేణులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అనేది లోక్‌సభ ఎన్నికల ఫలితాలపైనే ఆధారపడి ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అంతర్గతంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు సమాచారం. ఎన్నికలు జూలైలోనే నిర్వహిస్తే గత ఎన్నికల్లో అనుసరించిన మాదిరిగానే పాత రిజర్వేషన్లనే కొనసాగించే అవకాశముంది.

భారత క్రికెట్ సీనియర్ మెన్స్ జట్టు చీఫ్ కోచ్ పదవి రేసు మరింత ఆసక్తికరంగా మారుతుంది. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ స్టిఫెన్ ఫ్లెమింగ్, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్ సహా జస్టిన్ లాంగర్, ఆశీష్ నెహ్రాల పేర్లు ఇప్పటివరకు వినిపించాయి. గ్యారీ కిర్‌స్టన్ తర్వాత టీమ్ ఇండియాకు మళ్లీ విదేశీ కోచ్ ఖాయమే అనే అంచనాలు ఉన్నాయి. కానీ చీఫ్ కోచ్ రేసులోకి గౌతం గంభీర్ రాకతో సమీకరణాలు మారిపోయాయి. బీసీసీఐ పెద్దలే స్వయంగా గంభీర్‌ను సంప్రదించినట్టు సమాచారం. గంభీర్ సముఖత వ్యక్తం చేస్తే భారత జట్టు చీఫ్ కోచ్‌గా ఎంపిక కావటం లాంఛనమే!. భారత కొత్త చీఫ్ కోచ్ మూడున్నర సంవత్సరాల పాటు (జులై 2024-డిసెంబర్ 2027) వరకు కాంట్రాక్టుపై సంతకం చేయాల్సి ఉంటుంది. టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. వార్షిక వేతనం సుమారు రూ.8-10 కోట్ల వరకు ఉండే అవకాశం ఉంది.

చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్?

నవతెలంగాణ-ముంబయి

భారత మాజీ క్రికెటర్ గౌతం గంభీర్‌ను టీమ్ ఇండియా తదుపరి చీఫ్ కోచ్ పదవికి బీసీసీఐ తగిన వ్యక్తిగా భావిస్తుంది. ప్రస్తుత చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం ఈ ఏడాది 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తో ముగియనుంది. 2023 ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్‌తో రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం ముగియగా.. బీసీసీఐ అతడి పదవీ కాలాన్ని పొడగించిన సంగతి తెలిసిందే. పొట్టి ప్రపంచకప్ తర్వాత జట్టుతో పాటు కొనసాగేందుకు మిస్టర్ వాల్ విముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. చీఫ్ కోచ్‌గా కొనసాగేందుకు ఆసక్తి లేదని భారత క్రికెట్ పెద్దలకు సమాచారం ఇవ్వగా.. బీసీసీఐ ఇప్పుడు కొత్త కోచ్ వేటలో నిమగ్నమైంది. చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకునేందుకు మే 27 తుది గడువు.

గౌతీ నిర్ణయమే ఇక! : గౌతం గంభీర్‌కు అంతర్జాతీయ క్రికెట్‌లో కోచింగ్ అనుభవం లేదు. కానీ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రెండు ఫ్రాంచైజీలకు మెంటార్‌గా పని చేశారు. లక్నో సూపర్‌జెయింట్స్ మెంటార్‌గా రెండు సీజన్లు బాధ్యతలు చేపట్టాడు. 2022, 2023 సీజన్లలో లక్నో సూపర్‌జెయింట్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు మెంటార్‌గా వచ్చారు. ఐపీఎల్ చరిత్రలోనే కోల్‌కత నైట్‌రైడర్స్ తొలిసారి గ్రూప్ దశ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సాధించి ప్లే ఆఫ్స్‌లో అడుగు పెట్టింది. లక్నో సూపర్‌జెయింట్స్ నుంచి గౌతం గంభీర్ మారుతాడని ఎవరూ ఊహించలేదు. షారుక్ ఖాన్ పట్టుబట్టడంతో మాతృ ఫ్రాంచైజీ సహాయక సిబ్బంది బాధ్యతలు తీసుకున్నాడు. ఇప్పుడు బీసీసీఐ పెద్దలు టీమ్ ఇండియా చీఫ్ కోచ్ పదవి చేపట్టాలని కోరటంతో.. గౌతం గంభీర్ ఏం నిర్ణయం తీసుకుంటాడా అనే ఆసక్తి నెలకొంది. అరంగ్రేట ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2007 విజయంలో, 2011 ఐసీసీ వరల్డ్‌కప్ సాధించిన భారత జట్టులో గౌతం గంభీర్ కీలక సభ్యుడు. ఐపీఎల్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఏడు సీజన్లలో నాయకత్వం వహించగా అందులో ఐదుసార్లు ప్లే ఆఫ్స్‌కు చేర్చాడు. 2012, 2014 సీజన్లలో నైట్‌రైడర్స్‌ను ఐపీఎల్ విజేతగా నిలిపాడు. 2014 చాంపియన్స్ లీగ్ రన్నరప్‌గా నిలిచిన జట్టుకు సారథ్యం వహించాడు.

నైట్‌రైడర్స్ మెంటార్‌ను సంప్రదించిన బీసీసీఐ
మళ్లీ దరఖాస్తు చేసేందుకు ద్రవిడ్ నిరాసక్తి





నామమాత్రపు మ్యాచ్‌లో నికోలస్ పూరన్ (75, 29 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సులు) అదరగొట్టాడు. 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన నికోలస్ పూరన్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు భారీ స్కోరు అందించాడు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (55) అర్ధ సెంచరీతో రాణించాడు. ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. ముంబయి ఇండియన్స్ పదో పరాజయంతో సీజన్‌ను ముగించగా.. ఏడో విజయంతో లక్నో నిష్క్రమించింది.

పూరన్ ఫటాఫట్

ముంబయిపై లక్నో విజయం
లక్నో 214/6, ముంబయి 196/6

నవతెలంగాణ-ముంబయి

లక్నో సూపర్‌జెయింట్స్ ఊరట విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలు లేకపోయినా సీజన్లో ఏడో విజయంతో నిష్క్రమించింది. 215 పరుగుల ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. రోహిత్ శర్మ (68, 38 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సులు), నమన్ దిర్ (62 నాటౌట్, 28 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు) అర్ధ సెంచరీలతో మెరిసినా ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులే చేసింది. 18 పరుగుల తేడాతో లక్నో ఘన విజయం సాధించింది. అంతకముందు, నికోలస్ పూరన్ (75, 29 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సులు), కెఎల్ రాహుల్ (55, 41 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ సెంచరీలతో లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది.

పూరన్, రాహుల్ జోరు : సొంతమైదానం వాంఖడేలో నామమాత్రపు గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. లక్నో యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (0) డకౌట్‌తో సీజన్‌ను ముగించాడు. సీజన్‌లో పేలవ ఫామ్‌లో ఉన్న పడిక్కల్ ఎదుర్కొన్న బంతికే వికెట్ కోల్పోయాడు. మార్కస్ స్టోయినిస్ (28, 22 బంతుల్లో 5 ఫోర్లు) తొలి ఓవర్లోనే క్రీజులోకి వచ్చాడు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (55)తో కలిసి రెండో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. ఐదు ఫోర్లతో మెరిసిన స్టోయినిస్ ... పియూశ్ స్పిన్‌కు డగౌట్‌కు చేరాడు. పవర్‌ప్లేలో 49 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన లక్నో ఇన్నింగ్స్‌ను మందకొడిగా మొదలుపెట్టింది. దీపక్ హుడా (11) సైతం నిరాశపరిచాడు. రాహుల్ ఓ ఎండ్‌లో నిలబడినా ఆశించిన వేగంతో పరుగులు చేయలేదు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (75) ధనాధన్ దూకుడుతో రెచ్చిపోయాడు. వరుసగా బౌండరీలు బాదిన నికోలస్ పూరన్ 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. మరోవైపు రాహుల్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 37 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. ఫిఫ్టీ అనంతరం పూరన్ మరింత ప్రమాదకరంగా మారాడు. 8 సిక్సర్లతో విశ్వరూపం చూపించాడు. రాహుల్, నికోలస్ పూరన్ నిష్క్రమణతో సూపర్‌జెయింట్స్ 200 పరుగుల లోపే పరిమితం అయ్యేలా కనిపించింది. కానీ ఆయుశ్ బదోని (22 నాటౌట్, 10 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) మంచి ముగింపు అందించాడు. కృనాల్ పాండ్య (12 నాటౌట్)తో కలిసి ఆఖర్లో దంచికొట్టాడు. లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్ 2024

బ్యాంకాక్ : సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ థాయ్‌లాండ్ ఓపెన్ మెన్స్ డబుల్స్ సెమీఫైనల్లోకి చేరుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో 21-7, 21-14తో మలేషియా షట్లర్లపై ఏకపక్ష విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో నాల్గో సీడ్ తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జంట 21-15, 21-23, 21-19తో ఆరో సీడ్ దక్షిణ కొరియా షట్లర్లపై విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నారు. మెన్స్ సింగిల్స్‌లో క్వాలిఫయర్ లువాంగ్ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో నాల్గో సీడ్ కునాల్‌విట్ చేతిలో 12-21, 20-22తో పరాజయం పాలయ్యాడు.



వరుణుడే అడ్డంకి?

నేడు చెన్నైతో బెంగళూర్ ఢీ ప్లే ఆఫ్స్ బెర్త్ వేటలో అమీతుమీ

నవతెలంగాణ-బెంగళూర్ :

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) గ్రూప్ దశ మ్యాచులు ఆదివారంతో ముగియనున్నాయి. అయినా, ప్లే ఆఫ్స్ రేసు ఇంకా రసవత్తరంగానే సాగుతుంది. టాప్-4లో మూడు బెర్త్‌లు ఇప్పటికే ఖాయం అయ్యాయి. కోల్‌కత నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టాయి. నాల్గో స్థానం కోసం చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోటీపడుతున్నాయి. ప్లే ఆఫ్స్ బెర్త్ వేటలో నాకౌట్ సమరంగా మారిన ఈ ముఖాముఖి పోరుకు వర్షం ప్రమాదం పొంచి ఉంది. బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ జరుగనుండగా.. మ్యాచ్ రోజు ఇక్కడ భారీ వర్షం కురువనుందని వాతావరణ శాఖ తెలిపింది. వరుణుడు శాంతిస్తే చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోరు నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.



ఎవరి అవకాశాలు ఎలా? :

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : ప్లే ఆఫ్స్ రేసులో ఆర్సీబీకి మంచి అవకాశమే ఉంది. కానీ అందుకు కఠిన సవాల్ ఎదుర్కొవాలి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ తొలుత 200 పరుగులు చేస్తే కనీసం 18 పరుగుల తేడాతో విజయం సాధించాలి. ఇక చెన్నై సూపర్‌కింగ్స్ నిర్దేశించే లక్ష్యాన్ని డుప్లెసిస్ సేన మరో 11 బంతులు మిగిలి ఉండగానే ముగించాల్సి ఉంటుంది. అప్పుడే చెన్నై నెట్‌రన్‌రేట్‌ను ఆర్సీబీ అధిగమించి టాప్-4లోకి అడుగుపెడుతుంది. వర్షం కారణంగా ఓవర్లను కుదిస్తే ఆర్సీబీ సమీకరణాలు మరింత కష్టతరం అవుతాయి.

చెన్నై సూపర్‌కింగ్స్ : సూపర్‌కింగ్స్‌కు ఈ మ్యాచ్‌లో ఓడినా అవకాశాలు ఉన్నాయి. లక్ష్య ఛేదనలో తక్కువ వ్యత్యాసంతో ఓటమి చవిచూసినా మెరుగైన నెట్ రన్‌రేట్‌తో ప్లే ఆఫ్స్‌కు చేరనుంది. లక్ష్యాన్ని కాపాడుకుంటే.. ఆఖరు ఓవర్ వరకు నెట్టుకొస్తే సరిపోతుంది. ఇక మ్యాచ్‌లో విజయం సాధిస్తే సూపర్‌కింగ్స్ ఏకంగా టాప్-2లో నిలిచేందుకు సైతం పోటీపడనుంది. అందుకు సన్‌రైజర్స్, రాజస్థాన్ మ్యాచుల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది.

నాలుగు కాంస్య పతకాలు

ఎలోర్డా బాక్సింగ్ టోర్నమెంట్

అస్తానా : ఎలోర్డా బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు నాలుగు కాంస్య పతకాలు దక్కాయి. పురుషుల విభాగంలో నలుగురు బాక్సర్లు సెమీఫైనల్లోనే నిష్క్రమించారు. సోయిబం సింగ్ (48 కేజీలు), అభిషేక్ (67 కేజీలు) సెమీస్‌లో 3-4తో పోరాడి ఓడారు. విశాల్ (86 కేజీలు) 0-5తో పరాజయం పాలవగా..గౌరవ్ (92 కేజీలు) సైతం 0-5తో ఓటమి చెందాడు. ఈ నలుగురు సెమీఫైనల్ ఓటమితో కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. నేడు మహిళల విభాగంలో నిఖత్ జరీన్, మీనాక్షి, అనామిక, మనీశలు పసిడి పోరులో పంచ్ విసరనున్నారు.



నవచిత్రం

మనం.. స్పెషల్ షోస్‌కి రంగం సిద్ధం

అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ నటించిన క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మనం'. మే23, 2014న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద సంచలన విజయం సాధించడంతోపాటు తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యుత్తమ క్లాసిక్ మూవీగా నిలిచింది.

ఈ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ క్లాసిక్ ఎంటర్‌టైనర్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనెల 23న రెండు తెలుగు రాష్ట్రాలలో 'మనం' స్పెషల్ షోస్‌ని ప్రదర్శించబోతున్నారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌లో ఇప్పటికే బుకింగ్స్ ఓపెన్ చేశారు. ఈ మ్యాజికల్ అప్డేట్‌ని అన్నపూర్ణ స్టూడియోస్ సోషల్ మీడియాలో పంచుకుంటూ, "మనం' తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన చిత్రం. థియేటర్లలో మరోసారి సెలబ్రేట్ చేసుకుందాం' అని ట్వీట్ చేశారు.



అక్కినేని నాగేశ్వరరావు

"మనం నా మనసులో చాలా ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. 10 సంవత్సరాల వేడుకలను జరుపుకోవడానికి తిరిగి థియేటర్లలోకి తీసుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని హీరో నాగ చైతన్య ట్వీట్ చేశారు. ఈ సినిమా మరోసారి విడుదల అవుతుండటంతో సోషల్ మీడియా వేదికగా అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ ట్వీట్ల వర్షం కురిపించారు.

అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతిష్టాత్మక నిర్మాణంలో, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అక్కినేని మూడు తరాల హీరోలు కలసి తెరపై కనిపించడం ప్రేక్షకుల మనసులో చేరగని ముద్ర వేసింది. పదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులని ఈ సినిమా మరోసారి మెస్మరైజ్ చేయనుంది.

థ్రిల్ చేసే హిట్ లిస్ట్



తమిళ డైరెక్టర్ విక్రమన్ కొడుకు విజయ్ కనిష్క హీరోగా సముద్రఖని, శరత్ కుమార్, గౌతమ్ వాసుదేవ మీనన్ ముఖ్యపాత్రల్లో నటించిన సినిమా హిట్ లిస్ట్.

సూర్య కతిర్ కాకల్లార్, కే.కార్తికేయన్ దర్శకత్వంలో ఆర్.కె.సెల్యులాయిడ్స్ పై డైరెక్టర్ కె.ఎస్.రవికుమార్ నిర్మిస్తున్న సినిమా ఇది. గతంలో రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్లు సినిమా పై అంచనాలను పెంచాయి.

శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను హీరో సూర్య లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చాలా బాగుంది. సినిమా ఇంకా బాగుంటుందని ఆశిస్తున్నాను. ఖచ్చితంగా ఈ సినిమా విజయ్ కనిష్కకి, ఈ టీమ్‌కి మంచి సక్సెస్ ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. యాక్షన్, సస్పెన్స్, క్రైమ్ జోనర్‌లో వస్తున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే అందరినీ అలరిస్తోంది. ప్రస్తుతం ప్రేక్షకుల్ని ఎక్కువగా క్రైమ్, సస్పెన్స్ జోనర్ మూవీస్ బాగా ఎట్రాక్ట్ చేస్తున్నాయి. ఇది కూడా ఆ జోనర్‌లోకి రావడం, అదే విధంగా టీజర్ సినిమా పై అంచనాలను పెంచడంతో చిత్ర విజయంపై మరింత నమ్మకంగా ఉన్నాం అని చిత్ర బృందం తెలిపింది. శ్రీ శ్రీనివాస స్క్రీన్స్, శ్రీ శ్రీనివాస ఇన్ఫ్రా, బెక్కం ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నాయి.

మునిష్కాంత్ కింగ్స్ లే, సితార, స్మృతి వెంకట్, రామచంద్ర రాజు (కే జి ఎఫ్ గరుడ), రామచంద్రన్, ఐశ్వర్య దత్త, అభి నక్షత్రం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ : జాన్ అబ్రహం, మ్యూజిక్ : సి.సత్య, డి ఓ పి : కే. రామ్ చరణ్, కథ : ఎస్.దేవరాజ్, దర్శకత్వం : సూర్య కతిర్ కాకల్లార్, కే.కార్తికేయన్.



విజయ్ సేతుపతి

సరికొత్త క్రైమ్ కామెడీ థ్రిల్లర్

విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ లీడ్ రోల్స్‌లో ఆరుముగ కుమార్ దర్శకత్వంలో ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. యోగి బాబు, పి.ఎస్.అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రానికి 'ఏసీఈ' అనే డిఫరెంట్ టైటిల్‌ని ఖరారు చేశారు. కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని 7సిస్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రాండ్‌గా నిర్మిస్తుంది. స్టార్ కాస్ట్, ఆకట్టుకునే నేపథ్య సంగీతం, విజయ్ సేతుపతి ఆన్ స్క్రీన్ ప్రెజెన్స్‌ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా టీజర్ అభిమానులను ఆకట్టుకుంది. జూదం, తుపాకులు, పేలుళ్లు, రాబరీస్, బైక్ ఛేజింగ్ వంటి అంశాలు అలరించాయి. ఇది హిలేరియస్ క్రైమ్-కామెడీ థ్రిల్లర్‌గా ఉంటుందని తెలియజేస్తుంది. ఈ విజువల్ గ్లింప్స్, టైటిల్ ప్రివ్యూ, జస్టిన్ ప్రభాకరన్ కంపోజ్ చేసిన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పాటు యానిమేటెడ్ ఫార్మాట్‌లో పాత్రల ముఖ్యమైన అంశాలు రివీల్ చేయడంతో ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఏడాది విజయ్ సేతుపతికి ఇది రెండో సినిమా కావడంతో అంచనాలు భారీగా పెరిగాయి.

కన్నప్పలో కీలక పాత్ర

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ఈ సినిమా నుంచి వస్తున్న ప్రతీ ఒక్క అప్డేట్ సినిమాపై భారీ అంచనాలు పెంచేస్తోంది. రీసెంట్‌గా బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకోవడం, ఆ తరువాత ప్రభాస్ సెట్‌లోకి రావడం.. ఇలా ప్రతీ ఒక్క అప్డేట్‌తో ఈ సినిమా నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతూనే వస్తోంది. తాజాగా 'కన్నప్ప'కు సంబంధించిన మరో అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తోంది. ఇప్పటికే విష్ణు మంచు, కాజల్ కాంబో 'మోసగాళ్లు' మూవీని చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి మంచు విష్ణు టైటిల్ రోల్‌లో చేస్తోన్న ఈ చిత్రంలో కాజల్ ఓ కీ రోల్‌ను పోషిస్తుండటం విశేషం.

డా.మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని ఎక్కువగా న్యూజిలాండ్‌లోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈనెల 20న కేన్స్‌లో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేయబోతున్నారు.



కాజల్



స్నేహ మాలవ్య, పవన్‌కుమార్

యావరేజ్ స్టూడెంట్ నాని

"మెరిసే మెరిసే' చిత్రంతో పవన్ కుమార్ కొత్తూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఆ సినిమాతో విమర్శకులు, ఆడియెన్స్ ప్రశంసలు కూడా అందుకున్నారు. అయితే ఈ దర్శకుడు ఇప్పుడు హీరోగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యారు. 'యావరేజ్ స్టూడెంట్ నాని' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా, నిర్మాతగానూ ఆయన ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ కొత్తూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ యూత్‌ఫుల్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రమోషన్స్‌ను చిత్రయూనిట్ ప్రారంభించింది. శుక్రవారం ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ బోల్డ్ అండ్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే హీరో, హీరోయిన్ల మధ్య ఎలాంటి కెమిస్ట్రీ ఉంటుందో అర్థమవుతోంది. స్నేహమాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్‌లు హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు. ఝాన్సీ, రాజీవ్ కనకాల, ఖలేజా గిరి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచయిత, దర్శకుడు: పవన్ కుమార్ కొత్తూరి, నిర్మాతలు: పవన్ కుమార్ కె, బిషాలి గోయెల్, సంగీతం: కార్తీక్ బి కొడకండ్ల, డిఓపి : సజీష్ రాజేంద్రన్, ఎడిటర్: ఉద్ధవ్, కొరియోగ్రఫీ : రాజు మాస్టర్, ఫైట్స్: నందు.

డర్టీ ఫెలో రిలీజ్‌కి రెడీ

శ్రీమతి గూడూరు భద్ర కాళీ సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై శాంతి చంద్ర, దీపిక సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరో, హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.యస్.బాబు నిర్మించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఈ సినిమా ఈనెల 24న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సంస్థ కార్యాలయంలో దర్శకుడు మల్లిడి వశిష్ఠ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అలాగే ఈ సినిమా సాంగ్స్ మధుర ఆడియో ద్వారా మార్కెట్లో రిలీజ్ అయ్యాయి.



శాంతి చంద్ర, వశిష్ఠ

దర్శకులు మల్లిడి వశిష్ఠ మాట్లాడుతూ,'శాంతిచంద్ర హీరోగా నటించిన ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ఈనెల 24న రిలీజ్ అవుతున్న ఈ సినిమా మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'మా డర్టీఫెలో సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసి, టీమ్‌ని అభినందించిన మల్లిడి వశిష్ఠకి ధన్యవాదాలు. ఈ సినిమా గ్రాండ్ లెవెల్‌లో రిలీజ్ అవుతుంది. ఇటీవల మధుర ఆడియో ద్వారా రిలీజ్ అయిన అన్ని పాటలు మంచి రెస్పాన్స్‌ను సొంతం చేసుకున్నాయి. సినిమా అందరినీ ఆకట్టు కుంటుంది' అని హీరో శాంతిచంద్ర చెప్పారు.

దర్శకులు మూర్తి సాయి ఆడారి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి' అని అన్నారు. ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ : ఆడారి మూర్తి సాయి, డి.ఓ.పి : రామకృష్ణ.యస్., మ్యూజిక్: డాక్టర్. సతీష్ కుమార్.పి., ఎడిటర్ : జేపీ, ఫైట్స్ : శంకర్, కొరియోగ్రఫీ : కపిల్, ఈశ్వర్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నాటుసారా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు

- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిరంతరం నిఘా: ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ. శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నాటుసారా అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఈ. శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డితో కలిసి అబ్కారీ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నాటుసారా తయారీని మూడు నెలల్లో పూర్తిగా అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో నాటుసారాపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పూర్తిగా నిర్మూలించినప్పటికీ ఇటీవల జరిపిన దాడుల్లో తెలంగాణ వ్యాప్తంగా 26 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దీన్ని తయారు చేస్తూ అమ్ముతున్నట్టు తేలిందన్నారు. ఈ మహమ్మారి వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్న నేపథ్యంలో నాటు సారా తయారీ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గుట్టు చప్పుడు కాకుండా రవాణా అవుతున్న నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలని ఆదేశించారు. ఫంక్షన్ హాళ్లు, ఫామ్‌హౌజుల్లో జరిగే పార్టీలలోనూ సగం మద్యాన్ని మద్యం దుకాణాల్లో తీసుకుని మిగిలిన సగం మద్యాన్ని నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను వినియోగిస్తున్నారనే ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వేసవిలో బీర్లు స్టాక్ లేదనే వార్తలు వస్తున్నాయనే వార్తల్లో నిజం లేదన్నారు. రికార్డులు పరిశీలిస్తే గత సంవత్సరం కంటే ఎక్కువ నిల్వలున్నట్టు లెక్కలు చెబుతున్నాయని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో దాడులు నిర్వహించి స్టాక్ రికార్డులను పరిశీలించి బీర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కల్తీ కల్లు తయారీకి వినియోగించే సీహెచ్, అలం, డెజోఫాం లాంటి మత్తు పదార్థాలను పట్టుకోవాలని సూచించారు. గంజాయి, నార్కోటిక్, ఇతర మత్తు మందుల తయారీ, దిగుమతి, అమ్మకాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అబ్కారీ శాఖ ఏసీలు, డీసీలు, డీపీఇఓలు తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై హైకోర్టుకు జూనియర్ ఎన్టీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 2007లో స్థలం కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టిన ఇంటిపై బ్యాంకులకు హక్కులు ఉన్నాయని డీఆర్‌టీ (రుణ వసూళ్ల ట్రైబ్యునల్) ఇచ్చిన తీర్పును సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టులో సవాల్ చేశారు. బ్యాంకులకు అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలంటూ ఆయన తరఫున జీపీఏ హోల్డర్ కె.రాజేశ్వరరావు పిటిషన్ వేశారు. దీనిని గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 881 చదరపు గజాల స్థలాన్ని సుంకు గీత అనే మహిళ నుంచి 2007లో జూనియర్ ఎన్టీఆర్ కొనుగోలు చేసి చట్ట ప్రకారం అన్ని అనుమతులు పొందాక ఇంటి నిర్మాణం చేపట్టారని ఆయన తరపు న్యాయవాది తెలిపారు 1996లోనే ఈ స్థలాన్ని తనఖా పెట్టి ఇంటి జాగాపై రుణం పొందారనీ, రుణం చెల్లించని కారణంగా ఆ ఆస్తిపై హక్కులు తమవేనని పేర్కొంటూ ఎస్‌బీఐ, ఓబీసీ, ఇండస్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు నోటీసులు ఇచ్చాయని చెప్పారు.ఈ నోటీసులను సవాలు చేస్తూ పిటిషనర్ డీఆర్‌టీని ఆశ్రయించారనీ, దీనిపై సమగ్ర వివరాలు పరిశీలన చేయకుండానే డీఆర్‌టీ ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్థలాన్ని అమ్మిన వారిపై కేసు పెట్టినట్టు తెలిపారు. అయితే డీఆర్‌టీ డాకెట్ ఆదేశాలు అందాల్సి ఉందనీ, కొంత సమయం ఇస్తే వాటి వివరాలు వచ్చే వారానికి సమర్పిస్తామని తెలిపారు. దీనిపై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. జూన్ 3లోగా డీఆర్‌టీ డాకెట్ ఉత్తర్వులను సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను జూన్ 6కు వాయిదా వేసింది.

బెంగళూరులో డెంగ్యూ విజృంభణ

హైఅలర్ట్ ప్రకటించిన నగర పాలక సంస్థ

బెంగళూరు : కర్ణాటకలోని బెంగళూరు మహానగరంలో డెంగ్యూ కేసులు అంతకంతకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ ప్రకటించినట్లు బృహత్ బెంగళూరు మహానగర పాలిక సంస్థ కమిషనర్ వికాస్ కిషోర్ వెల్లడించారు. డెంగ్యూ వైరస్ విస్తరించకుండా నివారణ చర్యలు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి మే 13వ తేదీ మధ్య డెంగ్యూ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయని చెప్పారు. ఇటీవల నగరంలో భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ వల్ల డెంగ్యూ వైరస్ వ్యాపించిందన్నారు. ఈ నెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు నగర ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బెంగళూరు మహానగరంలోనే కాకుండా కర్ణాటక అంతటా డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 2,877 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో 1,725 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి.

ఢిల్లీ మద్యం కేసులో నిందితురాలిగా ఆప్

ఈడీ అనుబంధ చార్జిషీట్



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్‌ను ఇడి నిందితురాలిగా చేరింది. ఈ మేరకు శుక్రవారం ఇడి మరో అనుబంధ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసింది. ఇందులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్‌ఆద్మీ పార్టీ ని నిందితులుగా పేర్కొంది.ఈ కేసులో ఇడి దాఖలు చేసిన ఎనిమిదో ఛార్జిషీట్ ఇది. అయితే, ఈ కేసులో కేజ్రీవాల్‌పైనా, ఆప్‌పైనా ఇడి అభియోగాలు మోపడం ఇదే తొలిసారి. ఈ కేసులో ఇప్పటివరకు 18 మందిని ఇడి అరెస్టు చేసింది. ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్ కీలక పాత్ర పోషించారు. ఈ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ. 100 కోట్ల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీ 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించింది. ఆ సమయంలో కేజ్రీవాల్ బస చేసిన ఒక స్టార్ హోటల్ బిల్లులను ఈ కేసుకు సంబంధించిన నిందితుడు చెల్లించినట్లు మా వద్ద సాక్ష్యాలున్నాయి' అని ఇడి తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ క్రమంలోనే కేజ్రీవాల్, ఆప్‌పై ఇడి తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. త్వరలోనే పార్టీకి చెందిన కొన్ని ఆస్తులను అటాచ్ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

అరెస్టు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్..

మరోవైపు, తనను ఇడి అరెస్టు చేయడాన్ని, జ్యుడీషియల్ కస్టడీని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు రిజర్వ్ చేసింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చని కేజ్రీవాల్‌కు సూచించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం కేజ్రీవాల్‌కు జూన్ 1వ తేదీ వరకు మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మంజూరుచేసిన సంగతి తెలిసిందే. జూన్ 2వ తేదీన ఆయన తిరిగి జైలుకు వెళ్లాలని స్పష్టంచేసింది.

తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ పూర్తి చేసి, తీర్పును రిజర్వు చేసింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ఇడి తరఫున సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు బెంచ్ ముందు వాదనలు వినిపించారు. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వు చేశాం. అప్పీల్‌దారు చట్టానికి అనుగుణంగా బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లొచ్చు" అని ధర్మాసనం పేర్కొంది.

ఏపీ ఎన్నికల హింసపై సిట్

ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మందితో కమిటీ

- దర్యాప్తు ప్రారంభం
- నేటి సాయంత్రానికి నివేదిక
- నిర్లక్ష్యపు అధికారులపై కేసు నమోదు
- కీలక నేతలను అరెస్టుచేసే అవకాశం

అమరావతి : ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వం వహించనున్నారు. మరో 13 మంది పోలీస్ అధికారులను ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. పోలింగ్ రోజు, ఆ తరువాత రోజుల్లోనూ రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం, కొందరు అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, సిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు కసరత్తు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రానికి సిట్‌ను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించడం, సిట్ ఏర్పాటు సమయానికే దాదాపుగా ఒక రోజు గడిచిపోవడంతో, ఏర్పాటు ప్రకటన వెలువడిన వెంటనే సిట్ సభ్యులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. శనివారం సాయంత్రానికి సాధ్యమైనంత వేరకు నివేదిక ఇవ్వడం లక్ష్యంగా సిట్ పని చేస్తోంది. దానికి వీలుగానే ఘర్షణలు జరిగిన ప్రాంతాలకు చెందిన పోలీస్ అధికారులకు సైతం సిట్‌లో స్థానం కల్పించారు. పల్నాడు, మాచర్ల, నరసరావుపేట, తిరుపతి, తాడిపత్రి ఘటనలపై సిట్ విచారణ జరపనుంది. తాజాగా విశాఖలో జరిగిన ఘటననూ సిట్ పరిధిలోకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. సిట్ ఇచ్చే వివరాల ఆధారంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే ఉద్యోగాల నుండి తొలగించే అవకాశమూ ఉందని సీనియర్ అధికారులు తెలిపారు. ముఖ్యంగా. తాడిపత్రి ఘటనలో డిఎస్‌పి చైతన్య తన పరిధి దాటి వ్యవహరించారన్న అభిప్రాయం పోలీస్ ఉన్నతాధికారుల్లో వ్యక్తమవుతోంది. దీనిపై సిట్ ఎలా స్పందిస్తుందో చూడాల్సిఉంది. హింసకు కారణమైన ముఖ్య నాయకులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం. సిట్‌కు విచారణ సమయంలో పూర్తిస్థాయి అధికారాలు కల్పించారు. గుర్తించిన అంశాల ఆధారంగా అవసరమైతే కొత్తగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు అధికారం ఇచ్చారు.

సిట్ వీరితో...

నేతృత్వం	: ఐజి వినీత్ బ్రిజ్‌లాల్
	సభ్యులు
రమాదేవి	: ఎస్‌పి, ఎసిబి
సౌమ్యలత	: అదనపు ఎస్‌పి. ఎసిబి
రమణమూరి	: డిఎస్‌పి, ఎసిబి శ్రీకాకుళం
పి.శ్రీనివాసులు	: డిఎస్‌పి సిఐడి
పల్లూరి శ్రీనివాసరావు	: డిఎస్‌పి ఎపిబి ఒంగోలు
రవి మనోహర ఆచారి	: డిఎస్‌పి, ఎసిబి తిరుపతి
వి. భూషణం	: ఇన్‌స్పెక్టర్ , గుంటూరు రేంజ్
కె. వెంకటరావు	: ఇన్‌స్పెక్టర్ ఇంటెలిజెన్స్‌విశాఖ
రామకృష్ణ	: ఇన్‌స్పెక్టర్, ఎసిబి
జిఐ శ్రీనివాస్	: ఇన్‌స్పెక్టర్, ఎసిబి
మోయిన్	: ఇన్‌స్పెక్టర్ ఒంగోలు
ఎన్. ప్రభాకర్	: ఇన్‌స్పెక్టర్, ఎసిబి, అనంతపురం
శివప్రసాద్	: ఇన్‌స్పెక్టర్, ఎసిబి

కౌంటింగ్ తరువాత కూడా..!

హింసాత్మక ఘటనలు కౌంటింగ్ తర్వాత కూడా రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చెలరేగే అవకాశం ఉందని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరించాయి. ఈ మేరకు తగు భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాయి. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతీకార దాడులు పెద్దఎత్తున జరిగే అవకాశం ఉందని తెలిపింది. పల్నాడు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని నిఘా సంస్థలు సూచించాయి.

సివిల్ సప్లయ్ శాఖలో అవినీతి

ధాన్యం కొనుగోళ్లలో పెద్ద కుంభకోణం

- త్వరలో ఆధారాలతో సహా బయటపెడతాం
- రూ.500 బోనస్ బోగస్ మాటలే : బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్ల విషయంలో పౌర సరఫరాల శాఖలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నదనీ, త్వరలో ఆధారాలతో సహాయ బయటపెడతామని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. అదో పెద్ద కుంభకోణమని ఆయన ఆరోపించారు. క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న సీఎం మాటలు బోగస్ మాటలుగా మారాయని విమర్శించారు. సన్నధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. సన్నాలకే కాదు దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కోమటిరెడ్డి, జగ్గారెడ్డి లాంటోళ్లు మాట్లాడితే స్పందించాల్సిన అవసరం తమకు లేదన్నారు. కాంగ్రెస్‌ది ఎప్పుడు పడిపోతుందో తెలియని ప్రభుత్వమనీ, తమతో చాలా మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మరోమారు బాంబు పేల్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల్ శంకర్, పి.రాకేశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులను మోసం చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించితే నేడు రేవంత్‌రెడ్డి సర్కారు అంతకంటే ఎక్కువ మోసం చేస్తున్నదని విమర్శించారు. 45 రోజులుగా కల్లాల్లో ధాన్యం పెట్టుకుని రైతులు ఎదురు చూస్తున్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదని నిలదీశారు. రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల దగ్గర కాపలా కాస్తూ రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ, అకాల వర్షాలతో తిప్పలుపడుతూ కొందరు పిడుగుపాటుతో మరణించిన ఘటనలు కూడా ఉన్నాయని వివరించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత తాలు, తేమ పేరుతో మిల్లర్లు ఇష్టానుసారంగా బస్తాకు నాలుగు కేజీలు తరుగు తీయడమేంటని ప్రశ్నించారు. కాంటా వేసిన ధాన్యానికి రసీదు ఇవ్వాలనీ, రైస్ మిల్లులకు పోయిన ధాన్యానికి సైతం రైస్ మిల్లర్లు తరుగు ఎలా తీస్తారని నిలదీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి కోట్లాది రూపాయలు లంచాల రూపంలో చేతులు మారుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఈ మాఫియాను నడిపిస్తున్నదెవరు? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కనీసం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన రైతుబంధును రాష్ట్ర ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో వేయలేదనీ, మరోవైపు ఐదెకరాల లోపు ఉన్న వారికే రైతు బంధు ఇస్తామని పరిమితులు పెట్టి లీకులివ్వడం దారుణమని చెప్పారు. రైతు రుణమాఫీ చేయలేదనీ, రైతు కూలీలు, కౌలు రైతులకు రూ. 12 వేలు ఇవ్వలేదనీ, రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని తప్పుడు లెక్కలు చెబుతోందని విమర్శించారు. వర్షాల నేపథ్యంలోని కల్లాల్లోని ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించేదాకా తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామనీ, త్వరలోనే కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతామని చెప్పారు. సినిమా డైలాగులకు పరిమితం కాకుండా ఎంత మంది మిల్లర్లపై కేసులు పెట్టారు? ఎంత మందిపై చర్యలు తీసుకున్నారు? అనే దాని గురించి చెప్పాలని ప్రశ్నించారు.

దత్త పుత్రికను తండ్రికి అప్పగించండి : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దత్తత తీసుకున్న బాలికను చట్టవిరుద్ధంగా తీసుకెళ్లడం చెల్లదని శిశు సంక్షేమ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు హైకోర్టు తేల్చి చెప్పింది. బాలికను తక్షణం తండ్రికి అప్పగించాలని ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తన రెండున్నరేండ్ల దత్త పుత్రికను బలవంతంగా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తీసుకువెళ్లారంటూ మలక్‌పేటకు చెందిన అరుణ్ కుమార్ గుప్త, బాలిక తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. బాలికను 2021 జులై 27న చట్టప్రకారం అరుణ్‌కుమార్ దత్తత తీసుకుంటే, శిశు సంక్షేమశాఖకు అధికారులు ఇద్దరు వచ్చి తాము బాల రక్షకులమని చెప్పుకుని ఇద్దరు కానిస్టేబుళ్ల సాయంతో ఇంట్లోకి చొరబడి బాలికను తీసుకువెళ్లిపోయారని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. చట్ట వ్యతిరేకంగా బాలికను తీసుకువెళ్లారనీ, తిరిగి బాలికను అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, పరిహారంగా రూ.10 లక్షలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ వద్ద అనధికారికంగా బాలిక ఉందన్న ఫిర్యాదు మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారంటూ ప్రభుత్వం తరపు న్యాయవాది ప్రతివాదనలో చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, అధికారులు చెబుతున్న నిబంధనల ప్రకారం సంరక్షకులు అసమర్థులని భావించినప్పుడు బాలికను వారి సంరక్షణలోకి తీసుకోవచ్చుననీ, అయితే అసమర్థులని నిరూపించేందుకు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. పిటిషనర్‌పై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు అధికారులకు అడ్డంకి కాబోదని చెప్పింది. అధికారుల నుంచి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలనే వ్యవహారంలోకి తాము వెళ్లడం లేదనీ, బాలిక స్వేచ్ఛ వరకే పరిమితమైనట్టు ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపింది. పరిహారం కావాలని పిటిషనర్ భావిస్తే చట్ట ప్రకారం సివిల్ కోర్టులో తేల్చుకోవచ్చునని స్పష్టం చేసింది. పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించింది.


భూ కేటాయింపు చట్టబద్ధమే : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆనంద్ సినీ సర్వీసెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి టీ.హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టేసింది. సినిమా పరిశ్రమను ప్రోత్సహించే క్రమంలో భాగంగానే ఆనంద్ సినీ సర్వీసెస్‌కు కేటాయింపు చేశారని న్యాయస్థానం పేర్కొంది. 2008లో జీవో 355 జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. గతంలో సినీ పరిశ్రమ అభివృద్ధి నిమిత్తం పలు సంస్థలకు ప్రభుత్వం భూ కేటాయింపులు చేసిందని తీర్పులో గుర్తుచేసింది.

ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపట్టాలి

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టిగ్లా వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ విద్య, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు (బోధన, బోధనేతర) సాధారణ బదిలీలు చేపట్టాలని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య, ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణగౌడ్ వినతిపత్రం సమర్పించారు. ఐదేండ్లుగా బదిలీలు జరగకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. బదిలీలతో ఉద్యోగులకు వ్యక్తిగత అవసరాలతోపాటు వృత్తి నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. 2018, జూన్ చివరలో ఇంటర్ విద్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. అప్పుడు దాదాపు 500 మంది ఉద్యోగుల బదిలీలతో న్యాయం జరిగిందని పేర్కొన్నారు. 2016, 2017లో జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు లభించాయని వివరించారు. కనీస సర్వీసు రెండేండ్లు ఉండడంతో వారికి బదిలీల అవకాశం రాలేదని తెలిపారు. ఇంకోవైపు ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్లకు పెంచడం, 317 జీవో అమలు చేయడం వల్ల ఉద్యోగుల కుటుంబాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 3,600 మంది కాంట్రాక్టు అధ్యాపకుల్లో 3,006 మంది సర్వీసులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని తెలిపారు. వారు పనిచేస్తున్న కాలేజీలోనే పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. వారికి బదిలీల్లేకపోవడం వల్ల దాదాపు 20 ఏండ్లుగా ఒకే కాలేజీలో పనిచేస్తున్నారని వివరించారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా 1,400 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారికి బదిలీలు చేపట్టకుండా ఆ ఫలితాలు ప్రకటించి నియామకాలు చేపడితే తీవ్ర నష్టం జరిగే అవకాశముందని పేర్కొన్నారు. జీరో సర్వీసుతో సాధారణ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

టీఎస్‌కు బదులుగా టీజీ : సీఎస్ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విభాగాలన్నీ ఇక నుంచి తెలంగాణను టీఎస్ బదులుగా టీజీగానే ప్రస్తావించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాహనాల రిజిస్ట్రేషన్లలో తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీజీగా పేర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో అధికారిక సమాచారాల్లో అంతటా టీజీగా ప్రస్తావించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు, అటానమస్ విభాగాలన్నింటిలోనూ వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టీజీ అనే పేర్కొనాలని ఉత్తర్వుల్లో సీఎస్ స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, వెబ్ సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలోనూ టీజీ ఉండాలన్నారు. టీఎస్ అని ముద్రించిన స్టేషనరీ, ప్రింటింగ్ మెటీరియల్‌ను తొలగించి.. టీజీతో కొత్తగా ముద్రించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులు అమలు చేసి ఈనెల 31 నాటికి సాధారణ పరిపాలన శాఖకు నివేదిక సమర్పించా లని వివిధ శాఖల కార్యదర్శులను సీఎస్ ఆదేశించారు.

జూన్ 10 నుంచి 13 వరకు పీజీఈసెట్ రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) రాతపరీక్షలు జూన్ ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు కాకుండా అదేనెల పది నుంచి 13 వరకు జరుగుతాయి. ఈ మేరకు పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్‌తోపాటు టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-1 రాతపరీక్షలు ఉండడంతో పీజీఈసెట్ రాతపరీక్షల తేదీలను మార్చామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://pgecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వచ్చే మూడ్రోజులు వర్షసూచన

- 139 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- 40 డిగ్రీల లోపే పగటిపూట ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలున్నాయి. రాష్ట్రంలో శుక్రవారం రాత్రి పది గంటల వరకు 139 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటలో అత్యధికంగా 7.6 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. ములుగు, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, కొమ్రం భీమ్, జోగులాంబ గద్వాల, కరీంనగర్, హన్మకొండ, పెద్దపల్లి, మంచిర్యాల, సూర్యాపేట, కామారెడ్డి, వనపర్తి, జనగాం, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. రాష్ట్రంలో శుక్రవారం పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల లోపే నమోదయ్యాయి. పదేండ్లలో మే నెల ద్వితీయార్ధంలో పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల లోపు నమోదు కావడం ఇదే తొలిసారి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా 39.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. చాలా జిల్లాల్లో 35 డిగ్రీల లోపే నమోదు కావడం గమనార్హం.

తాగునీటి సరఫరా బాధ్యత అధికారులదే : ఎస్‌కే సుల్తానీయా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తాగునీటిని అందించాల్సిన బాధ్యత అధికారులదేనని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా అన్నారు. నిర్వహణా సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ మిషన్ భగీరథ రాష్ట్ర కార్యాలయంలో తాగునీటి సరఫరా, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా జరగాలని చెప్పారు. బాధ్యతతో భగీరథ ఇంజినీర్లు వ్యవహరించాలని సూచించారు. అలక్ష్యం చేయరాదనీ, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక వనరులను ఉపయోగించడం ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని వివరించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, స్కీమ్ బోర్లు తదితర గ్రామ మౌలిక సదుపాయాలను మరమ్మతు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసుకుంటూ చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ కృపాకర్‌రెడ్డితోపాటు సీఈలు, ఈఎస్‌లు, ఈఈలు పాల్గొన్నారు.

ఒడిశాలో డిప్యూటీ సీఎం భట్టి ఎన్నికల ప్రచారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఒడిశా రాష్ట్రంలో మూడు రోజులు బిజీబిజీగా గడిపారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచార క్యాయింపెన్‌లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి ఢిల్లీ వెళ్లి ఆయన బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీతో ప్రత్యేక విమానంలో ఒడిశాకు చేరుకున్నారు. బోలాంగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీతోపాటు భట్టి ప్రసంగించారు. అదేరోజు రాహుల్‌తోపాటు ఆయన చేరుకున్నారు. గురువారం మళ్లీ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చేరుకుని స్థానిక పీసీసీ నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియా నిర్వాహకులతో ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. శుక్రవారం ఫుల్బని పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఒడిశా పీసీసీ అధ్యక్షులు శరత్ పట్నాయక్, ఏఐసీసీ నాయకులు భక్త చరణ్‌దాస్, ఆర్‌సీ. కుంతియాలతో కలిసి డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. మొదటి దశలో ఆ రాష్ట్రంలోని రాయఘడ్, భువనేశ్వర్, కేరళలోని పాల్‌ఘాట్ జిల్లాలోని అలత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఆయన పర్యటించిన సంగతి తెలిసిందే.

రాష్ట్రంలో శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్లు : మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టెస్కో ద్వారా వాటిని ఏర్పాటు చేస్తామని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు పంట నష్టపోకుండా ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. మార్కెటింగ్, గిడ్డంగుల సంస్థ గోదాములపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండ్ల మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించడంతోపాటు కోహెడ పండ్ల ఎగుమతులు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని మౌలిక సదుపాయాలతో ఆ మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో వచ్చేనెలలో పరిశ్రమలు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

భారత వృద్ధి రేటు 7 శాతం

అంచనాలను సవరించిన ఐరాస

ఐరాస : భారత ఆర్థిక వద్ధి రేటు అంచనాలను ఐక్యరాజ్య సమితి సవరిస్తూ దాదాపు 7 శాతానికి పెంచింది. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు వినిమయం పెరగడమే అందుకు కారణమని తెలిపింది. 2024లో భారత్ 6.9 శాతం, 2025లో 6.6 శాతం వద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. బహిర్గత డిమాండ్ తక్కువగా ఉంటుందని.. దీనివల్ల సరుకుల ఎగుమతిలో వద్ధి దెబ్బతింటుందని తెలిపింది. అదే సమయంలో ఔషధ, రసాయన ఎగుమతులు బలంగా పుంజుకుంటాయని పేర్కొంది. జనవరిలో 2024 భారత వద్ధిరేటును ఐరాస 6.2 శాతంగా పేర్కొంది. దాన్ని ఇప్పుడు 0.7 శాతం పెంచడం విశేషం. 2025 అంచనాలను మాత్రం సవరించలేదు. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2023 నాటికి 5.6 శాతం నుంచి 2024లో 4.5 శాతానికి దిగొస్తుందని ఐరాస నివేదిక అంచనా వేసింది. దక్షిణాసియా ప్రాంతవ్యాప్తంగా ఇదే ధోరణి ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణం గరిష్టంగా ఇరాన్‌లో 33.6 శాతం, మాల్దీవుల్లో అత్యల్పంగా 2.2 శాతంగా నమోదవుతుందని అంచనా వేసింది. బంగ్లాదేశ్, భారత్‌లో ఆహారపదార్థాల ధరలు కొంత తగ్గినప్పటికీ.. ఇంకా అధిక స్థాయిల్లోనే ఉన్నాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2024లో 2.7 శాతం, 2025లో 2.8 శాతం వద్ధిరేటును నమోదు చేస్తుందని ఐరాస అంచనా వేసింది. 2024 అంచనాలను 0.3 శాతం పెంచడం విశేషం. అమెరికా సహా బ్రెజిల్, భారత్, రష్యా వంటి వర్ధమాన దేశాల్లో బలమైన వద్ధే అంచనాలను పెంచడానికి దోహదం చేసిందని తెలిపింది. అధిక ద్రవ్యోల్బణంతో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలు తక్కువ వద్ధిరేటుకు పరిమితం కానున్నాయని ఐరాస వెల్లడించింది.



వడ్లను కొనుగోలు చేయాలి

- వేములవాడ– కరీంనగర్ ప్రధాన రహదారిపై రైతుల ధర్నా
- వర్షానికి తడిసి మొలకెత్తుతోందని ఆవేదన
- వెంటనే లారీలను కేటాయించాలని డిమాండ్

నవతెలంగాణ - వేములవాడ

అకాల వర్షాలు వచ్చి ధాన్యం మొత్తం తడిసి ముద్దవుతోందని, వెంటనే లారీలను కేటాయించి వడ్లను కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములవాడ - కరీంనగర్ ప్రధాన రహదారిపై వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి కేంద్రం నుంచి తరలించాలన్నారు. ధాన్యం మార్కెట్‌కు వచ్చి 15రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో కాంటాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు తడిసి ధాన్యం మొలకెత్తుతోందని, వెంటనే సంబంధిత అధికారులు లారీలను కేటాయించి కొనుగోలు కేంద్రాల్లోంచి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. గంటపాటు రోడ్డుపై బైటాయించడంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ బీ.వీరప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనుపురం ఐకేపీ సెంటర్‌ను డీసీవో సందర్శించి పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వాహన ఫిట్‌నెస్ మస్ట్..!

స్కూల్, కాలేజ్ బస్సులకు మొదలైన సామర్థ్య పరీక్షలు

- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 23వేల బస్సులు
- ఇప్పటివరకు 10–20శాతం మేర బస్సులకే పూర్తి
- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే.. బండి సీజ్..!
- జూన్ 12 నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం

నవతెలంగాణ–సిటీబ్యూరో

జూన్ 12 నుంచి విద్యాసంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బడి బస్సుల సామర్థ్య పరీక్షలపై(ఫిట్‌నెస్) రవాణాశాఖ దృష్టి సారించింది. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. ప్రతియేటా మే 15న స్కూల్, కాలేజ్ బస్సుల ఫిట్‌నెస్ ముగుస్తుంది. ఈ క్రమంలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను నిర్ణీత సమయంలోపు ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల కోసం నగరంలోని అన్ని ఆర్టీవో ఆఫీసులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ఏర్పాట్లు చేశామని చెబుతున్నారు. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో విద్యా సంస్థల యాజమాన్యాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆర్టీఏ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

వాహనం రిజిస్ట్రేషన్ అయిన నాటి నుంచి 15ఏండ్ల వరకు మాత్రమే రోడ్ల మీద తిరిగే అవకాశం ఉంటుంది. అటువంటి సామర్థ్యం ఉన్న వాహనాలను మాత్రమే విద్యాసంస్థలు కేటాయించాలి. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీదికి వస్తే.. సీజ్ చేస్తారు. దానితో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు.

15 ఏండ్లు దాటితే.. నో ఫిట్‌నెస్..!



ప్రారంభమైన ఎఫ్‌సీల జారీ ప్రక్రియ

రాష్ట్రంలో దాదాపు 29వేలకుపైగా విద్యాసంస్థల బస్సులుండగా.. అందులో కాలం చెల్లినవి పోగా, 23వేలకు పైగా బస్సులుంటాయి. వీటిలో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 12,612 పాఠశాలలు, కళాశాలల బస్సులున్నాయి. వీటిలో హైదరాబాద్‌లో 2412, మేడ్చల్‌లో 5000, రంగారెడ్డిలో 5200 బస్సులున్నాయి. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా కాలం చెల్లిన బస్సులు(దాదాపు 6వేలు) మినహా అన్ని బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఈ నెల 15 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 10–20శాతం మేర బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అయ్యాయి. వచ్చే నెల 12వ తేదీలోగా వందశాతం బస్సులకు వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల్లో ఈ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏవీఎంఐ, ఎంవీఐ, కానిస్టేబుల్స్, హోంగార్డులతో కూడిన ప్రత్యేక బృందాలు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తాయి.

నిబంధనలు ఇలా..

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాల, కళాశాలల బస్సులకు తప్పనిసరిగా రవాణా శాఖ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో భాగంగా.. బ్రేకులు, ఇంజిన్ పనితీరు, డోర్లు, డ్రైవర్ అనుభవం తదితర అంశాలను పరిశీలిస్తారు. డ్రైవర్‌కు కనీసం అయిదేండ్ల అనుభవముండాలి. డ్రైవర్ లైసెన్స్‌తోపాటు క్లీనర్ ఫొటోలు, ఫోన్ నంబర్లు వాహనంలో ఉన్నాయా లేదా అనేది చూస్తారు. ఎంతమంది విద్యార్థులు ప్రయాణిస్తు న్నారనే లెక్కని, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సహా బస్సుల్లో అతికించాలి. బస్సు రూట్‌మ్యాప్‌ను ఆర్టీఏ కార్యాలయంలో అందజేయాలి. 15 ఏండ్లు దాటిన వాహనాలను అనుమతించరు. విద్యాసంస్థల బస్సులకు పసుపు రంగు వేసి నాలుగు వైపులా ఆర్టీఏ రిజిస్ట్రేషన్ నంబర్ రాయాలి. కొత్త టైర్లతోపాటు స్టెప్నీ ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ తప్పనిసరి. వర్షం పడితే నీళ్ల లోపలికి రాకుండా ఉండేందుకు బస్సు టాప్‌పై సీలింగ్ ఉండాలి. మూడు నెలలకోసారి డ్రైవర్ వైద్య పరీక్షలు చేసుకోవాలి. ఈ ఖర్చు యాజమాన్యమే భరించాలి. అలాగే డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూని ఫామ్ ధరించాలి. ఇలా మొత్తం 30–40 నియమ నిబంధ నలను పాటించిన బస్సులకు మాత్రమే ఎఫ్‌సీ మంజూరు చేస్తారు.

ప్రతి బస్సు ఫిట్‌గా ఉండాల్సిందే..
సి.రమేష్, జేటీసీ, హైదరాబాద్



విద్యార్థులను తరలించే ప్రతి బస్సు ఫిట్‌గా ఉండాలి. బస్సుకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ పొందాలి. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో స్కూలు పిల్లలను తీసుకెళ్లి ప్రమాదాల బారిన పడొద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీదకు వస్తే కచ్చితంగా సీజ్ చేయడంతోపాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. జేటీసీ, డీటీవోల పర్యవేక్షణలో ఆర్టీవో, ఎంవీఐ, ఏఎంవీఐలతో కూడిన ప్రత్యేక బృందాలను త్వరలో ఏర్పాటు చేస్తాం. వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వాహన బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ట్యాక్స్ రిసిప్ట్, పొల్యూషన్ సర్టిఫికెట్లతో పాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్.. వంటి పత్రాలు సిద్ధం చేసుకోవాలి.

పెండింగ్ బిల్లుల కోసం జీపీకి తాళం

- వెంటనే నిధులివ్వాలని మాజీ సర్పంచ్ డిమాండ్



నవతెలంగాణ - గంభీరావుపేట

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదని మాజీ సర్పంచ్ కార్యాలయానికి తాళం వేశారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పరిధిలోని కోళ్లమద్దిలో శుక్రవారం జరిగింది. గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన నిధులు ఇవ్వడం లేదని మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ భవనానికి సంబంధించిన ఈజీఎస్ నిధులు రూ.20లక్షలు రావాల్సి ఉందని, అలాగే సర్పంచ్‌గా పనిచేసిన మూడేండ్ల గౌరవ వేతనం కూడా రాలేదని తెలిపారు. గ్రామాభివృద్ధికి వెచ్చించిన దాదాపు రూ.8లక్షల బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించి పెండింగ్ బిల్లులను వెంటనే ఇప్పించాలని కోరారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం

- స్టేకు హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై స్టే జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్మానం వ్యవహారంపై సమావేశం నిర్వహించవచ్చని స్పష్టం చేసింది. అయితే, ఫలితాలను ప్రకటించరాదని షరతు విధించింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికిగాను ఏప్రిల్ 27న కలెక్టర్ ఇచ్చిన నోటీసును ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిని జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి బుధవారం విచారించారు. అవిశ్వాస తీర్మానం అమలు తర్వాత ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందనీ, అందువల్ల దానిపై సమావేశం నిర్వహించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. ప్రభుత్వ న్యాయవాది బి.మోహనారెడ్డి ప్రతివాదన చేస్తూ, అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ చేతులు ఎత్తే విధానంలో జరుగుతుందని వివరించారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, స్టేకు నిరాకరించింది. కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

వాళ్లొస్తే రామమందిరం కూల్చేస్తారు

- యూపీలో హద్దులు చెరిపేసిన మోడీ సర్కార్
- మత విద్వేషజాఢ్యం మరింత తీవ్రం



లక్నో : సార్వత్రిక ఎన్నికల సమరం కీలక దశకు చేరుకున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయన హోదాను సైతం మరిచి మత విద్వేష జాఢ్యాన్ని తీవ్రతరం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారసభల్లో ప్రజలను నిట్టనిలువునా చీల్చేలా మత విద్వేష ప్రేరేపిత ప్రసంగాలను మోడీ దట్టించారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీతో కూడిన విపక్ష ఇండియా బ్లాక్ గెలిస్తే అయోధ్యలో రామమందిరాన్ని బుల్డోజర్‌లతో కూల్చివేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బారాబంకి ర్యాలీలో ఆయన మాట్లాడుతూ..'ఇండియా' విజయం సాధిస్తే అయోధ్య రాముడు మళ్లీ టెంట్‌లోకి మారతాడని ఆరోపించారు. బుల్డోజర్లను ఎక్కడ నడపాలో ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌ని చూసి తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. యూపీలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను లక్ష్యం చేసుకొని వారి నివాసాలను బుల్డోజర్లతో కూల్చిసేసిన సంగతి తెలిసిందే. బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు బానిసలుగా మారాయని మోడీ ఆరోపించారు. లోకసభ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని చెప్పారు.

ఎన్నికల తర్వాత వాళ్లిద్దరూ విదేశాలకే !

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఇద్దరూ విదేశాలకు వెళ్లిపోతారంటూ మోడీ వ్యాఖ్యానించారు. ఫతేపూర్‌లో శుక్రవారం జరిగిన సభలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆ ఇద్దరూ (రాహుల్, అఖిలేశ్) విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటికే టిక్కెట్లు బుక్ చేసుకున్నట్టు తనకు తెలిసిందని ఆయన ఎద్దేవా చేశారు.

యూపీలో కాంగ్రెస్‌కు ఉనికే లేదని, ఆ పార్టీ మొత్తం ఒక కుటుంబ గౌరవాన్ని కాపాడే ప్రయత్నంలో ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎస్పీ రెండూ కుటుంబ పాలనకు, అవినీతికి అలవాటు పడిన పార్టీలని, ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు నేరస్థులు, మాఫియాలను ప్రోత్సహించడం, ఉగ్రవాదులపై సానుభూతి కనబరచడం సహా ఏమి చేయడానికైనా ఆ పార్టీలు వెనుకాడవని మోడీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు.

బీజేపీపై టీఎంసీది నకిలీ పోరాటం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం



హుగ్లీ : బీజేపీపై టీఎంసీ పోరాటం అంతా నకిలీనే అని సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ సలీం మండిపడ్డారు. తారకేశ్వర్‌లో సీపీఐ(ఎం) ఆరాంబాగ్ అభ్యర్థి బిప్లబ్ మొయిత్రా తరుపున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇండియా బ్లాక్ పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పరస్పర విరుద్ధంగా మాట్లాడటం చూస్తుంటే, బీజేపీకి వ్యతిరేకంగా ఆమె చేసిన నకిలీ పోరాటాన్ని స్పష్టంగా బయటపెడుతోందని విమర్శించారు. ఇండియా బ్లాక్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించానని మొదట పేర్కొన్నప్పటికీ, అభిషేక్ బెనర్జీపై సీబీఐ విచారణ జరుపుతోందని గ్రహించి, వెంటనే బ్లాక్‌కు దూరమయ్యారన్నారు. నితీష్‌కుమార్ కూడా ఇదే తరహాలో బ్లాక్‌కు దూరమయ్యారని విమర్శించారు. వివిధ దశల్లో కొనసాగుతున్న ఓటింగ్ సరళి బీజేపీ పట్టు కోల్పోవడం చూస్తుంటే, ఇండియా బ్లాక్ బలం ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. టీఎంసీ బీజేపీకి వ్యతిరేకంగా చేసినది నకిలీ పోరాటమేనని, నిజమైన పోరాటాన్ని లెఫ్ట్ ఫ్రంట్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు చేస్తున్నాయన్నారు. బీజేపీపై ఉమ్మడి పోరులో టీఎంసీ లేదని స్పష్టం చేశారు. సీఏఏకి వ్యతిరేకంగా టీఎంసీ వాయిస్ కూడా నకిలీదేనని ఆయన దుయ్యబట్టారు. సీఏఏ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సమయంలో టీఎంసీ ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారని గుర్తు చేశారు. సీఏఏ పార్లమెంటరీ జాయింట్ కమిటీలో తాను మాత్రమే లెఫ్ట్ ఎంపీనని, బిల్లుకు అసమ్మతి తెలుపుతూ 77 పేజీల నోట్‌ను అందించానని గుర్తుచేశారు. టీఎంసీకి చెందిన ముగ్గురు ఎంపీలు ఎప్పుడూ వ్యతిరేకించలేదని ఆయన విమర్శించారు.

అంగన్‌వాడీ టీచర్ మర్డర్ కేస్ నిందితుల అరెస్ట్

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు



నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపూర్ గ్రామంలో ఈనెల 14న జరిగిన అంగన్‌వాడీ టీచర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పస్రా సీఐ శంకర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ములుగు డీఎస్పీ ఎన్ రవీందర్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన రడం సుజాత.. తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్–3లో టీచర్‌గా పని చేస్తోంది. కాగా, ఈనెల 14న అంగన్వాడీలో విధులు ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరగా.. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు మిస్సయింది. దాంతో తన గ్రామంవైపే వెళుతున్న ఆకుదారి రామయ్య, పగిడి జంపయ్యతో ముందే పరిచయం ఉండటంతో వారి వాహనంపై బయలుదేరింది. కాగా ఆమెను వారు నాంపల్లి గ్రామ శివారులోని నీళ్ల గొర్రె వద్ద దించారు. అనంతరం అడవిలోకి తీసుకెళ్లి ఆమెపై ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. ఆమె ప్రతిఘటించడంతో పగిడి జంపయ్య ఆమె తలపై రాయితో కొట్టి, ఆమె స్కార్ఫ్‌ను మెడకు చుట్టి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారం గొలుసు, హ్యాండ్ బ్యాగ్ తీసుకొని మొబైల్ ఫోన్‌ను అడవిలో దూరంగా పడేసి.. తిరిగి వారి రొయ్యూరు గ్రామానికి వెళ్లిపోయారు. మృతురాలి కొడుకు రణం చరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి సీసీ పుటేజ్, వారి కాల్ డేటా ఆధారంగా పూర్తి ఆధారాలు సేకరించారు. శుక్రవారం ఉదయం కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మోటార్ సైకిల్‌పై తాడ్వాయి నుండి వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. నిందితులు రొయ్యూరు గ్రామానికి చెందిన ఆకుదారి రామయ్య (45), పగిడి జంపయ్య (42)గా పోలీసులు గుర్తించారు. నిందితుల నుండి మోటార్ సైకిల్‌తోపాటు మూడు తులాల పుస్తెలతాడు, హ్యాండ్ బ్యాగ్, మృతురాలి బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి అతి తక్కువ సమయంలో నిధులను పట్టుకున్న పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్ఐ చింత నారాయణ, హెచ్‌సీ కిషన్, పీసీ పూజారి రమేష్, జాజ సాంబయ్య, అప్పాల రమేష్, గోపు రాజీవ్, కాసగోని రాజేష్, పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

అన్నదాత.. కన్నీటి గోస



తడిసిన ధాన్యం.. కొనని వైనం

- తేమ పేరిట అదనపు తూకం
- రవాణా కోసం అదనపు వసూళ్లు
- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతుల ఆందోళన

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎండింది. పండిన కొంత ధాన్యాన్ని కల్లాల్లో పోస్తే కొనే దిక్కులేక వర్షాలకు తడిసిపోతుంది. తేమ, రంగుమారి, మొలకొచ్చిందంటూ మద్దతు ధర ఇవ్వట్లేదు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా యాసంగి ధాన్యం అమ్ముడుపోక ఇబ్బందులు పడుతున్న అన్నదాత కన్నీటి గోస ఎవరికీ పట్టట్లేదు. తరచూ వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ఆరబోసి అమ్ముదామనే లోపే మళ్లీ వర్షం పడి తడుస్తుండటంతో నెలల తరబడి మార్కెట్‌లోనే మగ్గుతోంది. తేమ, రంగుమారిందని, మొలకొచ్చిందని కొనడం లేదు. మరో పక్క అదనపు తూకమేసి దోచుకుంటున్నారు. కాంటా వేసిన బస్తాల్ని మిల్లుకు తరలించేందుకు రవాణా చార్జీల పేర వసూళ్లకు పాల్పడుతున్నారు.

నవతెలంగాణ–మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి పంట 7 లక్షల ఎకరాల వరకు సాగైంది. సంగారెడ్డి జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు కేవలం 55,891 మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. మిగతా ధాన్యమంతా మార్కెట్లలోనే మగ్గుతున్నది. సిద్దిపేట జిల్లాలో గతేడాది ఇదే యాసంగి సీజన్‌లో 2,73,339 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ యాసంగి సీజన్‌లో మాత్రం 1,25,878 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేశారు. మెదక్ జిల్లాలో వరి సాగు ఆలస్యమైంది. పూర్తిగా నీటిపారుదల వనరులపై ఆధారపడి వరి సాగవడంతో ఆలస్యంగా కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 400 కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం రాసులు కుప్పలు కుప్పలుగా మిగిలిపోయాయి. 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తే సగం కూడా కాంటా వేయలేదు. మూడు జిల్లాల్లోనూ కరువు పరిస్థితుల వల్ల సాగునీటి ఎద్దడి ఏర్పడింది. దాంతో వరిపైర్లు ఎండిపోయి నష్టమేర్పడింది. పంట కోత దశలో అకాల వర్షాలు పడి కొంత దెబ్బతిన్నది. నష్టపోగా మిగిలిన పైర్లను కోసి ధాన్యాన్ని మార్కెట్‌లో పోసిన రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడుస్తుండటంతో రాసుల కింద వడ్లు మొలకెత్తిపోతున్నాయి. ఒక్కో రైతు నెల రోజులకు పైగా మార్కెట్‌లోనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. ధాన్యం కాంటా వేసేందుకు టోకెట్ పద్ధతి అనుసరిస్తున్నారు. ఒక రైతు ధాన్యం కాంటా వేయడమే కాకుండా ఆ బస్తాల్ని మిల్లులకు తరలించాలి. సరిపడా లారీలు లేకపోవడంతో మార్కెట్లలో ధాన్యం బస్తాలు పేరుకుపోయి కాంటాలు నిలిచిపోతున్నాయి.

తేమ పేర అదనపు తూకం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్, సాధారణ రకం రెండు కేటగిరీలుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. యాసంగి ధాన్యంలో తేమ శాతం చాలా తక్కువ ఉంటుంది. కానీ.. గత నెలలో కోతలు షురూ అయ్యింది మొదలు ప్రస్తుతం వరకు తరచూ వర్షాలు కురుస్తుండటంతో ఆరబోసిన ధాన్యం తడుస్తోంది. దాంతో కాంటా వేసే సమయంలో మార్కెట్ నిర్వాహకులు అదనపు తూకం వేస్తున్నారు. 40 కిలోల చొప్పున ఒక్కో బస్తా తూకం వేయాలి. గోనె సంచి బరువు 600 గ్రాములు ఉంటుంది. అది కలుపుకుని 41 కిలోల చొప్పున కాంటా వేస్తారు. కానీ.. ప్రస్తుతం మార్కెట్లలో 43 నుంచి 44 కిలోల వరకు తూకం వేస్తున్నారు. ఒక్కో బస్తాకు 3 కిలోలు అదనంగా తూకం వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మిల్లు పాయింట్ వద్ద లారీ లోడ్ ధాన్యాన్ని తూకం వేస్తే శాటేజీ వస్తుందనే నెపంతో రైతుల ధాన్యాన్ని అదనంగా తూకం వేసి మిల్లర్లు, అధికారులు, మార్కెట్ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్న పరిస్థితి ఉంది.

రవాణా చార్జీల పేర రైతు నుంచి రూ.2 వేలు వసూళ్లు

కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోశాక సీరియల్‌ను బట్టి టోకెన్ ఇస్తారు. ఆ సీరియల్ వచ్చాకనే ధాన్యం కాంటా వేస్తారు. అయితే ధాన్యం కాంటా వేశాక బస్తాల్ని లారీల్లో లోడ్ చేసి మిల్లు పాయింట్‌కు తరలించాలి. అయితే లారీలు సరిపడా లేకపోవడం, మిల్లర్లు స్థలం లేదనే నెపంతో లారీల్లో వచ్చే ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోవడం, హమాలీల కొరత చూపడం వల్ల మార్కెట్‌లో తూకం వేసిన బస్తాలు పేరుకుపోతున్నాయి. కాంటా వేసిన బస్తాల్ని రవాణా చేశాకనే మిగతా రైతుల ధాన్యాన్ని కాంటా వేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. మిల్లు పాయింట్ వద్ద వెంట వెంటనే అన్‌లోడ్ కాకపోవడంతో లారీలు అక్కడే ఆగిపోతున్నాయి. దీంతో లారీలకు రవాణా ఖర్చుల కోసమని ఒక్కో రైతు నుంచి వెయ్యి, రెండు వేలు వసూలు చేస్తున్నారు. రైతులు డబ్బులు ఇవ్వకపోతే కాంటా వేయట్లేదు. కాంటా వేసినా ఆ ధాన్యాన్ని మిల్లుకు ఎగుమతి చేయకుండా వదిలేస్తున్నారు. కాంటా వేసిన ధాన్యం మిల్ పాయింట్‌కు చేరకపోతే రైతుకు ఆన్‌లైన్ పద్ధతిలో డబ్బుల చెల్లింపులు జరగవు. దీంతో రైతులు భారమైనప్పటికీ రవాణా చార్జీలు ఇస్తున్నారు. మరో పక్క క్వింటాల్ ధాన్యం కాంటా వేసి లోడ్ చేసినందుకు రూ.45 రైతుల నుంచే వసులు చేస్తున్నారు. ఆ డబ్బుల్ని రైతు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయాల్సి ఉన్నా ఎవ్వరికీ ఇవ్వట్లేదు.

మార్కెట్‌లో మూలుగుతున్న ధాన్యం రాశులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు మూలుగుతున్నాయి. ఈ నెల 12, 16న మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షం పడింది. ఈదులు గాలులు వీచాయి. దీంతో మార్కెట్లలో పోసిన ధాన్యం రాసులు తడిసిపోయాయి. పైన కప్పిన పట్టాలు గాలులకు కొట్టుకపోవడం, వరద నీరంతా రాసుల కింద చేరడంతో ధాన్యం తడిసిపోయింది. కల్లాల వద్ద రైతులు ధాన్యం తడవకుండా అనేక తిప్పలు పడాల్సి వస్తోంది. మెదక్, పాపన్నపేట, టేక్మాల్, హవేళీఘన్‌పూర్, చిలిపిచేడు, కొల్చారం, శంకరంపేట, నిజాంపేట, రామాయంపేట, నార్సింగ్, హత్నూర, సంగారెడ్డి, పుల్కల్, జోగిపేట, నారాయణఖేడ్, వట్‌పల్లి, కోహీర్, సదాశివపేట వంటి ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారు. కాంటా వేసిన ధాన్యం బస్తాల్ని మిల్లుకు రవాణా చేయాలని కోరుతూ చిలిపిచెడు ప్రాంత రైతులు రోడ్డుపై ఆందోళన చేయడంతో ఆ మండలానికి అదనంగా పది లారీలను ఏర్పాటు చేశాం.

నెల రోజులైంది కాంటా కాలే: రాజుగౌడ్, రైతు మల్కాపురం

హత్నూర మండలంలోని మల్కాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో 300 క్వింటాళ్ల ధాన్యం పోసి నెల రోజులైంది. ఇంత వరకు సీరియల్ రాలేదని కాంటా వేయలేదు. మార్కెట్‌లో పోసిన ధాన్యం చుట్టూ వర్షం నీరు చేరి తడుస్తోంది. కింద భాగమంతా మొలకొస్తుంది.

కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. లారీల్లేవని, హమాలీల్లేరని, మిల్లర్లు దించుకోవడంలేదని చెప్పడం తప్ప ధాన్యం కాంటా వేస్తున్న పరిస్థితి లేదు. వర్షాలు ఇట్లనే కురిస్తే మొత్తం మొలకొచ్చి నష్టపోవాల్సి వస్తది. వానలు పడుతుంటే కంటికి నిద్ర కరువైంది.

బిజినెస్

డిష్ టివి స్మార్ట్ ప్లస్ ఆవిష్కరణ

- రూ.279కే టివి, ఒటిటి కంటెంట్స్
- మార్కెట్ వాటా పెంపు లక్ష్యం
- సీఈఓ మనోజ్ దోభాల్ వెల్లడి



హైదరాబాద్ : ప్రముఖ డిటిహెచ్ సేవల సంస్థ డిష్ టివి కొత్తగా 'డిష్ టివి స్మార్ట్ ప్లస్' సర్వీసులను ప్రారంభించినట్లు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో దీనిని నటీ శ్రద్ధ దాస్‌తో కలిసి ఆ కంపెనీ సిఇఒ మనోజ్ దోభాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. రూ.279కే టివి సహా ఒటిటి కంటెంట్స్‌ను అందిస్తున్నామన్నారు. తమ వేదికపై 21 ఒటిటి యాప్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు రోజులకు ఒక్క ఒటిటిని మార్చుకోవడానికి వీలుందన్నారు. ఈ సేవలను ఎక్కడి నుంచైనా ఏ తెరపైనా అయినా వీక్షించవచ్చన్నారు. డిటిహెచ్ మార్కెట్‌లో తమకు 21 శాతం వాటా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రధానంగా ఉన్నామ న్నారు. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన డిష్ టివి స్మార్ట్ ప్లస్ సేవలతో మార్కెట్ వాటాను 2-3శాతం పైగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. డిటిహెచ్ సేవలకు ప్రతీ నెల రుసుం చెల్లించలేని వారి కోసం ప్రత్యేకంగా జింగ్ సూపర్ ప్లాన్‌ను అందిస్తున్నా మన్నారు. ఒక్క సారి రూ.1500 చెల్లించి బాక్స్ తీసుకోవడం ద్వారా 230 చానల్స్‌ను ఉచితంగా వీక్షించవచ్చని.. కావాలనుకుంటే చెల్లింపు చానల్స్‌ను జోడించుకోవచ్చన్నారు.

విదేశీ ఇన్వెస్టర్లకు 'ఎన్‌డిఎ' భయాలు

- రూ.30వేల కోట్లు ఉపసంహరణ
- ఒక్క నెలలోనే వెనక్కి..

ముంబయి : భారత్‌లో ఎన్‌డిఎ ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవచ్చనే అంచనాలు విదేశీ ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెరిగాయి. దీంతో ఇక్కడి స్టాక్ మార్కెట్లలోని ఈక్విటీల్లోని పెట్టుబడులను పెద్ద సంఖ్యలో ఉపసంహరించుకుంటున్నారు. ఎన్నికల రిస్కుల ఆందోళనతో కేవలం ఒక్క నెలలోనే అంటే మేలో ఇప్పటి వరకు 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30వేల కోట్లు) పెట్టుబడులను గ్లోబల్ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. జూన్ 2023 తర్వాత ఇవే అత్యధిక ఉపసంహరణలు అని వెల్లడించింది. ఇక్కడి పెట్టుబడులను చైనాకు తరలించుకుపోతున్నారని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ తక్కువ ప్రగతి, కీలకమైన ఆర్థిక సంస్కరణలను చేపట్టే అతని సామర్థ్యం పరిమితి తగ్గుతుందనే అంచనాల్లో భారత ఈక్విటీ మార్కెట్లు అనిశ్చిత్తిని ఎదుర్కొం టున్నాయని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. "భారత్‌లో ప్రస్తుత ఎన్నికల చుట్టూ ఉన్న రిస్కులు పెరిగాయి. అయితే చైనాలో ప్రతికూలత భయపడినంత ఏమి లేదనే సంకేతాలు ఉన్నాయి." అని న్యూయార్క్‌లోని ఏరియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్‌ఎల్‌సిలో పోర్ట్‌ఫోలియో మేనేజర్ క్రిస్టీన్ ఫిల్‌పాట్స్ పేర్కొన్నారు. భారత్‌లో జూన్ 1న పోలింగ్ ముగియనుంది. జూన్ 4న ఓట్లను లెక్కించనున్న విషయం తెలిసిందే.

ఆశీర్వాద్ నుంచి 'హిమాలయన్ పింక్ సాల్ట్'



హైదరాబాద్ : ఐటిసి ఆశిర్వాద్ కొత్తగా 'హిమాలయన్ పింక్ సాల్ట్'ను విడుదల చేసినట్లు ప్రకటించింది. సైందవ లవణంగా లేదా సెంధా నమక్‌గా పేరు పొందిన ఈ గులాబీ రంగు ఉప్పును హిమాలయాల్లోని గనుల నుండి సేకరిస్తున్నట్లు పేర్కొంది. దీని వల్లన సహజమైన ఉప్పుగా పరిగణిస్తారని ఆ సంస్థ ప్రతినిధి అనుజ్ కుమార్ రస్తగి తెలిపారు. కృత్రిమ రంగులు చేర్చడం వలన ఉప్పు గులాబీ రంగులో కనిపిస్తోందని వినియోగదారుల మనస్సులో ఉన్న భయాలను పోగొట్టడానికి హిమాలయన్ పింక్ సాల్ట్‌ను భరోసాతో అందుబాటులోకి తెచ్చిందన్నారు. హిమాలయన్ పింక్ ఉప్పులో కాల్షియం, మెగ్నీషియం వంటి ప్రధానమైన మినరల్స్ ఉన్నాయన్నారు.

సైబర్ భద్రతపై ఎస్‌బిఐ క్యాంపెయిన్



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సైబర్ భద్రతపై అవగాహన క్యాంపెయిన్‌ను చేపట్టింది. శుక్రవారం హైదరాబాద్‌లోని కోటి లోకల్ హెడ్ ఆఫీసులో ఈ కార్యక్రమ ప్రచార రథాన్ని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్లు మంజూ శర్మ, దేబాషిష్ మిత్రా జెండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున ప్రజలు సైబర్ మోసాలకు గురైతున్నారు. అలాంటి సమయంలో 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయడం లేదా సైబర్‌క్రైమ్.జిఓవి.ఐఎన్ పోర్టల్‌కు సమాచారం అందించేలా.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మంజూ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎకె సారథి, డిజిఎంలు జితేంద్ర కుమార్ శర్మ, మాలతి నంబీర్, సునీల్ కుమార్ గోయల్, ఇతర ఉన్నతాధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీ షో ప్రారంభం



హైదరాబాద్ : ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీ షో 2వ ఎడిషన్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల ప్రదర్శనను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. దేశంలో హరిత భవనాలపై మరింత అవగాహన పెరగడానికి ఇలాంటి కృషి మరింత జరగాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఈ వేదిక కొనుగోలుదారులు, అమ్మకం దారులకు మంచి అవకా శాలను కల్పిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 17, 18, 19 తేదిల్లో జరగనున్న ఈ ప్రదర్శనలో నివాస ప్రాజెక్టులను సందర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఐజిబిసి నేషనల్ వైస్ ఛైర్మన్ సి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రీన్ బిల్డింగ్‌లతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. దేశంలో గ్రీన్ బిల్డింగ్ ఉద్యమాన్ని ముం దుకు తీసుకెళ్లేం దుకు తమ ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు.

ఎయిర్ టాక్సీ సర్వీసుల్లోకి డ్రోగో డ్రోన్స్..!

- వచ్చే ఏడాది రూ.200 కోట్ల ఆదాయం లక్ష్యం
- సంస్థ సిఇఒ యశ్వంత్ బోంతు వెల్లడి

హైదరాబాద్ : త్వరలోనే ఎయిర్ టాక్సీ సేవలను ప్రారంభించే యోచనలో ఉన్నామని డ్రోగో డ్రోన్స్ సిఇఒ యశ్వంత్ బొంతు తెలిపారు. అదే విధంగా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ రెగ్యూలేటరీ సంస్థల అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 30 లక్షల ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేసేందుకు ఇఫ్కోతో ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటు కృషికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో శుక్రవారం ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ కంపెనీ డ్రోగో డ్రోన్స్ సర్వే, మ్యాపింగ్, ఉత్పత్తుల రవాణా తదితర రంగాలకు సేవలను విస్తరిస్తుందని తెలిపారు. సాధారణ డ్రోన్‌లను ఉపయోగించే పరిజ్ఞానం ఉన్న రైతులు కృషి డ్రోన్‌ను కూడా ఆపరేట్ చేయవచ్చన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన డ్రోన్ల ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో 30 లక్షల ఎకరాల్లో పురుగుమందులు పిచికారీ చేసేందుకు డ్రోగో డ్రోన్స్ ఇఫ్కోతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యశ్వంత్ తెలిపారు. దేశవ్యాప్తంగా డ్రోన్ సర్వీస్ హబ్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టనున్నామని, 1000 మంది డ్రోన్ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తామని యశ్వంత్ వెల్లడించారు. వచ్చే ఏడాదికి రూ.200 కోట్ల ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

'జిందాల్' అక్రమ లాకౌట్

ఒడిశాకు కార్మికుల బదిలీ నిరసనగా ఉద్యోగుల ధర్నా

విజయనగరం: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమకు శుక్రవారం ఉదయం నుంచి యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిసరుకుకు డిమాండ్ ఎక్కువగా ఉండడం, ఇతర కారణాల వల్ల పరిశ్రమను మూసివేస్తున్నట్లు జిందాల్ పరిశ్రమ జిఎం దినేష్ శర్మ, హెచ్ఆర్ జిఎం గోపాల్‌కృష్ణ తెలిపారు. కార్మికులందరినీ ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్‌లోని జిందాల్ పరిశ్రమకు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పరిశ్రమ గేటు వద్ద నోటీసు బోర్డు పెట్టారు.

మళ్లీ పరిశ్రమను తెరిచినప్పుడు కార్మికులందరినీ ఇక్కడే పనిలో పెట్టుకుంటామని, పరిశ్రమను శాశ్వతంగా మూసివేయడం లేదని, ముడిసరుకు ధరలు తగ్గేంత వరకు మాత్రమే మూసివేస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. ఈ కంపెనీలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు 450 మంది పనిచేస్తున్నారు. లాకౌట్ నేపథ్యంలో జిందాల్ పరిశ్రమ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇక్కడే ఉపాధి కల్పించాలి



లాకౌట్‌ను నిరసిస్తూ ధర్నా చేస్తున్న కార్మికులు

యాజమాన్యం నిర్ణయాన్ని నిరసిస్తూ కార్మికులు పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వైఎస్ఆర్‌టియుసి నాయకులు నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ లాకౌట్‌ను ఎత్తివేసి కార్మికులకు, ఉద్యోగులకు ఇక్కడే పని కల్పించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ప్రకటన చేయకుండా లాకౌట్ విధించడం అన్యాయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. కార్మికుల జీతభత్యాలు ఈ నెలాఖరు వరకు చెల్లించాలని కోరారు. కార్మికులను, ఉద్యోగులను జాజ్‌పూర్ పంపిస్తే రవాణా సదుపాయంతో పాటు హాస్టల్, భోజన సదుపాయం, అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో మాట్లాడి లే ఆఫ్ వేతనంపై నిర్ణయం వెల్లడిస్తామని పరిశ్రమ జిఎం తెలిపారు. కార్యక్రమంలో లక్కవరపుకోట ఎంపిపి గేదెల శ్రీనివాస్, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, ఉత్తరాపల్లి, అప్పలపాలెం, నిమ్మలపాలెం సర్పంచులు సింగంపల్లి గణేష్, కోన దేముడు, కోట్యాడ శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

షుగర్ మందుల ధరలు తగ్గింపు

- కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా వినియోగించే 41 ఔషధాలతోపాటు మధుమేహం, హృద్రోగ, కాలేయ వ్యాధుల చికిత్సలో వినియోగించే ఆరు మందుల ధరలను తగ్గించింది. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం.. యాంటాసిడ్‌లు, మల్టీవిటమిన్‌లు, యాంటీబయాటిక్ ఔషధాల ధరలు భారీగా తగ్గనున్నాయి. ప్రపంచంలో అత్యధిక మధుమేహవ్యాధిగ్రస్తులు ఉన్న దేశాలలో భారత్ కూడా ఒకటి. ప్రస్తుతం భారత్‌లో 10 కోట్ల మందికి పైగా షుగర్ పేషెంట్లు ఉన్నట్లు అంచనా. కాగా, వివిధ ఔషధాల ధరల తగ్గింపునకు సంబంధించిన సమాచారాన్ని డీలర్లు, స్టాకిస్టులకు తక్షణమే తెలియజేయాలని ఫార్మా కంపెనీలను ఎన్‌పిపిఎ ఆదేశించింది. నిత్యావసర ఔషధాల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూసేందుకు ఎన్‌పిపిఎ 143వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సిబిఐ కోర్టుకు హాజరైన అవినాష్ రెడ్డి



హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులు శుక్రవారం నాంపల్లిలోని సిబిఐ కోర్టులో విచారణకు హాజరయ్యారు. కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కోర్టుకు స్వయంగా వచ్చారు. చంచల్‌గూడ జైలులో ఉన్న నలుగురు నిందితులను అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. తదుపరి విచారణను న్యాయస్థానం జూన్ 11కి వాయిదా వేసింది.

అజ్ఞాతంలోకి పిన్నెల్లి సోదరులు!



- మాచర్లలో గన్‌మెన్‌లను వదిలి హైదరాబాద్ పయనం



గుంటూరు: గృహనిర్బంధంలో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి శుక్రవారం అజ్ఞాతంలోకి వెళ్లారని తెలిసింది. పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల పోలింగ్ రోజున, ఆ తర్వాత వరుసగా రెండు రోజులపాటు జరిగిన ఘర్షణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో తమను కూడా అరెస్టు చేస్తారోమోనన్న భయంతో వీరు మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లిపోయినట్టు సమాచారం. వెళ్లే ముందు ఎమ్మెల్యే తన గన్‌మెన్లను ఎస్‌పి కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఘర్షణలకు కారణమైన వారిలో పలువురు టిడిపి, వైసిపి అభ్యర్థులు కూడా ఉన్నారని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో పిన్నెల్లి సోదరులతోపాటు పలువురిని పోలీసులు గృహనిర్బంధంలోనే ఉంచారు. అయినా, వీరు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీడియాకు వాట్సప్‌లో ఒక మెసేజ్ పంపారు. తాము వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్ వచ్చామని, తాము ఎక్కడికీ పారిపోవాల్సిన అవసరం లేదని ఇందులో పేర్కొన్నారు. టిడిపి వారు తనపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని విమర్శించారు. కాగా, పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోంది. శుక్రవారం నాడు కేంద్ర బలగాలు మాచర్లకు చేరుకున్నాయి.

అఖిలప్రియ అనుచరుడిపై హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అనుచరుడు నిఖిల్‌పై హత్యాయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి షర్ఫుద్దీన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 14న రాత్రి 12 గంటల సమయంలో అఖిలప్రియ నివాసం ఇంటి బయట నిఖిల్ అలియాస్ పెద్ద సుబ్బరాయుడు ఉండగా దుండగులు మారుతి కారులో వచ్చి నిఖిల్‌ను చంపాలన్న ఉద్దేశంతో కారుతో ఢీకొట్టారు. కింద పడ్డ నిఖిల్‌పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దుండగుల నుంచి నిఖిల్ తప్పించుకున్నారు. అఖిలప్రియ అనుచరుడు చాకలి మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పివిఎస్ఆర్ గోడౌన్ సమీపంలో పట్టణానికి చెందిన నిందితులు నూలి అశోక్, రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మధుమేహానికి ఆయుర్వేదిక్ మందులంటూ మోసం

సంపూర్ణ ఆయుర్వేద నిలయంలో డీసీఏ తనిఖీల్లో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డయాబెటిక్‌తో బాధపడుతున్న రోగులను మోసం చేస్తున్న సంపూర్ణ ఆయుర్వేద నిలయం గుట్టురట్టైంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ గ్రామంలో ఉన్న సంపూర్ణ ఆయుర్వేద నిలయంలో డయాబెటిక్ చికిత్సకు ఆయుర్వేద ఔషధం పేరుతో ఇస్తున్న మందులో అల్లోపతిక్ ఔషధాలను కలుపుతున్నట్టు డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ పౌడర్‌ను పరీక్షలు చేయగా ఇందులో అల్లోపతిక్ యాంటీ డయాబెటిక్ డ్రగ్స్ అయిన మెట్ ఫార్మిన్, గ్లిమెపైరైడ్, గ్లిక్లజైడ్ కలుపుతున్నట్టు తేలింది. అల్లోపతిక్ ఔషధాలను కలుపుతూ ఆయుర్వేద మందులుగా అమ్ముతున్న వారిపై డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నర్సంపేట, గోదావరిఖని ప్రాంతాల్లో మందులను నిర్దేశించిన ధరల కన్నా అధిక ధరలకు అమ్ముతున్నట్టు డ్రగ్ అధికారులు తనిఖీల్లో వెల్లడైంది. జెన్ బెక్ట్ ఆయింట్ మెంట్ 5 గ్రాముల ట్యూబ్‌ను, థైమీన్ ఇంజెక్షన్‌ను అధిక ధరలకు అమ్ముతుండగా పట్టుకున్నారు. బహిష్టుకు సంబంధించిన ఇబ్బందులకు చికిత్స అంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ అమ్ముతున్న ఆయుర్వేద ఔషధం ఫెమిజోయ్ సిరప్ జడ్చర్లలో స్వాధీనం చేసుకున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం, నిజాంపేట్ గ్రామంలో ఎడ్ల హరికృష్ణ అవసరమైన అర్హతలు లేకుండా తనకు తాను రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా చెప్పుకుంటూ మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు గుర్తించారు. ఈ దాడి సందర్భంగా రూ.70 వేల విలువైన 40 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.

గ్యారంటీల అమలు చేతకాకే తెరపైకి స్థానిక ఎన్నికలు : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో ఆరు గ్యారంటీల హామీ అమలు చేతకాక దాటవేసేందుకే స్థానిక సంస్థల ఎన్నికల అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారంటీల అమలుకు ఎన్ని నిధులు అవసరం? వాటి విధివిధానాలేమిటి? ఎందుకు కసరత్తు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ వ్యతిరేకం కాదనీ, పథకాల అమలును దాటవేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణ పాఠం చెప్పాలని ప్రజల్ని కోరారు. కేంద్రం మంజూరు చేసే నిధులు గ్రామ పంచాయతీలకు నేరుగా అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వమూ బీఆర్ఎస్ బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. సర్పంచులు లేక స్థానిక సంస్థల్లో పాలన పడకేసిందని తెలిపారు. కాంగ్రెస్‌కు అధిక స్థానాలను గెలిపిస్తే కేంద్రం నిధుల్ని దారిమళ్లించే ప్రమాదముందని హెచ్చరించారు.

త్వరలో గ్రూప్-4 మెరిట్ జాబితా

- జనరల్ అభ్యర్థులు 1:3 నిష్పత్తిలో ఎంపిక
- అభ్యర్థులు ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోండి : టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 రాతపరీక్షలకు సంబంధించి త్వరలో మెరిట్ జాబితాను విడుదల చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. జనరల్ అభ్యర్థులు 1:3 నిష్పత్తి, వికలాంగులు 1:5 నిష్పత్తిలో ఎంపిక చేస్తామని తెలిపింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి తొమ్మిదో తేదీన గ్రూప్-4 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించామని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, బీసీలైతే నాన్ క్రీమిలేయర్ ధ్రువపత్రం, విద్యా సంబంధ ధ్రువపత్రాలు, నివాస ధ్రువపత్రం, కులం, వికలాంగుల ధ్రువపత్రం, రిజర్వేషన్ అభ్యర్థులు అందుకు సంబంధించిన ధ్రువపత్రం, విద్యార్హతల ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలనకు అవి తప్పనిసరిగా ఉండాలని కోరారు. ఆ సమయంలో ధ్రువపత్రాల్లేకుంటే ఆ తర్వాత అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. గతేడాది జూలై ఒకటిన గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. పేపర్-1కు 7,62,872 (80 శాతం) మంది, పేపర్-2కు 7,61,198 (80 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 7,26,837 మందిని జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ఎంపిక చేశారు. త్వరలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022, డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

కరువు సాయం కోసం కేంద్రానికి లేఖ రాశావా?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కిసాన్ కాంగ్రెస్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయనీ, ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ ఆరోపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి...కరువు సాయం కోసం కేంద్రానికి కనీసం లేఖ రాశావా? అని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని విలేకర్లతో వారు మాట్లాడారు. కరువు సాయం కోసం కేంద్రానికి లేఖ రాయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను కోరినా...చలనం లేదని విమర్శించారు. ఓట్ల కోసం ఆరాటమే తప్ప ప్రజల కోసం ఆలోచన చేయడం లేదన్నారు. గతంలో కూడా ఉమ్మడి రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర కరువు వస్తే...నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఒక బృందాన్ని పంపి రూ. 2,800 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం కరువు వచ్చినప్పుడు రాష్ట్రానికి రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆధారాలు లేకుండా కేంద్ర మంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్‌పై జీఎస్టీ వద్దంటూ కాంగ్రెస్ లేఖ రాసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా బాధ్యతారాహిత్యంగా మాట్లాడం మానుకోవాలని వారు హితవు పలికారు.

అక్కడ పోలింగ్ నమోదు ఎందుకు తక్కువైంది : టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో పోలింగ్ నమోదు ఎందుకు తక్కువైందని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించారు. అందుకు కారణాలను విశ్లేషించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతం కంటే ఈసారి 0.7 శాతం పోలింగ్ తక్కువగా నమోదు అయిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కూడా చాలా తక్కువ మంది ఓట్లు వేశారని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఎంత మంది ఉన్నారంటూ ఎన్నికల కమిషన్‌ను అడిగితే గోప్యంగా ఉంచుతున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలని సూచించారు. బోగస్ ఓట్లు...డూప్లికేట్ ఓట్లు...మరణించిన వారికి కూడా ఓట్లు ఉన్నాయని ఆయన ఆరోపించారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ మూడో తేదీ వరకు అవి జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ౦ఎఱవ.ఎస్త్రప్ర.ప్రశీఇ.ఱఅ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముందని తెలిపారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను సరిచూసుకోవాలనీ, ఫొటో, సంతకం, పేరు, మాధ్యమం, సబ్జెక్టులు వంటి వాటిపై అభ్యంతరాలుంటే సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లు లేదా డీఐఈవోలకు తెలియజేయాలని సూచించారు. వెంటనే వాటిని సరిచేసుకోవాలని కోరారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను ప్రిన్సిపాళ్ల సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

టెట్ పరీక్షా కేంద్రాల కేటాయింపులో విద్యాశాఖ నిర్లక్ష్యం

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షా కేంద్రాల కేటాయింపులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించే టెట్ పరీక్షలకు అభ్యర్థులు తమ సొంత జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ఆప్షన్ పెట్టుకున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం వేలాది మంది అభ్యర్థులకు ఇష్టానుసారం వేరే జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని వివరించారు. ఆదిలాబాద్ వారికి సిద్ధిపేట, హైదరాబాద్‌లో, కరీంనగర్ వారికి వరంగల్, హైదరాబాద్‌లో, ఖమ్మం వారికి సిద్ధిపేటలో ఇలా ఇష్టానుసారంగా వివిధ జిల్లాల వారికి ఇతర జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్షలంటూ ఇలా పరీక్షా కేంద్రాలను ఇతర జిల్లాలకు కేటాయించడం ద్వారా అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షా ఫీజు రూ.వెయ్యి తీసుకుని మళ్లీ ఇప్పుడు కేంద్రాలను దూరపు జిల్లాల్లో ఇవ్వడం సరికాదని తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ అడ్మిట్ కార్డులు విడుదల

- దేశవ్యాప్తంగా 26న రాతపరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష ఈనెల 26న జరగనుంది. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. వారిలో 1.91 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 26 వరకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. ఈనెల 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను నిర్వహిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్షలు రాసిన అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను ఈనెల 31 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ప్రాథమిక కీని వచ్చేనెల రెండో తేదీన, ఫలితాలను అదేనెల తొమ్మిదిన విడుదల చేస్తారు. అదే తేదీ నుంచి ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ) కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూన్ 12న ఏఏటీ రాతపరీక్ష జరుగుతుంది. అదేనెల 15న ఏఏటీ ఫలితాలు విడుదలవుతాయి. ఐఐటీల్లో సీట్ల ప్రవేశాల ప్రక్రియ జూన్ 10 నుంచి ప్రారంభమవుతుంది.